ప్రపంచ సాహిత్యం - 19



మూడు శతాబ్దాల,
రెండు వందల సంవత్సరాల
కవిత్వ ప్రవాహం

# రసధుని

(రష్యన్ కవిత్వం)

డాక్టర్ లంకా శివరామప్రసాద్

ప్రపంచ సాహిత్యం-19

# రసధుని

## (రష్యన్ కవిత్వం - 1767-1967)

**(మూడు శతాబ్దాల,
రెండు వందల సంవత్సరాల
కవిత్వ ప్రవాహం)**

స్వేచ్ఛానువాదం
డాక్టర్ లంకా శివరామప్రసాద్

# రసధుని

## (రష్యన్ కవిత్వం 1767-1967)

Translated by

**Dr. Lanka Siva Rama Prasad**

✧✧✧———————————✧✧✧

February 2015

All rights reserved

Copyright @ 2015

by **Dr. Lanka Siva Rama Prasad**
Head of the Department
Cardiothoracic & Vascular Surgery
**Prathima Institute of Medical Sciences**
Nagunur Road, Karimnagar - 505 417, Telangana.

Published by:

**Dr. Lanka Siva Rama Prasad**
**Srijana Lokam / Writer's Corner**
Prasanthi Hospital
Sivanagar, WARANGAL-506 002,
Telangana, INDIA
Mobile : 8897849442
Email: lankasrprasad@gmail.com

Distributed by-
All leading book centers
Visalandhra Publishing House
Navodaya Publishing House

**E-book: www.kinige.com**

Price : ₹ **150 $ 4**

Cover Design & Post Script : **Prakash Pula**

Printed at :

**Vasavi Printers**
J.P.N. Road, Warangal. Ph : 0870-2426364

***This book is presented to...***

ఈ రచనకు ముఖ్య ఆధార గ్రంథం

**Three Centuries of Russian Poetry**

Progress Publishers, Moscow - 1980

Compiled by : **Nikolai Bannikov**
Edited by : **Irina Zheleznova**
Designed by : **Ruben Vardgigulyants**

# ప్రస్తావన

ఒక కోటి డెబ్బైలక్షల డెబ్బై అయిదువేల నాలుగు వందల చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంతో ప్రపంచంలోనే పెద్దదేశం రష్యా! ఈ భూ ప్రపంచంలో ఎనిమిదవ వంతు. జనాభా ప్రకారం తొమ్మిదవ స్థానం. (143 మిలియన్లు). తూర్పు స్లావ్ ప్రజలు క్రీస్తుశకం 3–8 శతాబ్దాలలో అక్కడ స్థిరనివాసం ఏర్పరుచుకున్నారు. 988 నాటికి ఆర్థొడాక్స్ క్రిస్టియానిటి, బైజాంటియన్ సామ్రాజ్యం వలన వ్యాప్తి చెందింది. మంగోలుల దండయాత్రలు, కరువు కాటకాలు రష్యాను పీడించినా, 18వ శతాబ్దం నాటికి రష్యా సామ్రాజ్యం ప్రపంచ చరిత్రలో మూడవ పెద్ద సామ్రాజ్యంగా పేరు తెచ్చుకున్నది. 2014 నాటికి ప్రపంచంలో ప్రజల నికరాదాయం దృష్ట్యా తొమ్మిదవ స్థానంలో, కొనుగోలు శక్తి దృష్ట్యా ఆరవ స్థానంలో ఉన్నది.

రష్యా అనే పదం (RUS) మధ్యయుగపు తూర్పుస్లావ్ ప్రజలుండే 'రస్' అనే ప్రాంతం పేరు నుంచి వచ్చింది. Russkaya Zemlya - రష్యన్‌భూమి అనే జనాలు పిలిచేవారు పూర్వకాలంలో. స్వీడిష్ వైకింగుల జాతిలోని వరంగియన్లు (Varangians) రష్యన్ల పూర్వీకులు. Rosia అనేది నవీన గ్రీకు ఉచ్చారణ.

పద్ధెనిమిదవ శతాబ్దం నుంచి శక్తివంతమైన కవిత్వం రష్యన్ భాష (ప్రజల భాష)లో వెలువడింది., ఈ సంకలనంలో మూడు శతాబ్దాల, రెండు వందల సంవత్సరాల (1767–1967), డెబ్బై ముగ్గురు కవుల, (నలుగురు కవయిత్రులు), నూటికిపైగా కవితలు (రష్యన్ భాష నుంచి ఇంగ్లీషులోకి తర్జుమా చేయబడినవాటిని) తెలుగులోకి అనువదించి సృజనలోకం, సాహితీలోకానికి సవినయంగా సమర్పిస్తున్నది. ప్రపంచ సాహిత్యంలోని గ్రీకు, లాటిన్, ఆంగ్ల, జర్మనీ, తమిళ కావ్యాలను తెలుగు లోగిలిలోకి తెచ్చిన సృజనలోకం ఈసారి రష్యన్ కవిత్వాన్ని అందిస్తున్నది.

**– డాక్టర్ లంకా శివరామప్రసాద్**

# కవి (The Poet)

ప్రాపంచిక కష్టసుఖాల వలలో చిక్కుకున్న కవి,
గమ్యం తెలీని చీకటిదారుల్లో నడుస్తూంటే,
అతడి ఆత్మను అంతులేని నిద్ర మొద్దుబార్చినపుడు
అపోలో దేవుడు కూడా అతడి నుంచి ఏమీ ఆశించడు.
మూగవోయిన అతడి వీణ నుంచి మనకే సంగీతమూ వినిపించదు.
అటువంటివాడు సృష్టిలోని జీవులలోకెల్లా అధమాధముడు.

ఎప్పుడైతే ఇతరుల వేదనలు అతడి హృదయాన్ని కదిల్చాయో,
లలితకళాధి దేవుడు అపోలో అతడి మనస్సును ఉత్తేజపరచాడో,
రెక్కలు విప్పిన గరుడపక్షిలా అతడి ఆత్మ దూసుకుపోతుంది.
విందులూ వినోదాలూ, జీవం లేని మాటలకు చోటుండదప్పుడు.
ఏ విగ్రహాలకూ, అధినేతలకూ తలవంచడతడు.

హృదయం ఉప్పొంగగా అతడు చేసే గంధర్వ గానానికి,
మనసు ద్రవించగా అతడు పలికే ఆర్ద్ర నాదానికి,
సముద్రాలు ఉప్పొంగి అతడి పదముద్రలను ముద్దాడుతాయి.
అతడి హృదయ స్పందనను మోస్తున్న గాలికి అరణ్యాలు తలవంచుతాయి.

**– అలెగ్జాండర్ పుష్కిన్ (1827)**

# రసధుని

"ఓ ప్రాచీన ప్రపంచమా! మీ క్షీణ నాగరికత అస్తమించేలోపు,
మీలో మినుకు మినుకుమంటున్న ప్రాణదీపం చటుక్కున మలిగే లోపు,
కాస్త ఆగి, తెలివి తెచ్చుకోండి, ఇడిపస్‌లా! మీవాడే, జ్ఞాని!
స్ఫింక్స్ రాకాసి పొడుపుకథను విప్పండి విజ్ఞతతో!

మీకు కనిపించే స్ఫింక్స్ రష్యా! ఆ పొడుపుకథ రష్యా!
నల్లటి, ఎర్రటి రుధిరాశృవులు స్రవిస్తూ సాగుతున్న రష్యా!
మీ వేపు చూస్తున్నది మెచ్చుకోలు, ద్వేషాల మిశ్రమంగా
ద్వేషంగా మారిన ప్రేమతో, ద్వేషం నుండి ప్రేమగా!

అవును! ప్రేమ! మీరు మరచిపోయిన ప్రేమ!
మా రక్తంలో అణువణువునా ప్రవహించే మధురిమ!
మీరు మరచిపోయారు ఈ నేలపై ప్రేమ ఉన్నదని!
అగ్నిలా జ్వలిస్తూ ప్రళయాగ్నిలా విధ్వంసమూ చేయగలదనీ!"

ఓ ప్రాచీన ప్రపంచమా! మెలకువలోకి రా!
ఇదే ఆఖరి పిలుపు! ప్రేమలోగిలిలోకి రా!
శాంతి, సౌభ్రాతృత్వపు విందుకు నీకు ఆహ్వానం!
కదన భేరీల మధ్య నినదించే కడపటి వీణానినాద స్వనం!

**– అలెగ్జాండర్ బ్లోక్ (1918)**
**(స్కిథియన్లు)**

# కవిత్వం

నాకు నచ్చవు ఈ ఛందోబద్ధ కవిత్వాలూ, దుఃఖగీతాలూ!
అనుకోకుండా కురిసిన వర్షంలా, విరిసిన ఇంద్రధనుస్సులా పదాలుండాలి.
విరామ చిహ్నాలుండకూడదు!

ఒకానొక పనికిమాలిన చెత్త దృశ్యమని నీవనుకుంటావు.
కవిత్వం తన జన్మ గురించి సిగ్గుపడదు. గడ్డిపూలు, నల్లేరు-
నడక ముఖ్యం, పుటక కాదు!

ఒక పొలికేక! మరిగే తారు చర్మంపై పడ్డాక బొబ్బలమంట,
శిథిలపుగోడ మీద నవ్వే నాచుమొక్క, పల్లేరు కాయలు-
మందహాసపు నృత్యం కవిత్వం!

**- అన్నా అఖ్మతొవా (1940)**

# మాతృదేశం కోసం

ప్రచండ భీషణ ప్రజ్వలాగ్ని స్తంభాల
విస్ఫోటనాశబ్దాల పిడుగులురమంగా
ఓ రష్యా! రష్యా! రష్యా!
కాలిపోవుదు నీకై అగ్నికీలల లోన!

శోధించిన అగాధాలు, శిధిలాల వీధులు
రెక్కల భూతాల నేత్రాల జ్వాలలు
తుఫాను భీభత్సాలు, ప్రకృతి ప్రళయాలు
దుఃఖించకు రష్యా! తలవంచి ప్రణమిల్లు!

అవమానపుటెడారులు, అంతులేని అశృవులు
క్రీస్తు పునరుత్థానపు, నిశ్శబ్ద రహస్యాలు
నింగిలోని పాలపుంత, నిశ్చల శని వలయాలు
అన్నిటినీ దాటి, నీ ఆగ్రహం రగలనీ!

నీ ప్రకృతి సహజ విశృంఖలాగ్నిలో
ఓ రష్యా! రష్యా! రష్యా!
కాల్చివేయుము చెడును కరుణ లేక,
నీవే భవిష్యత్ కాలపు రక్షక నౌక!

**- ఆంద్రి బెలీ (1917)**


# విషయసూచిక


| | కవిత | కవి | ఆంగ్లానువాదం |
|---|---|---|---|
| 1. | అర్ధరాత్రి అరుణకాంతి | - మైఖేల్ లొమొనొసొవ్ | - పీటర్ టెంపెస్ట్ |
| 2. | సైనికుడు | - అలెగ్జాండర్ సుమరొకొవ్ | - ఎవ్రిల్ పైమాన్ |
| 3. | నా సేవకులకో ఉత్తరం | - డెనిస్ ఫొనొవిజిన్ | - ఎవ్రిల్ పైమాన్ |
| 4. | యువరాజు మరణం | - గావ్రిల్ డెర్‌జాలిన్ | - పీటర్ టెంపెస్ట్ |
| 5. | స్వస్థత | - నికొలాయి కరామ్‌జిన్ | - డోరియాన్ రాటెన్‌బర్గ్ |
| 6. | సంగీత కచేరి | - ఇవాన్ క్రైలోవ్ | - పీటర్ టెంపెస్ట్ |
| 7. | స్వెత్లానా | - వాసిలి ఝుకొవ్‌స్కీ | - ఓల్గా షార్ట్‌సి |
| 8. | నికితాకు లేఖ | - కాన్‌స్టాంటిల్ బత్యుష్కోవ్ | - ఎవ్రిల్ పైమాన్ |
| 9. | వీనస్ | - అలెగ్జాండర్ పుష్కిన్ | - ఎవ్రిల్ పైమాన్ |
| 10. | బందీ | - అలెగ్జాండర్ పుష్కిన్ | - ఇరినా ఝెలెజ్‌నొవా |
| 11. | నీకు... | - అలెగ్జాండర్ పుష్కిన్ | - ఇరినా ఝెలెజ్‌నొవా |
| 12. | శీతాకాలపు సాయంత్రం | - అలెగ్జాండర్ పుష్కిన్ | - ఇరినా ఝెలెజ్‌నొవా |
| 13. | ప్రవక్త | - అలెగ్జాండర్ పుష్కిన్ | - ఇరినా ఝెలెజ్‌నొవా |
| 14. | సైబీరియాలో ఖైదీ | - అలెగ్జాండర్ పుష్కిన్ | - ఇరినా ఝెలెజ్‌నొవా |
| 15. | విషవృక్షం - మహరాజు | - అలెగ్జాండర్ పుష్కిన్ | - ఇరినా ఝెలెజ్‌నొవా |
| 16. | కకాసస్ పర్వతాలు | - అలెగ్జాండర్ పుష్కిన్ | - ఇరినా ఝెలెజ్‌నొవా |
| 17. | కోరిక | - అలెగ్జాండర్ పుష్కిన్ | - ఇరినా ఝెలెజ్‌నొవా |
| 18. | భూతపిశాచాలు | - అలెగ్జాండర్ పుష్కిన్ | - ఇరినా ఝెలెజ్‌నొవా |
| 19. | నవివైకొ వాంగ్మూలం | - కొంద్రాటి రైలియేవ్ | - అలెక్సి మిల్లర్ |
| 20. | వొయి నారొవ్‌స్కీ | - కొంద్రాటి రైలియేవ్ | - అలెక్సి మిల్లర్ |
| 21. | హుస్సార్ గీతం | - డెనిస్ దేవీదోవ్ | - డొరియాన్ రాటెన్‌బర్గ్ |
| 22. | గెథె మరణ సందర్భం | - ఎవ్‌గిని బారాటిన్‌స్కీ | - పీటర్ టెంపెస్ట్ |
| 23. | నావికుడు | - నికొలాయి యజికోవ్ | - డొరియాన్ రాటెన్‌బర్గ్ |
| 24. | పల్లెటూరి విందు | - అలెక్సి కొల్త్‌సోవ్ | - ఇరినా ఝెలెజ్‌నొవా |
| 25. | తెరచాప | - మైఖేల్ లెర్‌మన్‌టోవ్ | - ఇరినా ఝెలెజ్‌నొవా |
| 26. | మత్స్యకన్య (మెర్‌మెయిడ్) | - మైఖేల్ లెర్‌మన్‌టోవ్ | - ఇరినా ఝెలెజ్‌నొవా |

| | | |
|---|---|---|
| 27. కోరిక | – మైఖేల్ లెర్‌మన్‌టోవ్ | – ఇరినా ఝెలెజ్‌నొవా |
| 28. యంటి సైరి | – మైఖేల్ లెర్‌మన్‌టోవ్ | – ఇరినా ఝెలెజ్‌నొవా |
| 29. కల | – మైఖేల్ లెర్‌మన్‌టోవ్ | – ఇరినా ఝెలెజ్‌నొవా |
| 30. తోకచుక్క | – అపొలాన్ గ్రిగొరియెవ్ | – ఎవ్రిల్ పైమాన్ |
| 31. గ్రామ సుంకరి | – నికొలయి ఒగరేవ్ | – పీటర్ టెంపెస్ట్ |
| 32. దర్శనం | – ఫ్యోదోర్ త్యుత్‌చెవ్ | – ఇరినా ఝెలెజ్‌నొవా |
| 33. దుఃఖించే కలం | – నికొలయి ఒగరేవ్ | – ఇరినా ఝెలెజ్‌నొవా |
| 34. మూడు గుర్రాల బండి | – నికొలాయి నెక్రసోవ్ | – అలెక్సి మిల్లర్ |
| 35. రష్యన్ స్త్రీలు | – నికొలాయి నెక్రసోవ్ | – అలెక్సి మిల్లర్ |
| 36. ఆకుపచ్చని అలలు | – నికొలాయి నెక్రసోవ్ | – అలెక్సి మిల్లర్ |
| 37. రష్యా | – ఇవాన్ నికితిన్ | – డొరియాన్ రాటెన్‌బర్గ్ |
| 38. వేసవి వర్షం | – అపొలాన్ మికోవ్ | – డొరియాన్ రాటెన్‌బర్గ్ |
| 39. తొలిప్రేమ | – అలెక్సి కె. టాల్‌స్టాయ్ | – ఎవ్రిల్ పైమాన్ |
| 40. శక్తివంతమైన పదాలు | – అఫనాసి ఫెట్ | – పీటర్ టెంపెస్ట్ |
| 41. గుర్రపు బండి గంటలు | – యాకొవ్ పొలొన్‌స్కీ | – డొరియాన్ రాటెన్‌బర్గ్ |
| 42. వృద్ధాప్యం | – అలెక్సి జెమ్ ఛుజ్నికోవ్ | – డొరియాన్ రాటెన్‌బర్గ్ |
| 43. జ్ఞాపకాలు | – కాన్‌స్టాంటిన్ స్లుఛెవ్‌స్కీ | – డొరియాన్ రాటెన్‌బర్గ్ |
| 44. యవ్వనం... ఒంటరితనం | – ఇవాన్ బ్యునిన్ | – ఇరినా ఝెలెజ్‌నొవా |
| 45. పైన్ వృక్షాలు | – కాన్‌స్టాంటిన్ బాల్మొంట్ | – ఇరినా ఝెలెజ్‌నొవా |
| 46. ఉయ్యాల – జంపాల | – ఫ్యోదార్ సొలొగబ్ | – అలెక్సి మిల్లర్ |
| 47. అస్సర్‌గాడన్ | – వాలెరి బ్రైయుసొవ్ | – పీటర్ టెంపెస్ట్ |
| 48. పిడిబాకు | – వాలెరి బ్రైయుసొవ్ | – ఇరినా ఝెలెజ్‌నొవా |
| 49. కొండల్లో... | – ఆంద్రీ బెలి | – పీటర్ టెంపెస్ట్ |
| 50. రాత్రి సమయం | – ఇన్నొకెంటి అన్నెన్‌స్కీ | – డొరియాన్ రాటెన్‌బర్గ్ |
| 51. ప్రేమ | – వ్యాఛెస్లావ్ ఇవనోవ్ | – పీటర్ టెంపెస్ట్ |
| 52. వృద్ధ ధ్యాని | – సెర్జి గొరొడెట్‌స్కీ | – టామ్ బాటింగ్ |
| 53. అయితే... | – మిఖాయిల్ కుజ్‌మిన్ | – డొరియాన్ రాటెన్‌బర్గ్ |
| 54. మేము లోహకారులం... | – ఫిలిప్ ష్కులెవ్ | – టామ్ బాటింగ్ |
| 55. ఎదురుచూపులు | – మాగ్జిమిలియన్ వొలిషిన్ | – ఇరినా ఝెలెజ్‌నొవా |

56. ఓ బాటసారీ... – మారినా స్వెతాయెవా – ఇరినా ఝెలెజ్‌నొవా
57. అవే కళ్లు – మారినా స్వెతయెవా – ఇరినా ఝెలెజ్‌నొవా
58. సముద్ర ప్రయాణీకులు – నికొలాయి క్లైయుయెవ్ – పీటర్ టెంపెస్ట్
59. ప్రయాణం – ఒసిప్ మాండెల్‌ష్టమ్ – ఇరినా ఝెలెజ్‌నొవా
60. పిలుపు – అన్నా అఖ్‌మతోవా – గ్లాడిస్ ఇవాన్స్
61. కొత్త వ్యక్తి – అలెగ్జాండర్ బ్లోక్ – అలెక్సి మిల్లర్
62. ఆకురాలు కాలం – అలెగ్జాండర్ బ్లోక్ – అలెక్సి మిల్లర్
63. స్వేచ్ఛ – వెలిమిర్ ఖ్లెబ్నికొవ్ – టామ్ బాటింగ్
64. నీ సంగతేమిటి? – వ్లదిమీర్ మయకొవ్‌స్కీ – డొరియాన్ రాటెన్‌బర్గ్
65. కవాతు – వ్లదిమీర్ మయకోవ్‌స్కీ – డొరియాన్ రాటెన్‌బర్గ్
66. స్పష్టంగా, సూటిగా... – వ్లదిమీర్ మయకోవ్‌స్కీ – డొరియాన్ రాటెన్‌బర్గ్
67. కామ్రేడ్ లెనిన్‌తో సంభాషణ – వ్లదిమీర్ మయకోవ్‌స్కీ – ఇరినా ఝెలెజ్‌నొవా
68. 'ప్రావ్దా' పతాకం కింద – దెమ్యాన్ బెద్నీ – డొరియాన్ రాటెన్‌బర్గ్
69. సోవియట్ రస్ – సెర్జి ఎసినిన్ – ఓల్గా షార్ట్‌సి
70. శీతాకాలం – బోరిస్ పాస్టర్‌నాక్ – అలెక్సి మిల్లర్
71. భూమి – బోరిస్ పాస్టర్‌నాక్ – అలెక్సి మిల్లర్
72. నీలి కోటు హుస్సార్‌లు – నికొలాయి అసియెవ్ – పీటర్ టెంపెస్ట్
73. కొత్త పదాలు – నికొలాయి టిఖొనోవ్ – ఇరినా ఝెలెజ్‌నొవా
74. గోళ్ల పాట – నికొలాయి టిఖొనోవ్ – పీటర్ టెంపెస్ట్
75. శీతాకాలంలో కాకి – మిఖాయిల్ జెంకెవిచ్ – డొరియాన్ రాటెన్‌బర్గ్
76. ఎకార్డియాన్ గాయకుడు – వాసిలి కాజిన్ – పీటర్ టెంపెస్ట్
77. శ్రామికుల 'మే' – వాసిలి కొజిన్ – పీటర్ టెంపెస్ట్
78. పుచ్చకాయ – ద వాటర్‌మెలన్ – ఎడువర్డ్ బాగ్రిట్‌స్కీ – టామ్ బాటింగ్
79. గ్రనడా – మిఖాయిల్ స్వెత్లొవ్ – మార్గరెట్ వెట్‌లిన్
80. నాకెన్నడూ లేని కొడుకు గురించి... – వెరా ఇన్‌బెర్ – లిడియా కె. మెట్యుక్
81. ఉమ్‌కా (ధృవపు ఎలుగుబంటి) – ఇల్యా సెల్విన్‌స్కీ – పీటర్ టెంపెస్ట్
82. మేపుల్ ఆకు – వ్లదిమీర్ లుగొవ్‌స్కాయ్ – లిడియా కె. మెట్యుక్
83. కవిత్వం – పావెల్ ఏంట్‌కొవ్‌స్కీ – డొరియాన్ రాటెన్‌బర్గ్
84. గిటార్ – ఐవొసిఫ్ ఉట్‌కిన్ – అలెక్సి మిల్లర్

| | | |
|---|---|---|
| 85. సృష్టి | – సెమ్యాన్ కిర్సనొవ్ | – పీటర్ టెంపెస్ట్ |
| 86. ముంచుకొస్తున్న తుఫాను | – నికొలాయి జబొలాట్స్కీ | – ఎవ్రిల్ పైమాన్ |
| 87. హృదయం నుంచి హృదయానికి | – అలెగ్జాండర్ ప్రొకొఫియెట్ | – అలెక్సి మిల్లర్ |
| 88. కుంభకారులు | – వెసెవొలొద్ రోజ్‌దెస్తెవెన్స్కీ | – డొరియాన్ రాటెన్‌బర్గ్ |
| 89. నటాల్యా | – పావెల్ వాసిలియెవ్ | – పీటర్ టెంపెస్ట్ |
| 90. సగం వృద్ధుడు | – స్టెపాన్ ష్ఛిపఛెవ్ | – వోల్గా షార్ట్‌సి |
| 91. సైనికుడు | – అలెక్సి సుర్కొవ్ | – పీటర్ టెంపెస్ట్ |
| 92. రష్యన్ స్త్రీలు | – మిఖాయిల్ ఇసకొవ్‌స్కీ | – వోల్గా షార్ట్‌సి |
| 93. కాఫీ హవుస్ | – డిమిత్రి కెడ్రిన్ | – పీటర్ టెంపెస్ట్ |
| 94. రష్యన్ భాష | – యారొస్లావ్ స్మెలియకొవ్ | – డొరియాన్ రాటెన్‌బర్గ్ |
| 95. నాకోసం వేచి ఉండు | – కాన్‌స్టాంటిన్ సైమనొవ్ | – ఇరినా ఝెలెజ్‌నొవా |
| 96. రెండు కొలుములు | – అలోగ్జాండర్ ట్వార్డొవ్‌స్కీ | – అలెక్సి మిల్లర్ |
| 97. దేశ రక్షకులు | – ఓల్గా బెర్ఘోల్ట్జ్ | – పీటర్ టెంపెస్ట్ |
| 98. రొట్టె పరిమళ హస్తాలు | – నికొలాయి రైవెంకొవ్ | – టామ్ బాటింగ్ |
| 99. బాలెరినా | – లియొనిడ్ మార్టినొవ్ | – పీటర్ టెంపెస్ట్ |
| 100. ప్రేమతో ఈ జగము నిండునుగాక! | – లియొనిడ్ మార్టినొవ్ | – పీటర్ టెంపెస్ట్ |



# 1. అర్ధరాత్రి అరుణకాంతి

## (అరొరా బొరిలియాస్)

**- మైఖేల్ లొమొనొసొవ్ (1743)**

పగటి కన్య వదనంపై జారిన మేలిముసుగులా
రాత్రి మసకచీకటి రాజ్యాన్ని కమ్ముకుంటున్నది.
కొండాకోనల్ని నల్లటి నీడలు కౌగిలించుకుంటున్నపుడు
నేలపై కాంతిరేఖలు నిషేధించబడినవి.
అంతరిక్షంలో అసంఖ్యాక తారా దీపాలు వెలుగగా
చీకటి చిక్కబడి అంతుదొరకని అగాధంగా మారినది.

సప్త సముద్రాలలో ఒక ఇసుక రేణువు
అనంత నీహార పంక్తిలో మెరిసిన తళుకు బిందువు
మహా తుఫానులో ఓ ధూళి కణపు రేఖ
ప్రచండాగ్నిలోకి విసిరివేయబడిన పక్షి ఈక
ఈ చీకటి అగాధంలో నేను
ఆలోచనాభారంతో అలిసి సొలిసి పోయాను

జ్ఞానులందరూ గుమికూడి ఆవల అనేక లోకాలున్నాయన్నారు.
అసంఖ్యాక సూర్యుళ్లూ, శతాబ్దాలూ, జీవులూ గడచిపోయాయన్నారు.
ప్రకృతి శక్తి స్థిరంగా ఉంటూ ప్రశంసిస్తున్నది దేవుడి నామమన్నారు.
మరి ఇక్కడ ప్రకృతి న్యాయం ఫలించదా!

➡

---

**అరోరా బొరిలియాస్ (Aurora Borelias - Northern Lights)**
అరోరా-అరుణ, సంధ్యాదేవత (Aurora (latin) = Sunrise) ఆర్కిటిక్, అంటార్కిటిక్ ప్రాంతాలలో కనిపించే ఈ అర్ధరాత్రి కాంతులు-సూర్యగాలులు, థర్మోస్ఫియర్‌లోని అయస్కాంత శక్తి కలిగిన అణువులతో ఢీకొట్టినపుడు -ఎరుపు, ఆకుపచ్చ, పసుపు, నీలం, పింక్ రంగులలో కనిపిస్తాయి. దక్షిణధృవంలో కనిపించే కాంతులను 'అరొరా ఆస్ట్రేలియాస్' అని పిలుస్తారు.

అర్ధరాత్రి సూర్యోదయం ఆహ్వానించబడుతున్నదా!
సూర్యుడు నింగికెగుస్తుంటే
ఘనీభవించిన సముద్రాలు మంచు బల్లేల్ని విసుర్తున్నాయా?
అర్ధరాత్రి ఉదయపు జననానికి,
హిమజ్వాలలు కాంతిని వర్షిస్తున్నవా?

ఓ గ్రహగమన గణికుడా!
ప్రకృతి న్యాయాలను పఠించినవాడా!
ఏమిటీ అద్భుతం? ఎవరు దీనికి కారణం?
ఈ రాత్రి వెలుగుకు హేతువేమిటి?
నేలపై పుట్టి అంతరిక్షాన్ని తాకుతున్న ఈ అపురూప కాంతులేమిటి?
ఉరుములు, మెరుపులకే చలించని అంబరానికేల ఈ సంబరం?
ఎముకలు కొరికే చలిలో, ఎవరికీ చలిమంటల వరం?

ఘనీభవించిన నీరు పొగమంచుగా మారిందా!
పరావర్తనపు సూర్యకిరణాలు ప్రతిఫలించాయా మంచుతెరగా!
మబ్బులతో నిండి మంచు శిఖరాలు మంచిరంగులనద్దుకున్నాయా!
తరంగాలు సాకిన తీరపుగాలి, తీరికగా హొయలు పోతున్నదా!
అవన్నీ సరేగానీ మిత్రమా! నాకన్నీ సందేహాలే!
ఈ విశ్వమెక్కడి వరకు వ్యాపించి ఉన్నది?
ఆ చిన్ని తార వెనుక ఇంకేమి దాగి ఉన్నది?
సృష్టి గొప్పతనాన్నే మనమాసాంతం చూడలేకున్నామే,
సృష్టికర్త ఎంత గొప్పవాడో ఊహించగలమా!

✤✤✤✤✤

---

**మైఖేల్ లొమొనొసొవ్ (Mikhail Lomonosov 1711-1765) -** రైతుబిడ్డ. సముద్రతీరంలోని పల్లెటూర్లో పుట్టినా చదువు మీద శ్రద్ధతో మాస్కో పారిపోయి అక్కడ మతాధికారి కుమారుడిగా చెప్పుకుని స్లావొ-గ్రీకు-లాటిన్ అనే అకాడమీలో ఎనిమిదేళ్ల చదువును అయిదేళ్లలో పూర్తిచేసినాడు. సెయింట్ పీటర్స్‌బర్గ్, జర్మనీలలో పైచదువులు పూర్తిచేసి నవీన శాస్త్రాలు, కవిత్వంలో కృషిచేసినాడు. రష్యన్ భాషకు వ్యాకరణాన్ని, మూడు రకాల పలుకుబడుల సిద్ధాంతాన్ని ప్రవేశబెట్టినాడు. స్తోత్ర గీతాలు, పాటలు, విషాదాంత రచనలు అనేక కవితలు వ్రాసి రష్యా జ్ఞానయుగంలో ముఖ్యపాత్ర వహించినాడు.

# 2. సైనికుడు

**- అలెగ్జాండర్ సుమరొకొవ్ (1770)**

నా జీవన కాంతి దీపమా! నా ప్రేమకు ప్రతిరూపమా!
రేపు నేను వెళ్తున్నాను యుద్ధ రంగానికి,
మరల వస్తానో, లేదో తెలియని ప్రస్థానానికి!
ఆఖరిసారి, నాతో మరింతసేపు గడిపి కాలాన్ని ఆపుమా!

దుఃఖాన్ని వీడు! విధి నాకేమీ చేయదులే కీడు!
అశ్రువులను వృధా చేయకు, ప్రేయసీ! దుఃఖించకు!
నేను విజయాన్ని సాధించి వస్తాను తప్పక,
అప్పటి వరకు నీవుండుము చిరునవ్వులను చెదర నివ్వక!

ఒకవేళ మరణించినా చేతిలో తుపాకితో మరణిస్తాను.
భయాన్ని భయపెడుతూ దేశ భక్తుడిగా తేజరిల్లెదను.
చేతకాని వాడిగా నీకు తలవంపులు తేబోను
నిన్నెంత ప్రేమించానో అంతగా నా దేశాన్ని ప్రేమించాను.

ఇది నేను తాగే సిగరెట్టు పైపు;
ఇది నేను తాగే వైను గ్లాసు
ఎన్నోసార్లు నీపేరు స్మరిస్తూ తాగాను.
ఇవన్నీ నీకే చెందాలని తపిస్తున్నాను.

ఒకవేళ విజయమే సిద్ధించి పరశువు*** దక్కిందా,
నీ కనుల ముందు నేను ప్రత్యక్షమౌతాను వీరుడిగా!
తెస్తాను బహుమతులెన్నో, జోళ్లూ, మేజోళ్లు
విసనకర్రలు, రిబ్బన్లు, వస్త్రాలు, గాజులు, అసంఖ్యాకంగా!

✣✣✣✣✣

---

**అలెగ్జాండర్ సుమరొకొవ్ (Alexander Sumarakov 1717-1777) -** పీటర్ సైన్యంలో కల్నల్ హోదకు ఎదిగిన సైనికుడు. అతడి ప్రేమగీతాలు ఎంతో ప్రసిద్ధికెక్కగా **1756**లో బ్రిగెడియర్ హోదాతో బాటు సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో న్యూ రష్యన్ థియేటర్ అధ్యక్షుడిగా నియమించబడినాడు. ఉద్యోగ విరమణ తరువాత తొమ్మిది ట్రాజెడీలు, పది కామెడీలు, రెండు ఓపెరాలు, అనేక కథలు వ్రాసినాడు. రాజరికాన్ని సమర్థించినా ఉన్నత కుటుంబీకులను విమర్శించడంలో వెనుకడుగు వేయలేదు.

*****పరశువు** **(Halbred) =** గండ్రగొడ్డలి లాంటిది.

# 3. నా సేవకులకో ఉత్తరం

- డెనిస్ ఫొనొవిజిన్ (1763-1766)

నన్ను పెంచిన ద్యాడ్కా! నీవు నా రక్షకుడివి, సలహాదారుడివి!
ఏమిటీ ప్రపంచం? నేనెందుకు దీనిలో నివసించాలి?
ఈ కప్పా, గుడ్లగూబా, ఎలుగుగొడ్డూ, నేనూ ఎందుకు పుట్టాము?
జ్ఞానివి, వృద్ధుడివి ష్యుమిలోవ్! ఎందుకు నీవీ రహస్యం విప్పలేవు?

నా వాహన సారథీ వాంకా! నీవైనా చెప్పగలవా!
ఎందుకీ ప్రపంచం ఇలా సృష్టించబడింది? ఎవరి కోసం?

చదువురాని వాడిని, గుర్రపు బండే లోకమైనవాడిని, తెలిసింది ముత్తెమంత!
నేను చూసిన లోకం గురించి నేడు వివరిస్తా తెలిసినంత
అందరూ దొంగలే, దోచుకుంటారు దొరికినంత!
రాజు నుంచి రైతు వరకు; జడ్జి నుంచి జవాను వరకు! డబ్బునే మాయముంత!

నాకు ఆటపాటలు నేర్పే పెట్రూష్కా? నీవైనా చెప్పు ఏమిటీ వింత?
ఏమిటీ ప్రపంచం! ఎందుకీ గందరగోళం? ఏమిటీ సంత?

పిల్లలకు ఆటబొమ్మలా మనకీ ప్రపంచం!
ఆనక సాతాను కొనిపోయినా ఆక్రోశం అనవసరం!
ఎదుటివాడిని దోచుకుంటే ఎంతో సంపద నీ స్వంతం!
మనమంతా కీలుబొమ్మలం! సృష్టికర్తకిదంతా లీలావినోదం!

వాళ్లు ముగ్గురూ చివరకు నన్నే చెప్పమన్నారు సమాధానం!
ఎందుకీ ప్రపంచం? చెబితే మిత్రమా, నీకు నా నమస్కారం!

*****

---

**డెనిస్ ఫొన్‌విజిన్ (Denis Fonvizin 1745-1792) -** ఉన్నత కుటుంబంలో జన్మించిన డెనిస్ అనేక ఉన్నత ఉద్యోగాలు చేసినాడు. అనేక అనువాదాలు, వ్యంగ్య కవితలు పద్దెనిమిదవ శతాబ్దపు ప్రసిద్ధ కామెడీలు - బ్రిగేడియర్ జనరల్, మైనర్ - వ్రాసి రష్యన్ సాహిత్యపు ఎదుగుదలకు తోడ్పడినాడు. మైనర్ నాటకం ఇప్పటికీ ప్రదర్శించబడుతున్నది.

# 4. యువరాజు మరణం

**- గాబ్రియేల్ డెర్‌జావిన్ (1779)**

మృత్యుభేరీ భాంకారాలు, మరణ మృదంగాలు,
మీ భీకర ధ్వనులు నన్ను లాగుతున్నవి సమాధివేపు.
పిన్నవయసులోనే నన్ను చూసిన మృత్యువు పళ్లు పటపటలాడిస్తూ
తన మెరిసే కొడవలితో నా ఆకుపచ్చని దినాలను కోయనున్నది.

విధి పిడికిలి నుంచి ఏ జీవీ తప్పించుకోలేదు.
రాజూ, సేవకుడూ చచ్చాక పురుగుల పాలౌతారు.
ఎండా, గాలీ సమాధి పేటికలను దుమ్మూధూళిగా మారుస్తాయి.
గడిచిన ఘడియలలోకి కీర్తి, సముద్రంలోకి నదుల్లా అదృశ్యమౌతుంది.
మహామహా సామ్రాజ్యాలు మృత్యుగహ్వరంలో మాయమౌతాయి.

అగాధంలోకి జారిపోతూ ఎగుర్తున్నామని భ్రమిస్తాము.
జీవితాన్ని స్వాగతిస్తూ మృత్యువును ముద్దాడుతాము.
చావడానికి కాకపోతే మరెందుకు పుట్టినట్లు మనం?
మృత్యువు తారలను నేలకూలుస్తాడు, సూర్యుడిని మసక బారుస్తాడు.
అన్ని లోకాలను ఒకేరకంగా అల్లకల్లోలపరుస్తాడు.

అయినా, చావు లేదనుకుని మనిషి అనంత సుఖాలకై కలలుగంటాడు.
దొంగలా పొంచివున్న మృత్యువు ఒక్కక్షణంలో మన జీవితాన్ని కాజేస్తుంది.
మనం నిర్భీతిగా ఉన్నపుడే మనల్ని ఎగరేసుకుపోతుంది.
విద్యుద్ఘాతం కూడా అంతవేగంతో వివశుడిని చేయలేదు.

మెష్చెర్‌స్కీ యువరాజా! ఎక్కడకు మాయమయ్యావు?
జీవితపు సరిహద్దు నుంచి, మృత్యులోకంలోకి బహిష్కరింపబడినావు.
నీ దేహపు ధూళి మిగిలింది, నీ ఆత్మ ఎగిరిపోయింది.
నీవెక్కడికి పోయావని విలపిస్తూ, ఆత్మనిందకు పాల్పడుతున్నాము.

ఆరోగ్యంతో ఉన్నవాళ్ల గుండెలు అదిరిపడి బరువెక్కినాయి.
సంతోషంగా గంతులు వేసినవాళ్లు చింతాక్రాంతులై ఉన్నారు.
మహరాజులపై, ధనవంతులపై మృత్యునేత్రం దృష్టి నిలిపింది.
పేదా, సాదా, చిన్నాపెద్దా తేడా లేకుండా, కఠిన శిలపై కొడవలి నూరుతున్నది.

నిన్న దేవుడు ఇవ్వాళ దుమ్ము; ఈరోజు సంతోషం రేపు ఏమి కానున్నది?
గర్వంతో ఉబ్బిన వక్షము సర్పం కోల్పోయిన వృక్షమైనది.
బ్రతుకు తొలి అడుగులోనే జీవన దారం పుటుక్కున తెగింది.
స్వప్నంలోని దృశ్యంలా యవ్వనమప్పుడే అదృశ్యమైనది.

అందం అడుగంటినాక కీర్తి నన్ను పిలుస్తున్నది.
ఉడుకురక్తం ఉడిగినాక ఉద్వేగం సమసినది
ఆనందపు లహరులు మనలను అర్థాంతరంగా వీడినాక,
కాలపు ద్వారము వద్ద కాసేపు వేచి ఉండాలి తప్పక!

మిత్రమా! పర్ఫిలైయేవ్! ఈరోజో, రేపో తప్పదు మరణము!
పుట్టిన మట్టిలోనే కలిసిన మిత్రుడికై ఇక శోకించకుము!
ఆగకుండా పరిగెత్తే దివ్య బహుమతి ఈ జీవితం!
విధికి తలవొగ్గి వినమ్రంగా జీవించుటే ఉచితం!

❖❖❖❖❖

---

**గాబ్రిల్ డెర్జావిన్ (Gavril Derzhavin 1743-1816) -** ఉన్నత కుటుంబంలో పుట్టినా పేదవాడైన తండ్రి దూర ప్రాంతాల సైనిక దళంలో పనిచేసేవాడు. సైనికుడిగా తన జీవితాన్ని ప్రారంభించి డెర్జావిన్ స్వశక్తితో గవర్నర్‌గా, సెనెటర్‌గా, ఛాన్సలర్‌గా ఉన్నత పదవులను సాధించినాడు. 1776లో మొదటి కవితా సంపుటిని ప్రచురించాడు. 1783లో అతడు వ్రాసిన కవిత - **Felitsa** - రెండవ కాథరైన్ రాణిపై వ్రాసిన గీతం అత్యంత పేరు ప్రతిష్ఠలను తెచ్చింది. రష్యన్ కవిత్వాన్ని కొన్ని అడుగులు ముందుకు తీసుకుని వెళ్లినవాడిగా, ప్రజల కొరకు పాటుపడిన వాడిగా, బాలుడిగా ఉన్న పుష్కిన్‌లో రష్యా సాహిత్యానికి వన్నెతెచ్చే కవిని చూసిన ద్రష్టగా గాబ్రిల్ డెర్జావిన్ ప్రసిద్ధికెక్కినాడు.

# 5. స్వస్థత

**- నికొలాయి కరామ్‌జిన్ (1789)**

దయగల ప్రకృతిమాతా నీకు శుభమగు గాక!
కరుణామయీ! నీ పుత్రుడు స్వస్థత నొందినాడు! విజయోస్తు!

వ్యాధి చీకట్లు కమ్ముకున్న రాత్రులన్నీ నాకు
కాలచక్రపు రద్దీలో చిక్కుకున్న సంవత్సరంలా నడిచాయి.

అంతా చేదు విషం. కటిక పైత్యం కక్కుకున్నట్లు
విసుగు, అధైర్యం, దుఃఖం నా ఆత్మను వెంటాడినాయి.

నల్లటి రక్తం చిక్కగా నిద్రలేని రాత్రుళ్లపై జిమ్మగా
పీడకలలు, భూతరూపాలు, నరకలోక దృశ్యాల ఘోష!

రాత్రింబవళ్లూ నా రొమ్ము నుండి పైకెగసిన నిట్టూర్పులు,
చిట్టచివరికి ప్రకృతిమాత నా పిలుపును విన్న సూచనలు.

మృదువుగా నన్ను స్పృశించి, వెల్లువై పారిన రక్తాన్ని తుడిచి,
తన దయాపూరిత దృక్కులతో, పారద్రోలింది నా ఆత్మలోని చీకటిని.

నా చుట్టూ అంతా నూతనంగా, ఆనందంగా పొంగిపొరలుతున్నది.
ఉదయకాంతి, ఎండ, వెన్నెల, తారల వెలుగులతో ప్రకాశిస్తున్నది.

ఈ నిద్ర ఎంతో హాయిగా, ప్రశాంతంగా ఉన్నది.
రేపటి ఆనందానికి సూర్యుని పిలుపుకై నా ఎద వేచి చూస్తున్నది.

✤✤✤✤✤

---

**నికొలాయి కరామ్‌జిన్ (Nikolai karamzin 1766-1826) -** మధ్యవోల్గా ప్రాంతంలో ఉన్నత కుటుంబంలో జన్మించాడు. మాస్కోలో కవిగా స్థిరపడినాడు. నికొలాయి నొవికోవ్, గేథె, కాంట్‌లు అతడికి మార్గదర్శకులు, స్నేహితులు. అతడి Letter of a Russian Traveller - చాలా పేరు తెచ్చిన రచన. మొదటి రష్యన్ పిల్లల పత్రిక, రష్యన్ జర్నల్, యూరొపియన్ మెసెంజర్ అనే పత్రికలను నడిపినాడు. కథలలో అనుబంధాల్ని, కవిత్వంలో భావవాదానికి ఆద్యుడు. అనేక కొత్త పదాలు, పదబంధాలు సృష్టించిన 'నికొలాయి' ఆఖరి ప్రసిద్ధ రచన - పన్నెండు భాగాల **History of the Russian State.**

# 6. సంగీత కచేరి

**- ఇవాన్ క్రైలోవ్ (1811)**

ఒక కోతి - అసలే కోతి - చేష్టలకు కొదవా!
ఒక మేక, ఒక గాడిద, ఒక ఎలుగుబంటి.
ఒక రోజున ప్రారంభించాయి సంగీత కచేరి!
ఒక చెట్టు కింద వాయించడం మొదలెట్టాయి వాయులీనాల్ని!

ఎన్ని వాయులీనాలు? రెండు వయొలిన్లు, ఒక వయొలా, ఒక సెల్లో!
విద్వాంసులూ వాళ్లే, ప్రేక్షకులూ వాళ్లే!
చేతుల్లోని కమానుతో చేతనైనంత లాగారు తీగెల్ని!
ఆపండోయ్! ఆపండోయ్! -అరచింది కోతి! సంగీతం కాదిది సంత!

మనం వంకర టింకరగా కూర్చున్నాము, అందుకే లేదు పొంతన!
ఎలుగుబంటీ నీవు ఎదురుగా కూర్చో! నేనటు మేకా! నీవు నా చెంతన!
ఇక వాయించండి అందరం ఒకే క్షణాన! గాడిదా మొదలెట్టు!
సంగీతం పొంగి అడవులూ, కొండలూ నాట్యం చేయకపోతే ఒట్టు!

గాడిద అరచింది గాభరాగా! ఎదురూ బొదురూ కూర్చుంటే ఏడ్చినట్లుంది.
మన వ్యవహారం! పక్కపక్కనే కూర్చుంటే పారుతుంది సంగీతం.
సంగీతం కన్నా ముందు సీట్ల కోసం తన్నులాట!

ఈసారి 'మేక' చెప్పినట్లు కూర్చున్నారొకరివెనుక ఒకరట
అయినా సంగీతం రాలేదేం గ్రహచారం!
అంతలో అక్కడికి వచ్చిందొక నైటింగేలు.

ఎటు కూర్చుంటే సంగీతం వెల్లువలా ప్రవహిస్తుందని,
నలుగురు మిత్రులు అడిగారా పక్షిని!

నైటింగేలు అన్నది నవ్వుతూ వారితో!
చోటులు మారిస్తే రాదోయీ సంగీతం!
ప్రకృతి మీకిచ్చిన వరాలవి ప్రత్యేకం!
మీకూ, సంగీతానికి, చుక్కెదురు వ్యవహారం?

✤✤✤✤✤

---

**ఇవాన్ క్రైలోవ్ (Ivan Krylov 1769-1844) -** వోల్గా నదీ ప్రాంతంలో పేద కుటుంబంలో పుట్టినవాడు. పధ్నాలుగేళ్ల వయసులోనే అతడు వ్రాసిన Coffee Stall Keeper ఓపెరా అతడికి పేరు తెచ్చింది. అనేక నాటకాలు, వ్యంగ్య వ్యాసాలు, బానిసత్వంపై పోరాట రచనలు చేసి పోలీసుల దృష్టిలో పడినాడు. 1805లో వ్రాసిన కల్పిత గాథలు తనకెనలేని కీర్తిని తెచ్చాయి. గొగోల్ ఈ కథల్ని-'The People's book of Wisdom' అని ప్రశంసించాడు.

# 7. స్వెత్లానా

- వాసిలి ఝుకొవ్‌స్కీ (1808-1812)

ఓ ద్వాదశ శుభరాత్రి
కన్నెపిల్లలందరూ జాతకాలు చెప్పించుకున్నారు.
దానికేం పెద్ద తతంగం అక్కర్లేదు.
చెయ్యాల్సిందల్లా, కాలిజోడును వీధి ద్వారంపైగా విసిరేయాలి.
అది గడ్డకట్టిన మంచును చిదుముతుంది గదా!
అట్లాగే, నేలమీద గోధుమ గింజలు పారబోసారు
కోడిపెట్టను తెస్తే అది కెలుకుతూ తింటుంది కదా!
కరిగిపోయిన కొవ్వొత్తి మైనంపై, కొందరు,
తెల్లటి రుమాలును పరచారు, ఏ రూపం కనిపిస్తుందోనని!
కొందరైతే గిన్నెలో నీళ్లుపోసి
ఉంగరాల్ని, చెవి దుద్దుల్నీ వదిలారు, అప్పుడేం కనిపించిందో!

అందరూ కలిసి గుండ్రంగా తిరుగుతూ పాటలు పాడినారు!
మంచూ! నాకు మంచి మొగుణ్ణియ్యవే!
కోడిపెట్టా! నాకు కోపిష్టివాడొద్దు!
కొవ్వొత్తీ! నాకు కొవ్వెక్కిన వాడొద్దు!
నీళ్లగిన్నే! నాకు నీతిమంతుణ్ణివ్వు!

పొగమంచు శీతాకాలపు నింగిని పొరగా కమ్మింది.
పాలిపోయిన మొఖంతో చంద్రుడు పారిపోతున్నాడు మబ్బుల చాటుకు.
దిగులుతో ఉన్న స్వెత్లానాకు మాటలెక్కడివి, నిట్టూర్పులు తప్ప!

ఏమయ్యింది స్వెత్లానా; ఎందుకా మౌనం?
ఇప్పుడు నీకే అవకాశం, ఉంగారాన్ని తీసే తరుణం!
కోరుకో స్వెత్లానా! ఆలపించు గీతాన్ని!

-'కంసాలీ! కంసాలీ! కిరీటం, ఉంగరం నాపెళ్లికి తయారు చేయి!
అలంకరిస్తాడు చర్చిలో పూజారి నా తలపై కిరీటం!
మేలిముసుగులో నేను, నా వేలికి ఉంగరం!
కాని, మిత్రులారా! నేను ప్రేమించినవాడు దూరదేశమేగినాడు!
పన్నెండు నెలలాయె, ఉలుకూ పలుకు లేదాయె!
ఉత్తరం రాదాయో, ఊసూ పోదాయె!
గుండె అంత బరువెక్కి, గూడు కాస్త చెదిరిపోయె!
ఎక్కడున్నాడో అతడని స్వెత్లానా ఏడ్చింది వెక్కివెక్కి.
నన్ను మరచిపోయావా, నా ప్రాణదీపమా!
నన్ను విడిచిపోతివే, నా రక్షక రూపమా!
నా గుండెకోతను నీకెలా తెలుపను?
మనసు బాధను మాన్ప మరలిరాలేవా!

ఆడపిల్లల గదిలో అద్దము ముందు
కొత్తగా వెలిగించిన కొవ్వొత్తి ఉన్నది.
బల్లపై పరచిన తెల్లని వస్త్రాన
ఇద్దరికోసం సిద్ధంగా ఫలహారం.
కోరుకో స్వెత్లానా! కోరుకో చెలియా!

అర్ధరాత్రికల్లా అతడు రాగలడు!
అద్దంలో నీకు అతడు కనిపిస్తాడు.
నీ గది తలుపు తెరచి నిన్ను చూస్తాడు
నీతో కలిసి విందారగిస్తాడు.
కోరుకో స్వెత్లానా! కోరుకో చెలియా!

అర్ధరాత్రి దాటినా, అతడు రాలేడు.
వెండి అద్దం కాస్త వెలవెలాబోయింది.
కరిగిన కొవ్వొత్తి రెపరెపల కదిలింది.
స్వెత్లానా వణికింది చెప్పరాని భయంతో!
తన వెనక చూచుటకే తనువు భీతిల్లింది.
అద్దంలో పగుళ్ళు దద్దరిల్లిన వెలుగు.
కీచురాళ్ల కేక, హెచ్చరిక, హెచ్చరిక!
అర్ధరాత్రి రాక, అర్ధరాత్రి రాక!

✣✣✣✣✣

---

**వాసిలి ఝుకొవ్స్కీ (Vasili Zhukovsky 1783-1852) -** పల్లెటూరి జమీందారు 'బునిన్' టర్కిష్ యుద్ధంలో బందీగా పట్టుబడిన టర్కిష్ బాలికను వివాహమాడగా 'వాసిలి' జన్మించాడు. పెంపుడు తండ్రి ఆండ్రి ఝుకొవ్స్కీ పేరు పెట్టుకున్నాడు. నెపోలియన్‌తో జరిగిన యుద్ధంలో పాల్గొన్నాక అతడు భవిష్యత్ జార్ ప్రభువు రెండవ అలెగ్జాండర్‌కు గురువైనాడు. ప్రభుత్వ ఆగ్రహానికి గురైన రచయితలను రక్షించినాడు. రష్యన్ భావవాదానికి ఆద్యుడు. గొప్ప కవి, అనువాదకుడు. పాశ్చాత్య, ప్రాచ్య సాహిత్యాలను (జర్మనీభాషలోకి అనువాదం చేయబడిన ఇరాన్, హిందూస్తాన్ ఇతిహాసాల్ని) రష్యన్ భాషలోకి తీసుకువచ్చినాడు. స్మృతిగీతాలు, జానపద గేయాలు, పాటలు, అసంఖ్యాక స్వంతరచనలు, అనువాదాలతో రష్యన్ సాహిత్యాన్ని పరిపుష్ఠం చేసినాడు.

# నికితాకు లేఖ

**- కాన్‌స్టాంటిన్ బత్యుష్కోవ్ (1817)**

నీవంటే నాకెంత ఇష్టమో చెప్పనా, కామ్రేడ్! వీరుడా!
ఇక్కడంతా వసంతకాలపు హరితశోభ,
నింగిలో లార్క్‌పక్షుల సంగీత సభ.
వీటన్నిటినీ మించింది మైదానాలలోని మీ జాడ!

యుద్ధపు పిలుపు వినబడేంత వరకూ
ఓపికతో నెగళ్ల వద్ద కులాసాగా ఎదురుచూపులు
నాకెంత సంతోషమో చెప్పనా మిత్రమా!
ఈ ఎత్తైన కిటికీలోంచీ కనిపించే సైనికుల కవాతు!

లోయలో ముదురాకుపచ్చ వెలుగుల మధ్య
గుడారాల నీడలు, వీరపుత్రుల జాడలు.
సాయంకాలమయ్యేసరికి దూరంగా శతఘ్నుల ఉరుములు
ఉదయపు బాకా ఊదేవరకు నిద్రా దుప్పట్లో కలల ఉరుకులు

ప్రభాత నీహారికాధ్వనుల మధ్య అశ్వపుగిట్టల చప్పుళ్లు
తుపాకులు ఒక్కుమ్మడిగా భుజాలపై ఒదిగిన ధ్వనులు
కొండా కోనల్లో చుట్టూరా ప్రసరించిన ప్రతిధ్వనులు
సైనికుల వరుసల ముందు అశ్వికుడిగా సాగే ఆనందపు లాహిరులు.

నిప్పు, పొగల మధ్య దూసుకుపోతూ,
శత్రువులను చావుదెబ్బకొట్టే వ్యూహాలు!
రణన్నినాదాలు! యుద్ధోత్సాహపు కేకలు!
ఆగ్రహించిన తేనెటీగల్లా దూసుకుపోడాలు!
గుళ్ళూ, అగ్నిగోళాలు, తుపాకి మందూ! పెడబొబ్బలూ!
మాతృభూమి రక్షణకై ఉరకలెత్తే వాళ్ల గుండెల చప్పుడును
యుద్ధమే ఊపిరై పుట్టినవాళ్ల ఉత్సాహాన్ని ఆపగలమా నీవూ నేనూ?

✤✤✤✤✤

---

**కాన్‌స్టాంటిన్ బత్యుష్కోవ్ (Konstantin Batyushkov 1787-1855) -** ఉన్నత కుటుంబంలో జన్మించి విద్యావంతుడై అనేక యుద్ధాలలో పాల్గొని గాయపడినాడు. కవిగా అతడు వ్రాసిన Experiments బహుప్రసిద్ధికెక్కినది. 1822 నుంచి మంచానికే పరిమితమైనా అతడు వ్రాసిన విషాద స్మృతి గీతాలు (Elegies), లేఖాసాహిత్యం (Epistle) ఎంతో పేరు తెచ్చుకున్నాయి. పంథొమ్మిదవ శతాబ్దపు రష్యన్ గేయకవిత్వానికి (Lyrical Poetry) పునాదులు వేసి, పుష్కిన్ మెచ్చుకున్న కవిగా పేరుగాంచిన కాన్‌స్టాంటిన్ బత్యుష్కోవ్ 1855లో కన్ను మూసాడు.

# 9. వీనస్

**- అలెగ్జాండర్ పుష్కిన్ (1820)**

ఎగిరే మేఘమాల పలుచబడ్తోంది దూరంగా
ఓ స్వచ్ఛమైన దుఃఖాల తారా! సాయంకాలపు నక్షత్రమా!
నీ కిరణాలు శరత్కాలపు మైదానాలను వెండిగా మార్చాయి,
నల్లటి కొండ శిఖరాలు, స్వప్నిస్తున్న నదీ ప్రవాహాలతో సహా!
చీకటి ఆకాశంలో నీ చిరుకాంతి నాకిష్టం.
నిద్రపోతున్న ఆలోచనలను అది తట్టి మేల్కొలుపుతుంది.
నాకెంతో పరిచితమైన కాంతిగోళమా!
నీవీ మైదానాలపై ఉదయించినప్పుడల్లా
మిర్టిల్ చెట్లూ, సైప్రస్ వృక్షాలు నిదురలేస్తాయి.
దుఃఖ భారంతో దక్షిణ సముద్రాలు అలలుగా విరిగిపడ్తాయి.
విషాదపు ఆలోచనలు ఉక్కిరిబిక్కిరి చేస్తుండగా నేనక్కడ తిరిగాను.
ఎత్తైన పర్వతాలపై, సముద్ర మట్టానికి చాలా ఎత్తులో,
కొండలు, లోయల్లో చీకట్లు కమ్ముకునేంతవరకు!
నిన్ను చూడటానికి చీకటిలోంచి ఓ కన్య వచ్చింది.
నీకు తన పేరెలా వచ్చిందో తన స్నేహితులకు చెప్పింది.

*****

---

**అలెగ్జాండర్ పుష్కిన్ (Alexander Pushkin 1799-1837) -** పేద ఉన్నత కుటుంబంలో జన్మించాడు. అతడి తల్లి అబ్రహం హన్నిబాల్ (పీటర్ దగ్రేట్ వద్ద ఇంజినీర్ జనరల్) వంశానికి చెందినది. 1814లో అతడి తొలి పుస్తకం ప్రచురింపబడింది. 1820 కల్లా అతడు ప్రముఖ కవిగా పేరు తెచ్చుకున్నాడు. స్వేచ్ఛకై అతడు చేసిన పోరాటం, ప్రభుత్వానికి వ్యతిరేకంగా అతడు తయారు చేసిన ఎపిగ్రామ్‌లు కాపీ చేయబడి, ఒకరి

# 10. బందీ

**- అలెగ్జాండర్ పుష్కిన్ (1822)**

నిశ్చలమైన నిశీధి తారట్లాడే చీకటి కొట్లో,
సమాధిలో ఇరుక్కున్న శవంలా నేనొక బందీని.
ఆరుబయట ఆవరణలో ఆకాశాన్నుంచి గద్ద ఒకటి
రివ్వున దూసుకువచ్చి తన ఆహారాన్ని ఒడిసి పట్టింది.
రక్తం జిమ్మి నేల ఎరుపు రంగుతో మెరవగా
తన దృష్టి నాపై నిలిపి పెద్దగా పెట్టింది కేక!
అది పిలుపో, లేక అభ్యర్ధనో తెలీదు కాని
'పద! పారిపోడానికిదే సమయం!' అన్నదని అర్థమయ్యింది.
-'మనిద్దరం స్వేచ్ఛను పరిణయమాడినాము.
ఇక్కడ నుంచి తుఫాను మబ్బులున్న చోటుకి దూసుకుపోదాం!
ఉప్పొంగిన సముద్రాలు నింగిని తాకే చోటుకు
తుఫాను గాలులు, నేను మాత్రమే చొరగలిగిన ప్రదేశానికి!!'-

*****

నుండి ఒకరికి అసంఖ్యాకంగా అందజేయబడేవి. ఆ విధంగా అతడు జార్ ప్రభువు ఆగ్రహానికి గురై దక్షిణానికి బహిష్కరింపబడినాడు. అక్కడ విప్లవకారులతో (Future Decemberists) కలిసి మెలిసి ఉన్నాడు. ఆ కాలంలో భావకవిత్వం- కకాసస్, రాబర్ బ్రదర్స్- లాంటివి వ్రాసినాడు. మైఖెలొవొస్కోయిలో ఉన్నపుడు అతడు వ్రాసిన 'Boris Gdunov', అనేక గేయాలు అత్యంత ప్రసిద్ధికెక్కాయి.

# 11. నీకు...

**- అలెగ్జాండర్ పుష్కిన్ (1825)**

ఓ అద్భుత క్షణమా! నా ముందు నీవు
ఓ ప్రకాశవంతమైన సుందర స్వప్నంలా నిలబడినావు.
నా కోసమే రూపొందిన దృశ్యంలా
సంపూర్ణ స్త్రీ రూపంలా, పరిపూర్ణ ప్రేమభావనలా!

జీవితపు దుఃఖమనే యవనికపై
నిరాశ నిస్పృహలు నృత్యం చేస్తున్నపుడు
నీ సుందర వదనానికై నా ఆత్మ తపించినది.
నీ మధుర స్వరఝురికి నా వీనులలల్లాడినవి.

పెను తుఫానుల తాకిడికి
నేను కన్న కలలన్నీ నీటిమాటలై నిష్క్రమించినవి.
నీ రూపం చెదరి, నా హృదయం ముక్కలైనది.
నీ మాటలు నా చెవులకు తాకకున్నవి.

శీతల నిశీధి ఒంటరితనంలో ఎన్నో ఏళ్లు గడిచినవి.
జీవితం ప్రేమ, కన్నీళ్లు, ప్రేరణ, దేవుడు లేని బీడునేలగా మారినది.
అకస్మాత్తుగా నీవు నా ముందు ప్రత్యక్షమైనావు.
నా కోసమే రూపొందిన పరిపూర్ణ స్త్రీ రూపంలా!

నా హృదయంలో ఉప్పొంగినది మధుర భావన,
కొత్తదనాన్ని అభిలషిస్తూ, ఆరాధిస్తూ సాగే ప్రేరణ!
అది సూర్యోదయంలా కొత్త మెలకువ!
జీవితానికి, ప్రేమకు, కలలకు, కన్నీళ్లకు కాలువ!

*****

డిసెంబరిస్ట్ ఉద్యమం చల్లారినాక మొదటి నికోలాస్ ప్రభువు అతడికి క్షమాభిక్ష పెట్టి మాస్కోకు రావించినాడు. అప్పటి నుంచి అతడి జీవితమంతా అధికారుల పర్యవేక్షణలో గడిచింది. అయినా అతడు తన ధోరణి మార్చుకోలేదు. కడపటి వరకు

# 12. శీతాకాలపు సాయంత్రం

**- అలెగ్జాండర్ పుష్కిన్ (1825)**

భూమిపై ఓ తుఫాను బుసలు కొడ్తున్నది.
నీహారికా వలయిత పొగమంచు తెరలను కప్పుతూ
ఒక రాకాసి మృగంలా అది ఊళ పెడ్తున్నది.
ఒక్కోసారి పసిపాప ఆక్రందనలా కలవరపరుస్తూ
మా ఇంటిపైకప్పు గడ్డిని కదిలిస్తూ ఆడుకున్నది.
ప్రవాసిలా మైదానంలోకి పోయి కూర్చున్నది.

మా గుడిసెలో దీపం కొడిగట్టగా
చీకటి చలికన్నా దుర్భరంగా ఉన్నది.
ఎందుకు మిత్రమా! ఆ బేలచూపులు!
కిటికీలోంచి కనిపిస్తున్న తుఫాను భీభత్సం గురించా?
అలసిపోయిన నీ దేహం అడుగుతున్న నిద్ర గురించా?

ఇటురా! నా యవ్వనపు చెలికాడా!
మధుసేవనంలో మరచిపోదామీ కష్టాల్ని!
ఎవరైనా అప్సరస నాకోసమో పాట పాడనీ!
ఇల్లు దాటని పక్షి నా కొరకు గీతాన్ని వినిపించనీ!

భూమిపై ఓ తుఫాను బుసలు కొడుతున్నది.
నీహారికావలయిత పొగమంచు, తెరలను కప్పుతున్నది.
ఒక రాకాసిమృగంలా అది ఊళ పెడ్తున్నది.
ఒక్కోసారి పసిపాప ఆక్రందనలా కలవర పరుస్తున్నది.

ఇటురా! నా యవ్వనపు చెలికాడా!
మధుసేవనంలో మరచిపోదామీ కష్టాల్ని!

✤✤✤✤✤

నియంతృత్వానికి వ్యతిరేకంగా పోరాడుతూనే వచ్చాడు. 1826-1830 ప్రాంతంలో Poltava, The little house in Kolomna; Little tragedies, The tale of Bekin లాంటి అద్భుత గేయాలు వ్రాసినాడు.

# 13. ప్రవక్త

**- అలెగ్జాండర్ పుష్కిన్ (1826)**

ఎంతకూ చల్లారని జ్ఞాన దాహంతో నేనొకనాడు,
ఎడారిలో తిరుగుతున్నపుడు ఎదురుగా ప్రత్యక్షమైనాడు,
సెరాఫిమ్ అనే రెక్కలున్న దేవదూత, ఎడారి కూడలిలో!
అతడి సున్నితమైన వేళ్లు నన్ను స్పృశించాయి.
అదిరిపడిన గరుడ పక్షిలా నేను
ఆకాశంతో హద్దులున్న నేలను వీక్షించాను.
అతడు నా చెవులను స్పృశించాడు.
అతడి రెక్కల రెపరెప చప్పుడు నాకు స్పష్టమైనది.
నేల నుంచి నింగిపైకి పాకిన విద్యుల్లతలా
సముద్రపు తిమింగలం చేపపిల్లలా కదలిస్తున్న అలల్లా!

అతడు నాపైకి వంగి
నా పాపపు నాలుకను తెంపి పారవేసాడు.
నానుంచి దృష్టి మరల్చకుండా
మహాసర్పపు విషపు కొండెను నా శీతల పెదాల మధ్యకు నెట్టాడు.
తన నిశిత కరవాలంతో వేగంగా
నా ఱొమ్మును తెరచి, కొట్టుకుంటున్న గుండెను పెరికి
ఆ ఖాళీస్థలంలో మండుతున్న నిప్పుకణికను ఉంచాడు.
నేను మృతుడనై ఉండగా దేవుడు పలికాడు-
'మునీ! నిద్రలే! నా పిలుపు విను!
భూమిపై ఎవరికీ తల వంచకుండా
మానవుల హృదయాలను మంచి మాటలతో నింపు.
దైవాజ్ఞలను విడమరుస్తూ 'ప్రవక్త'వై వర్ధిల్లు!

*****

---

1830లో వచన రచన మొదలెట్టి- Dubrovsky, The queen of Spades, The Captains daughter, A history of the pugacherebellion వ్రాసినాడు. 1836లో సావరెమన్నిక్ (The Contemporary) అనే జర్నల్ నడిపినాడు. రాజు రాజబంధువులు

# 14. సైబీరియాలో ఖైదీ

**- అలెగ్జాండర్ పుష్కిన్ (1827)**

సైబీరియా గనులున్న చీకటిదేశంలో
ఓర్పుగల నీ ఆత్మను ఏదీ లొంగదీయకుండును గాక!
నీ కఠోర శ్రమ, ఉన్నతమైన ఆలోచనలు
అవేనాడూ వృధాకావు, అధైర్యపడకు.

దురదృష్టానికి తోబుట్టువు, అట్టడుగు ఆశ
చీకటి గుయ్యారపు బాధను తొలగించును గాక!
ఆనందం పెల్లుబుకి, దుఃఖం అంతర్ధానమౌతుంది.
వాగ్దానం చేయబడి, ఎదురు చూసిన కాలం వచ్చి తీరుతుంది.

పెద్దపెద్ద తాళాలు పగుల్తాయి, సంతోషించు!
ప్రేమ, స్నేహం ఎటువంటి భ్రాంతీ కానివి
నీ గంభీరపు ఒంటరితనంలోకి ప్రవహిస్తాయి,
స్వేచ్ఛను ప్రేమించే నా స్నేహ స్వరంలా-

జైలు గోడలు బద్దలవుతాయి.
కారాగారపు ద్వారం వద్ద స్వేచ్ఛ స్వాగతం పలుకుతుంది.
నీ సోదరులందరూ నిన్ను అభినందిస్తూ
వీరఖడ్గాన్ని నీ విజయ హస్తాలలో ఉంచుతారు.

*****

---

ఒత్తిడితో ఉన్న పుష్కిన్- ఒక దురదృష్టపు రోజున డి-ఏంథెస్ అనే డచ్ రాయబారి పెంపుడు కొడుకుతో జరిగిన Duel (ద్వంద్వయుద్ధంలో) మరణించాడు.

పుష్కిన్ స్నేహితుడైన గోగోల్ (Gogole) అంటాడు- 'పుష్కిన్ రష్యన్ ఆత్మ సంపూర్ణంగా ఉన్న వ్యక్తి. రెండు వందల సంవత్సరాలు అభివృద్ధి పథంలోకి నడిచినాక, రష్యన్‌లు ఎలా ఉంటారో అతడిప్పుడు అలా నడిచినాడు'-

# 15. విషవృక్షం - మహారాజు

**- అలెగ్జాండర్ పుష్కిన్ (1828)**

ఎండ శాపమైన ఎడారి నేల వద్ద
ఏంటియార్ అనేవాడు కావలి భటుడు!
భయమే వాడిని చూసి భయపడుతుంది.
ఎండిన నిశ్చలత్వాన్ని పెండ్లాడినట్లు అక్కడ వాడొక్కడే!

దాహంతో మాడే 'స్టెప్పె' మైదానాలలో పుట్టాడతడు,
పైన ఎర్రగా మండుతున్న సూర్యుడు
అందరిపై ద్వేషంతో వాడు విషాన్ని అరిగించుకుని
విషకన్యకన్నా విషంగా విరుచుకుపడతాడు.

బెరడు నిండా పాకిన గరళం
ఉదయపు ఎండ వేడికి కరుగుతుంది.
చీకటి పడినాక చిక్కబడ్తుంది.
స్ఫటిక బిందువులై మెరుస్తుంటుంది.

పక్షులూ, జంతువులూ ఆ పక్కకే రావు.
నల్లటి గాలులు మాత్రం మెల్లగా పలకరించి,
వేగంగా అక్కడ నుంచి వెళ్లిపోతాయి వెంటనే,
తమతో విషాన్ని తగినంత తీసుకుని!

ఎప్పుడైనా వర్షపు మబ్బు తలంటుపోసి
కొమ్మల్ని రెమ్మల్ని కాసింత తడిపితే
మొదలు వరకు జారిన నీళ్లు మొత్తం
మోసుకుపోతాయి బోలెడంత గరళాన్ని

ప్రభువు పంపగా సేవకుడొకడు నానా ప్రయాసతో,
చెట్టుకొమ్మనొకదానిని చూపించాడు నరికి తెచ్చి
కొమ్మను మోసిన భుజాలు కమిలిపోయి నల్లగా,
వచ్చినవాడు వచ్చినట్లే పాలిపోయి నేలకూలాడు!

మహరాజు ఆజ్ఞతో పనివాళ్లు పదిమంది,
కొమ్మలో విషాన్ని అమ్ములకు పులిమారు.
చుట్టుపక్కల ఉన్న పరరాజులందరిని
మృత్యులోకంలోకి పంపాడు మహరాజు.

✤✤✤✤✤

---

(**ఏటియార్** - విషవృక్షం)

# 16. కకాసస్ పర్వతాలు

**- అలెగ్జాండర్ పుష్కిన్ (1829)**

నాకు దిగువగా వెండి శిఖరాల కకాసస్ పర్వతం
నా పాదాల దగ్గర నురగలు కక్కుతూ, ఘోషిస్తూ నీటి ప్రవాహం
అదుగో దూరంగా ఓ గ్రద్ద ప్రశాంతంగా శోధిస్తున్నది నింగిని,
కదుల్తున్నట్లు కనిపించకుండానే చక్కర్లు కొడుతున్నది.
ఇది పర్వతాలను చీల్చే నదుల పుట్టినిల్లు
కొండచరియలు ఉరుముల్లా విరుచుకుపడే శిలల వాకిళ్లు.

తుఫాను మబ్బులు గుంపులుగా గుమికూడి
కుండపోతగా వర్షపు జల్లుల్ని కురిపించే చోటిది.
నగ్నశిఖరాల అంచులపై నాట్యమాడుతూ జలధారలు
కొండవాలుల్లో జాలువారి నాచునీ, పొదల్నీ లాక్కుపోతాయి.
దిగువనున్న హరితవనాల్లో సుగంధ పుష్ప వృక్షాలు
ప్రశాంతంగా పక్షులు, సంతృప్తితో లేళ్లు నివసించే చోటది.

ఇంకా దిగువన కొండల్లో, గుహల్లో ఇళ్లల్లో మనుషులు,
పచ్చిక మైదానాల్లో గొర్రెల మందలు, పూల తివాచీలు,
ఆరగ్వ నదీ తటాన అలుముకున్న నీడలు.
అడుగో ఓ గొర్రెలకాపరి! ఒంటరిగా, గంభీరంగా
ఉద్వేగపు నవ్వులతో అశ్వాన్ని ఉరికిస్తున్నాడు.

బోనులో పడ్డ మృగం ఆకలితో అల్లాడుతూ
స్తంభాల్ని నాకుతూ, ఊచల్ని కొరుకుతూ అరుస్తున్నట్లు,
తీరంవేపు పోవాలని తీవ్రంగా తపిస్తూ
అశ్వాన్ని అదిలిస్తున్నాడు, అడ్డదిడ్డంగా పోతూ!
అయ్యోపాపం! అతడి శ్రమ నిష్ఫలం
మహాకాయుల్లా ఆ కకాసస్ పర్వతాలు
కమ్ముకున్నాయి అతడి చుట్టూరా కోటగోడల్లా!

✤✤✤✤✤✔

# 17. కోరిక

- అలెగ్జాండర్ పుష్కిన్ (1816)

కాలం కాళ్లీడుస్తున్నది.
విఫల ప్రేమ మిగిల్చిన నా ఎదలోని గాయం
ప్రతిక్షణం రెట్టింపవుతూ
నిద్రలేని స్వప్నాలను, ఉన్మత్తపు పీడకలల్ని ఉసికొల్పుతున్నది.
అయినా నేను ఫిర్యాదు చేయను-
దుఃఖం నాకు మనశ్శాంతినిస్తుంది.
కన్నీళ్లు నాకు ధైర్యాన్నిచ్చి కారిపోతాయి.
దుఃఖంతో బందీ అయిన ఆత్మ
అశ్రువులలో నిగూఢమైన ఆనందాన్ని వెదుక్కుంటుంది.
జీవమా, వెళ్లిపో! ఖాళీభూతమా, ఇటురా!
ఎగురుకుంటూ శూన్యపు నిశ్శబ్ద నిశీధిలోకి నిష్క్రమించు.
నా ప్రేమ యొక్క అనంతపు వేదన నాకు ప్రియమైనది.
నా ప్రేమలా నేను మరణిస్తుంటే, నిన్ను ప్రార్థిస్తున్నా,
నన్నలానే మరణించనివ్వు.

✣✣✣✣✣

# 18. భూతపిశాచాలు

- అలెగ్జాండర్ పుష్కిన్ (1830)

సుడిగాలి మేఘాలు, తుఫాను మబ్బులు
ప్రళయ వాతూల దళాఢకాలు.
మసకబారిన ఆకాశం, మసక చీకటి రాత్రులు
దొంగచాటుగా చంద్రుడు, ఎగిరే మంచును వెలిగిస్తున్నాడు.
మేం పోతూనే ఉన్నాము... దారి తరగదు...
ఊరూ పేరూ తెలియని మైదానాల్ని, కొండల్ని దాటుకుంటూ!
భయం నన్ను గట్టిగా పట్టుకుంది, నిశ్చలంగా నేను.
గణగణమని గంటలు మోగుతున్నాయి, బండి గంటలు.

బండి నడిపేవాడా! లే! గుర్రాలు అలిసిపోయాయి.
-'అవును దొరా! అలిసిపోయి అవి నెమ్మదించాయి.
ఈ గాలీ, మంచుకు నాకు చూపానడం లేదు.
చుట్టుపక్కల దారి కనిపించడం లేదు. ఏం చేద్దాం?
మనం దారి తప్పాం! ఏదో భూతం మన బండి నావహించింది.
దానికిష్టమైనట్లు అది మనల్ని దారి మళ్లించింది.

అదుగో అటుచూడు, ఆ భూతాన్ని, విశృంఖల నృత్యాన్ని
ఉమ్మేస్తూ, ఉరిమేస్తూ, ఉద్రేకంగా ఉడికిస్తూ-
పగలబడి నవ్వి ఆ అశ్వాన్ని పడగొట్టిందా కొండ దిగువ.
అదుగో అదృశ్యమైంది, మరుక్షణంలో అగుపిస్తోంది.
ఒకక్షణం నిప్పుకణం, ఒకచోట అగ్నిజ్వాల
మరుక్షణం చీకటిలో మటుమాయం అవుతున్నది.

సుడిగాలి మేఘాలు, తుఫాను మబ్బులు
ప్రళయవాతూల దళాఢకాలు
మసకబారిన ఆకాశం, మసక చీకటి రాత్రులు

దొంగచాటుగా చంద్రుడు ఎగిరే మంచును వెలిగిస్తున్నాడు.
తిరిగిన చోటే తిరిగి తిరిగి అశ్వాలు ఆగిపోయాయి.
గంటల గణగణ ఆగిపోయింది. అంతా నిశ్శబ్దం!
ఆ కనిపించేదేమిటి? తోడేలు కాదు కదా!
'ఏమో ప్రభూ! నాకేమీ కనిపించడం లేదు!'

మంచు తుఫాను ఉధృతమై అంచుల్ని కొరుకుతోంది.
భయంతో గుర్రాలు సకిలింతలు పెంచాయి.
శ్వేతమైదానంలో భూతాల సందడి
చీకటిలో వాటి కళ్లు, గుర్రాలకు గుండె ఝల్లు.
పిశాచాల కాళ్లగజ్జెలు భీకరంగా మోగుతుంటే
అన్నీ మా చుట్టూ వలయంగా మూగినాయి.

వెన్నెల కాంతి చేసే మాయాజాలంలో
అవి అరుస్తూ, కరుస్తూ, కవ్విస్తూ, పిలుస్తున్నాయి.
గుండ్రంగా తిరుగుతూ, గంతులేస్తూ అవిచేసే ఉన్మత్త నృత్యం.
ఆకురాలు కాలంలో గాలికి కొట్టుకుపోయే ఎండుటాకుల దృశ్యం.
ఎందుకు వాటికంత వేగం? ఎక్కడికి వాటి ప్రయాణం?
భూతాల వివాహ సంరంభమా? మంత్రగత్తెల మహేంద్రజాలమా?

సుడిగాలి మేఘాలు, తుఫాను మబ్బులు,
ప్రళయ వాతూల దళాఢకాలు
మసకబారిన ఆకాశం, మసక చీకటి రాత్రులు,
దొంగచాటుగా చంద్రుడు ఎగిరే మంచును వెలిగిస్తున్నాడు.
వడి దిరుగుతూ భూతాలు నింగికెగుర్తున్నపుడు
నేలకు జారుతున్న మంచు మేలిముసుగులా కమ్మినపుడు
వాటి భయంకరమైన మూల్గులు, అరుపులు
నా గుండెను భయంతో, ఆశ్చర్యంతో పిండివేస్తాయి.

✤✤✤✤✤

# 19. నలివైకో వాంగ్మూలం

- కొంద్రాటి రైలియేవ్ (1824-25)

నాకొక విషయం స్పష్టంగా తెలుసు!
నియంతృత్వానికి ఎదురు తిరిగిన
మొట్టమొదటి వాడు మృత్యువునోట పడక తప్పదని!
విధి నన్నెప్పుడో ఎన్నిక చేసిందిలే, కాని,
పైకం చెల్లించకుండా స్వేచ్ఛ దొరికిందెప్పుడు?
ఈ సత్యం నాకు మనోవాక్కాయాల సాక్షిగా తెలుసు.
నా దేశ స్వాతంత్ర్య పోరాటంకై నేను ప్రాణాలు విడుస్తాను.
నేను పోతూ, నా దారినే వస్తున్నవారిని
'పవిత్రపిత' సాక్షిగా ఆశీర్వదిస్తాను.

(నలివైకో సెవెరిన్-ఉక్రెయిన్ కోసక్కుల తిరుగుబాటులో రైతులకు నాయకత్వం వహించగా 1597లో ఉరితీయబడినాడు.

*****

---

**కొంద్రాటి రైలియేవ్ (Kondraty Ryleyev 1795-1826) -** బాటొవొ గ్రామంలో జన్మించి, సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో విద్యనభ్యసించి, సైన్యంలో కొంతకాలం పనిచేసి, అరకఛెయేవ్ పాలనను నిరసిస్తూ రాజీనామా చేసినాడు. 1823లో Secret Northern Society లో చేరి, 14 డిశంబరు 1825 తిరుగుబాటులో పాల్గొన్నాడు. ఇతర డిసెంబరు తిరుగుబాటు నాయకులు నలుగురితోపాటుగా ఇతడినీ 13 జులై 1826లో ఉరితీసినారు. పుష్కిన్ శిష్యుడిగా చెప్పుకున్న రైలియేవ్ To a favourite, Meditations అనే ప్రముఖ కవితల సంకలనాల్ని వెలువరించాడు. అతడి కవితలలో పాతతరం కథానాయకులు గాథలు వర్ణించబడి ప్రజలను నియంతృత్వానికి వ్యతిరేకంగా పోరాడమని ప్రబోధిస్తుంటాయి. దేశభక్తి, విప్లవతత్త్వం అతడి కవిత్వం నిండా పొంగి ప్రవహిస్తుంటుంది.

# 20. వొొయి నారొవ్‌స్కీ

**- కొండ్రాటి రైలియేవ్ (1825)**

లెనా నదీ విశాల పరివాహక ప్రాంతంలో
మంచుగాలులు విస్తృతంగా వీచే చోట
కొయ్యదుంగలు పటిష్ఠమైన గోడగా
నల్లని పొడుగాటి ఇళ్ల వరుసలు.
చుట్టూరా చిక్కటి మంచులో శంఖువృక్షాలు
పవిత్ర చర్చిదేవాలయ గోపురాలు
గర్వంతో తలెత్తుకుని చూస్తున్నట్లు కానవస్తాయి.
దూరంగా ఓ అడవి గుసగుసలాడ్తుంటే
పర్వత శిఖరాలు ప్రతిధ్వనిస్తూ రంపపు అంచులా కనిపిస్తాయి.

ప్రకృతి ఇక్కడ క్రూరంగా, అనాగరికంగా ఉంటుంది.
ప్రతికూల వాతావరణం మధ్య నది కోసుకుంటూ ప్రవహిస్తుంది.
ఆకాశం ఎల్లప్పుడూ నల్లమబ్బులతో దుఃఖిస్తుంటుంది.
దీర్ఘశీతల రాత్రుళ్లు గుర్తుకువచ్చి ఇటువేపెవ్వరూ అడుగుబెట్టరు.
దేవుడే మరచిపోయిన, బాధాపూరిత బహిష్కృత ప్రదేశమిది.

ఈ యకుటిస్క్ ప్రాంతం ఏడాదికోసారో, రెండుసార్లో
సైనిక కాపలా మధ్య ఖైదీల గుంపు వచ్చినప్పుడు మేల్కొంటుంది.
ఎప్పుడన్నా ఒకసారి రష్యన్ బిడారి వర్తకులు వస్తే రావచ్చు.
ఆ కొద్దికాలం ఊరు మేల్కొంటుంది. ఊపిరి వెచ్చనౌతుంది.
అనేకమంది జనం రకరకాల పక్షుల్లా కువకువలాడుతారు.

చలికాలం పోగానే నిశ్శబ్ద అరణ్యం చైతన్యవంతమౌతుంది.
ఆకుపచ్చని లోయల్లో లెనా నది పరవళ్లు తొక్కుతుంది.
ఒక్కక్షణపు ఆనందం ఒంటరి ఖైదీని చేరుతుంది.
నరకకూపపు నిశ్శబ్దం బద్దలై చిరు ఆశ చిగురించగా
ప్రశాంతత, శాంతి అతడి కల్లోలపు ఆత్మలో ప్రవహిస్తాయి.
మరుక్షణం దుష్టశత్రువు వదనంలో ఓ వెకిలినవ్వు మెరవగా
చిమ్మచీకటి చిక్కటి కాలవర్ణంలా కాలాన్ని కమ్మేస్తుంది.

❖❖❖❖❖

# 21. హుస్సార్ గీతం

- డెనిస్ డేవీడోవ్ (1815)

ఉద్వేగం, ఉద్విగ్నతే కదా యుద్ధం
జార్‌ప్రభు సైన్యం దేశ రక్షణకు సంసిద్ధం.
ద్రాక్షసారాయి, కత్తి, గుర్రం
ఓ, హుస్సార్! జీవితానికి చాలు ఈ వరం!
ఉద్వేగం, ఉద్విగ్నతే కదా యుద్ధం
జార్‌ప్రభు సైన్యం సదా సంసిద్ధం.

దెయ్యంతోనైనా చేస్తా పోరాటం,
మాతృభూమి రక్షణే నా ఆరాటం!
కుళ్లుకునే ఫ్రెంచివాళ్లు మళ్లీ మళ్లీ,
దండెత్తివస్తే వాళ్లని దండిస్తాం!
దెయ్యంతోనైనా చేస్తాం పోరాటం,
మాతృభూమి రక్షణే మా ఆరాటం.

శిబిరాలపై ఎగిరే విజయపతాకలు
మన జీవితాలు మండే నెగళ్ల ప్రతీకలు
పగలంతా శత్రువుపై యుద్ధ యాత్రలు
సాయంకాలానికి సిద్ధం మధుపాత్రలు.
శిబిరాలపై ఎగిరే విజయ పతాకలు
మన జీవితాలు మండే నెగళ్ల ప్రతీకలు.

మంచంపై తీసుకు తీసుకు మరణించడం,
ఆ ప్రభువులకు ఆది నుంచి అలవాటులే!
ఆఖరి క్షణం వరకూ బిక్కుబిక్కుమని
అస్తమించడం మన చేతకాదులే!
మంచంపై తీసుకుతీసుకు మరణించడం
ఆ ప్రభువులకు ఆది నుంచీ అలవాటులే!
పదునైన కత్తుల మధ్యలో
పడిపోవడమే నాకిష్టం!
మృత్యువు ముడి బిగిసే వరకు
ఆ ముచ్చట తలవని బతుకిష్టం!
పదునైన కత్తుల మధ్యలో
పడిపోవడమే నాకిష్టం!

ఉద్వేగం, ఉద్విగ్నతే కదా యుద్ధం,
జార్ ప్రభుసైన్యం సదా సంసిద్ధం!
ద్రాక్షసారాయి, కత్తీ, గుర్రం
ఓ హుస్సార్! జీవితానికి చాలు ఈ వరం!
ఓహో! ఉద్వేగం, ఉద్విగ్నతే కదా యుద్ధం!
జార్ ప్రభుసైన్యం మాతృభూమి రక్షణకు సంసిద్ధం!

✤✤✤✤✤

---

**డెనిస్ డేవిడోవ్ (Denis Davydov 1784-1839) -** మాస్కోలో ఉన్నత కుటుంబంలో జన్మించాడు. తండ్రి అడుగుజాడలలో అశ్వికదళానికి అధిపతి అయినా, పై అధికారుల అనుమానానికి గురై దూరగ్రామాల్లోని హుస్సార్ దళంలోకి పంపబడినాడు. అతడి కవితలు జార్ ప్రభువును, సభికుల్ని ఎత్తిపొడిచేట్లు ఉండడం దీనికి కారణం. 1812లో యుద్ధంలో మాతృభూమి రక్షణకై వీరోచితంగా పోరాడడంతో అతడికి పదోన్నతి లభించినా దానిని అంగీకరించలేదు. అతడి కవిత్వమంతా దేశభక్తితో, వీరుల గాధలతో నిండి ఉండి, అరాక్ఛెయేవ్ క్రూరపాలనను నిశితంగా విమర్శిస్తుంది. మిలిటరీ చరిత్ర గురించి అతడు వ్రాసిన Diary of the Partisan Actions (1812) పుస్తకం కూడా అతడి కవిత్వంలా ప్రసిద్ధికెక్కినది.

# 22. గెథె మరణ సందర్భం

- ఎవ్గిని బారాటిన్స్కీ (1832)

మృత్యువు సమీపించినప్పుడు, ఆ వృద్ధుడు
తన నిశితమైన నేత్రాలను ప్రశాంతంగా మూసుకున్నాడు.
ఈ భూప్రపంచంలోని సర్వ విషయాలూ
ఆ మేధావి జ్ఞానం ముందు తలవంచాయి.
అటువంటి జ్ఞాని కపాలంలో ఇక పురుగులు నివసిస్తాయి.

సృష్టిలోని అద్భుత విషయాలను శోధించినవాడు.
ఉప్పొంగిన హృదయంతో ప్రశంసించినవాడు.
ప్రపంచం తలుపుతట్టి అనంతాన్ని వీక్షించినవాడు.
నేడు మరణించి సమాధిలో తలదాచుకున్నాడు.

కళను కావ్యాలను ఔపోసన పట్టినాడు.
అనాది సత్యాలకు పునాది నిలిపినాడు.
నిరుపేద గుడిసెనూ, రాజభవన మెరుపునూ
తనివితీర దర్శించి, నేడు, తరలిపోయినాడు.

ప్రకృతితో మమేకమై పలవరించినాడు.
సెలయేళ్ల భాషలో పలకరించినవాడు
అరణ్యాల గుసగుసల అర్థం విడమరచినాడు.
పచ్చిక జననాన్ని, తారల ప్రకాశాన్ని
సముద్ర తరంగాలకు భాష్యం చెప్పినవాడు
స్వయంగా చూడాలని స్వర్గానికేగినాడు.

సంపూర్ణ మానవుడి సందర్శనం కొరకు
దేవుడి సరిహద్దులు దాటి వెదకినాడు.
తరుగుతున్న ఆయువు తరలునెచటకోయని
తనువున్నపుడే తాను సైతానును పిలిచినాడు.

సమాధికావల, పెంజీకటి కావల
ఆవల ఉండే వెలుగును ఆతడు దర్శించినాడు.
మరణానంతర జీవన మార్మిక గీతమై
జ్ఞానపు సంగీతమై, ఆలోచనా రాగమై
స్వర్గానికి స్వేచ్ఛగా తానెగిరిపోయినాడు.

✣✣✣✣✣

---

**ఎవ్‌గిని బారాటిన్‌స్కీ (Yevgeni Baratynsky 1800-1844) -** ధనవంతులైన ప్రభువుల కుటుంబంలో జన్మించాడు. సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో విద్యాభ్యాసం చేసి సైన్యంలో పనిచేసినాడు. 1819లో ప్రచురింపబడిన కవిత్వంతో స్మృతిగీతాల (ఎలిజీ-Elegy) రచయితగా పేరుతెచ్చుకున్నాడు. డెల్విగ్, పుష్కిన్, రైలియెవ్, ఝుకోవ్‌స్కీలకు స్నేహితుడు. 1825 నుంచి మాస్కోలో స్థిరపడి గీతరచయితగా, వేదాంత దర్శకుడిగా ప్రసిద్ధికెక్కినాడు. పుష్కిన్ ఎంతగానో అభిమానించిన బారాటిన్‌స్కీ- Thought is the Test of imagination' - 'ఊహకు పరీక్ష ఆలోచన' అని ప్రకటించినాడు.

# 23. నావికుడు

**- నికొలాయి యజికోవ్ (1829)**

రాత్రింబవళ్లూ ఈ చిరాకు సముద్రం
ఆకాశం వేపు ఆగ్రహంతో అదిరిపడ్తుంది.
దాని భయంకర విశాల విస్తీర్ణంలో
ఎన్నో దుఃఖాలు ఇసుకలో కప్పబడిపోతాయి.

అనుకూలమైన గాలి వచ్చిందని, సోదరులారా!
నేనే తెరచాపను స్వయంగా పైకెత్తాను.
రెపరెపలాడుతూ నావను లాక్కుపోతుంటే
అడ్డువస్తున్న అలలు అర్ధభాగాలై తెగిపోతున్నాయి.

నింగిపై మేఘాలు నిలువకుండా పోతున్నవి
రాత్రి చీకటిలో జలధి రాకాసి కానున్నది.
ఎంత తుఫానైనా రానీ, ధైర్యమున్నది మాచెంత,
మా సర్వశక్తులు ఒడ్డి మా నౌకను కాపాడుతాం!

ఉరుములు, మెరుపులు రానీ, సోదరా!
పిడిగులు కురిసి మృత్యువు నృత్యం చేయనీ,
అలలు మమ్మల్ని ఆకాశంలోకి విసిరేయనీ,
నడిసంద్రపు లోతుల్లోకి వడిగా ముంచెత్తనీ!

ఈ తుఫానులకు, కల్లోలాలకు దూరంగా
ప్రశాంతమైన ప్రదేశమొకటున్నది.
అక్కడ ఆకాశం అసలే నల్లబారదు
చిక్కని ప్రశాంతత ఎక్కడా చెదరిపోదు.

ధైర్యంగల వాళ్లను దీర్ఘతరంగాలు, ఆ
తీరం వేపుకు నేరుగా తీసుకుపోతాయి.
తుఫాను గాలులనెదుర్కొని, సోదరా!
నా తెరచాప నన్ను చేరుస్తుంది గమ్యానికి!

✤✤✤✤✤

---

**నికొలాయి యజికోవ్ (Nikolai Yozkov 1803-1846) -** సింబ్రిస్క్‌లో ఉన్నత కుటుంబంలో జన్మించి, ఒకపక్క చదువూ, మరొకపక్క స్నేహితులు, ప్రేమ, మధువులో నిష్ణాతుడైనాడు. పుష్కిన్‌కు స్నేహితుడు. పద్యకవిత్వం, లేఖాకవిత్వంతో రష్యాలోని ఉత్తమ కవులలో ఒకడిగా పేరు తెచ్చుకున్నాడు.

# 24. పల్లెటూరి విందు

- అలెక్సి కొల్త్సోవ్ (1830)

తెరచి ఉన్న ద్వారంలోంచి విచ్చేస్తున్నారు అతిథులు,
అశ్వాలు లాగుతున్న దేవదారు స్లెడ్జ్ బళ్లపై.
ఇంటి యజమాని, యజమానురాలు వినమ్రంగా తలవంచి
స్వాగతం పలుకుతున్నారు ఆత్మీయంగా అతిథులకు.
అందంగా అలంకరించబడిన గృహంలో
వెలుగుతున్నాయి దేదీప్యమానంగా దీపాలు.
దేవతలకు ఒక్కక్షణం ప్రార్థనలు చేసి
భోజనాల బల్లవేపు నడిచారందరూ.

ఓక్ బల్ల చుట్టూరా పైన్ కొయ్యల బల్లలు!
ముచ్చట్లాడుకుంటూ, ముసిముసి నవ్వులు నవ్వుతూ
అందరూ కూర్చున్నారు తమతమ స్థానాలలో.
కాల్చిన కోడి, బాతు మాంసాలు, రకరకాల భక్ష్యాలు
దారు పళ్లేలపై అమర్చబడి ఉన్నాయి పొందికగా!

ఇంటి యిల్లాలు తన స్నేహితురాళ్లను పిలుస్తోంది ఆప్యాయంగా!
సిల్కు అంచు మస్లిన్ గౌనులో మెరుస్తున్నదామె ఎంతో అందంగా!
ఇంట్లో తయారుచేసిన మధువుతో గ్లాసులు గలగలలాడాయి.
యజమాని చిన్నికుమార్తె కాబోలు పళ్లరసాన్ని అందిస్తున్నది.
విందారగిస్తూ అతిథులు పంటల గురించి ముచ్చటిస్తున్నారు.

"దేవుడి దయతో వర్షాలు కురిసి, పాడిపంటలు వృద్ధి అవుతాయి!
పచ్చని పచ్చిక, పంటలతో నేలంతా హరిత వనమవుతుంది!"
అనుకుంటూ వారు ఆరగించారు ఆహారం.

ఇల్లంతా సందడి సందడి. కాలమిట్టే గడచి అర్ధరాత్రి దాటింది.
కోడి కూయకముందే అందరూ వెళ్లిపోయారు.
చీకటి ఆక్రమించుకున్న ఇంట్లో నిశ్శబ్దానిదే రాజ్యం.
మూసి ఉన్న ద్వారం దగ్గర విందుకు గుర్తుగా స్లెడ్జ్ బళ్ల దారులు...

❖❖❖❖❖

---

**అలెక్సి కొల్త్సోవ్ (Aleksey Koltsov 1809-1842) -** చిన్న వృత్తిపనివాళ్ల కుటుంబంలో జన్మించినాడు. ప్రాథమిక విద్య పూర్తికాకమునుపే కఠినుడైన తండ్రి అతడిని వృత్తి పనిలోకి దింపినాడు. పదహారవ ఏట నుంచి కవిత్వం వ్రాస్తూ స్టాన్కెవిచ్, బెలిన్స్కీల ప్రోత్సాహంతో పరిణితి చెందినాడు. రష్యాలోని పేద ప్రజల గురించి, రైతుల గురించి కవిత్వం వ్రాసిన మొదటి కవి అయిన కోల్త్సోవ్, క్షయవ్యాధితో తన ముప్పై మూడవ ఏట కన్ను మూసినాడు.

# 25. తెరచాప

**- మైఖేల్ లెర్మన్‌టోవ్ (1832)**

దూరంగా ఒంటరి తెరచాప మెరిసింది ఒక్కక్షణం.
ముదురు నీలిరంగు సముద్రం మురిసింది ఆ దినం.
నా నావ ఎందుకు వదిలింది తన మాతృదేశం?
పరాయి దేశాలలో చేస్తున్నదే విధమైన శోధనం!

అలలు ఉప్పొంగి, తెరచాప స్తంభం ఒరిగి విరుగుతుందా.
అసహనపు గాలుల అరుపులకు నావ తల్లకిందులౌతుందా?
సంపదల కోసం కాదు ఈ ఒంటరి ప్రయాణం!
అల్లకల్లోలపు కడలిలో దొరకదు ఏ ఆనందం!

నీలి అలలు ఎగసి పైకెగసి వణుకుతున్నాయి ఆగ్రహంతో,
సూర్యుని కాంతి కిరణాలు జలధిని ముద్దాడుతున్నాయి.
తిరుగుబాటు దారుడు పిలుస్తున్నాడు తుఫానును రమ్మని,
శాంతి, ప్రశాంతతలేవో ఉధృత తరంగాలలో ఉన్నాయని!

*****

---

**మైఖేల్ లెర్మన్‌టోవ్ (Mikhail Lermontov 1814-1841) -** మాస్కోలో ఉన్నత కుటుంబంలో జన్మించిన లెర్మన్‌టోవ్ తన పూర్వీకుల ఎస్టేట్‌లో నివసించినాడు. మాస్కో విశ్వవిద్యాలయంలో అధ్యాపకుడితో తగాదాపడి, అక్కడ నుంచి సెయింట్ పీటర్‌బర్గ్ సైనిక స్కూలులో చదువు పూర్తిచేసి ఇంపీరియల్ గార్డ్, హుస్సార్ దళంలో నియమించబడినాడు. 1837లో పుష్కిన్ మరణం గురించి వ్రాసిన కవిత, మొదటి నికొలస్ రాజు పరిపాలనను ప్రశ్నించడంతో కకాసస్‌కు ప్రవాసానికి పంపబడినాడు. వచ్చిన తరువాత అతడు వ్రాసిన కవిత్వం మరింత పదునెక్కగా మరల రెండోసారి కకాసస్‌కు పంపబడినాడు. రహస్య పోలీస్ దళపు కుట్రతో అతడు మేజర్ మార్టినోవ్‌తో జరిగిన ద్వంద్వయుద్ధంలో (Duel) 15

# 26. మత్స్యకన్య (మెర్‌మెయిడ్)

**- మైఖేల్ లెర్మన్‌టోవ్ (1832-36)**

శీతాంశుని కిరణాలు సెలయేరును తాకినపుడు
మెర్‌మెయిడ్ ఈదుతూ మెరుపులా మెరిసింది.
తరంగాల నురగతో తాకేందుకు చంద్రుడిని,
ఏటి నీటి నొక్కదెబ్బ చరిచిందా మత్స్యకన్య.

తుళ్లిపడ్డ ఏరపుడు తుళ్లింతగ నాట్యమాడె
అలజడిగా మబ్బులన్ని సుడి తిరిగి గుమికూడె
మత్స్యకన్య గానానికి మైమరచి కొండాకోన,
నీలికడలి, గాలితో నినదించెను ప్రతిధ్వనిగా!

-'ఎవరికీ కనబడని ఏకాంత ప్రదేశాన
అద్భుత వర్ణాలతో అలరారే కాంతులున్న
స్ఫటికపు నగరంలో, సాటిలేని వెలుగులో
స్వర్ణ మీనతతి సంచరించే చోటున

➠

---

జులై 1841లో తన ఇరవై ఏడవ ఏట కన్ను మూసినాడు. అతడి కవితలు The Demons, MTSYRI, The Bay of the Merchant of Kalashnikov అనేక గీతాలు, A Hero of our time అనే నవల, Masquerade అనే నాటకం ఇవన్నీ రష్యన్ సాహిత్యంలో మణిపూసలే. (Master Pieces). డిసెంబరిస్టుల అభిప్రాయాలు, మనిషి స్వేచ్ఛపై అతడికున్న నమ్మకం, అతడిని పుష్కిన్‌కు నిజమైన వారసుడిగా (మరణంలో కూడా), తదుపరి వచ్చిన రష్యన్ సాహిత్యానికి మార్గదర్శకుడిగా నిలబెట్టింది.

ఇసుక మెత్తలపై ఏటి కౌగిలిలో
సంద్రపు మొక్కల చక్కటి నీడలో
శయనించెనొక ప్రభువు చన్నీట మునిగి
నిదురించె నారాజు పరదేశ ప్రభువు.

అక్కా చెల్లెళ్లం మేము ఆటపాటలతో
అలిసిపోయాక అటువేపు వెడతాము.
అతడి శిరోజాలను పసిడి దువ్వెన దువ్వి
అధరాల, కనుబొమల ముద్దాడి మురిసెదము.

ఎందుకో ఏమో నే చెప్పలేను
మాతో అతడు మాట్లాడలేదెపుడు
గాఢ నిద్రలోన గడ్డకట్టినట్లు
ఒక్క పలుకూ లేదు, కాలు కదలారాదు"

దుఃఖమూ, కన్నీళ్లు వరదలా ఉప్పొంగ
మత్స్యకన్య పాట వణికించె దిక్కులను
తుళ్లిపడి ఏరపుడు తుళ్లింతగ నాట్యమాడె
అలజడిగ మబ్బులన్ని సుడితిరిగి గుమికూడె!

✣✣✣✣✣

# 27. కోరిక

**- మైఖేల్ లెర్మన్‌టోవ్ (1831)**

నింగినెగిరే పక్షినైతే నాకెంత బాగుండును!
లఘుపతనకమై లాఘవంగా పోయుందును.
నేలపైన, నింగిపైన నేనెందుకు ఎగిరిపోను?
స్వేచ్ఛగా ఎగుర్తున్న కాకినైనా బాగుండును.

దూరంగా పశ్చిమానికి దూకుడుగా వెళ్లిపోయి,
నా పూర్వీకుల నేలపై వాలి నిదురపోదును.
మంచుతో కప్పబడిన రాతికోటలున్నచోట
మా తాతల ఎముకలున్న స్మశానము దర్శింతును.

తుప్పుపట్టిన కత్తి డాలు గోడమీద వేలాడుతూ
నల్లబడి మసకబారి దుమ్ముకొట్టుకుని ఉండును.
పక్షినైతే నా రెక్కల ఆ ధూళిని తుడిచివేసి
ఆ ఆయుధపాణుల అనేకసార్లు స్మరింతును.

అదుగో ఓ పెద్ద వీణ ఆవరణలో పడి ఉన్నది,
గోడ పక్క తల వాల్చి చడీచప్పుడు లేకున్నది.
పక్షినైతే నా రెక్కల మృదువుగా స్పృశింతును
నిద్రలేచి ఆ వీణ నిర్నిద్రగాన మొనరించును.

పో! పో! పనికిమాలిన కలలూ, వృధా వేదనలూ!
నా మాతృభూమి నుండి నన్ను వేరుచేసినారు.
తుఫాను సముద్రాలెన్నో నాకూ, నా జన్మభూమికి మధ్య
జాలిలేని విధి ముందు ఈ ఆలోచనలొక మిధ్య.

నా వాళ్లకు దూరంగా పుట్టానీ గడ్డమంచు నేలను.
ఈ నేలగుండెకు ఎపుడూ పరాయివాడినే నేను.
మహావీరుల కుటుంబంలో జన్మించిన నేను,
స్వేచ్ఛగా నింగినెగిరే కాకినైనా బాగుండును!

✤✤✤✤✤

# 28. యంటిసైరి (MTSYRI)

**- మైఖేల్ లెర్మన్‌టోవ్ (1839)**

పిచ్చెక్కించే నిరాశతో నేనొక్కోసారి పెరికివేస్తాను.
తీగలు అల్లుకున్న మొక్కలను, ముళ్లపొదలను సమూలంగా!
నా చుట్టూ దట్టంగా అలుముకున్న అరణ్యం
ప్రతి అడుగుకూ మరింత చిక్కనై భయం గొలుపుతున్నది.

ఏదో తెలియని అనంత భీతితో నా ఆత్మ నిండిపోగా
రాత్రి నేత్రాలతో లక్షలాది ఆకలి కళ్లు
అన్నివేపులా ఆగ్రహంగా నన్నే చూస్తున్నవి.
భయపడి నేను ఎత్తైన చెట్టెక్కి చుట్టూరా చూసాను.
అడవి ఒక రాక్షసిలా, క్రూర దంతాల నీడలతో విస్తరించి ఉన్నది.

నేలకూలి గడ్డిపై పడ్డ నేను నేలతల్లి తడి రొమ్ములను
కొరుకుతూ, లాగుతూ,
నా కన్నీళ్ల మంచుబిందువులతో కాల్చివేసాను.
అయినా మానవుడి సాయమర్థించలేదు. ఎలుగెత్తి అరవలేదు.
నా నోటి నుంచి ఒక్క కేక, ఓ బక్కకేక వినబడినా
ఈ నాలుకను పెరికి పారవేసి ఉండేవాడిని!

నీకు గుర్తే ఉండి ఉంటుంది-
ఏనాడూ నేను ఏడ్వలేదు నా చిన్నప్పుడు కూడా!
కాని ఇప్పుడు కన్నీళ్లు ధారగా వర్షిస్తున్నాయి.
వాటిని అడివి చూసింది. చంద్రుడు గమనించాడు.
చెట్లమధ్య ఇసుకపై పెరిగిన నాచు వాటిని భరించింది.

నిశీధి అరణ్యపు గోడల మధ్యలో
చటుక్కున రెండు కళ్లు మెరవడం నేను చూసాను.
మరుక్షణం, ఓ భయంకర చిరుతపులి
అరణ్య సంచారి, పొదలమీంచి ఇసుకపైకి దూకింది.

అడివిలోంచి వచ్చిన ఆ క్రూరమృగం
నోట్లో మాంసఖండాన్ని ఇంకా నములుతూనే ఉన్నది.
అటుయిటూ ఊగుతూ, ఆటాడుతున్నట్లు కదులుతూ,
మధ్యమధ్య మంద్రంగా గర్జిస్తూ, గాండ్రిస్తూ, గురగురమంటూ,
పొడుగాటి తోకను కదిలిస్తున్నది లాఘవంగా!
అర్ధచంద్రుడి కాంతి దాని చర్మానికి వెండిరంగు నివ్వగా
అది మృత్యుదూతలా నావేపు మిర్రిమిర్రి చూస్తున్నది.

భయం తగ్గుముఖం పట్టగానే నాలో ధైర్యం ఉప్పొంగింది.
చటుక్కున ఎండు కొమ్మనొకటి విరిచి సిద్ధంగా ఉన్నా యుద్ధానికి.
ఎప్పుడు మొదలౌతుందో తెలీని పోట్లాటలో
ఎదురు చూడడమే ఒక పెద్ద పరీక్ష!
ఇప్పుడు నా వారసత్వ వీరత్వానికి పెను సవాల్!

దాన్ని నేను, అది నన్ను గమనిస్తున్నాం పరీక్షగా!
హెచ్చరికగా అది పెట్టిందో దీర్ఘ నిశ్వాసపు కేక.
ఆగ్రహం, అసహనం కలబోసిన చిరాకుతో
ఇసుకను తొక్కిపెట్టి ఎగిరింది నావేపు.

అదనుకోసం ఎదురు చూస్తున్న నేను తప్పించుకున్నా దాని దెబ్బను.
నా చేతిలోని ముళ్లకర్ర దాని నుదుటిపై పడింది పిడుగులా!
రక్తం కళ్లపై కారగా చిరుతపులి, మనిషిలా మూల్గి కూలింది నేలపై.
అయినా మళ్లీ లేచి మృత్యుభీకర స్వరంతో కలబడింది నాతో!

దాని పదునైన గోళ్లు చీల్చిబోయాయి నా రొమ్మును.
అంతకుముందే నా చేతిలోని ముళ్లకర్రతో రెండుసార్లు
దాని గొంతులోకి పొడిచాను నాకున్న యావత్ బలంతో!
అది పెట్టిన చావుకేకకు అడివంతా దద్దరిల్లింది.

ఇద్దరు స్నేహితులు ఎదురెదురుగా నిలబడి కౌగిలించుకున్నట్లు
రెండు మహాసర్పాలు ఒకదానినొకటి పెనవేసుకున్నట్లు
బంతిలా చుట్టచుట్టుకుని పొర్లామా నేలపై
మంచుతో తడిచిన ఇసుకపై మొలిచిన పచ్చని నాచుపై.

నేనూ మృగాన్నే కాదా! నన్నెవరు మచ్చిక చేసారు?
అది అరిస్తే నేనూ అరిచాను, కరిస్తే కరిచాను.
చిరుతపులుల, తోడేళ్ల మధ్య పెరిగినవాడిలా
మానవభాష మరచిన అడవి శిశువులా
గాయపడిన మృగం గర్జించిన తీరుగా
నేను పెట్టిన కేకకు ఆ చిరుతపులే వణికింది.

నా బలం క్షణక్షణం అధికం కాగా, నా పట్టు బిగుస్తుండగా,
రక్తం కోల్పోతూ నా శత్రువు అలిసినట్లు కనిపించింది.
ఊపిరి నెమ్మదించి, భారం కాగా,
ఆఖరి ప్రయత్నంగా తన పట్టు నధికం చేసినప్పుడు
దాని బంగారు కళ్లలో మెరిసిందో మెరుపు
ఆరిపోయే ముందు వెలిగే దీపపు సొబగు.

ఆ చిరుతపులి కౌగిలిని విడదీసాను నెమ్మదిగా-
వీరోచితంగా పోరాడిన దాన్ని చూసి అనుకున్నాను-
-'మృత్యువు ఈరోజు నా కౌగిలిలో చిక్కుకుంది.
కాని, శత్రు సైనికుడిలా బాహాబాహి పోరాడింది'-

✤✤✤✤✤

# 29. కల

**- మైఖేల్ లెర్మన్‌టోవ్ (1841)**

దాఘెస్తాన్‌లో మండుతున్న సూర్యుడికి ఏ మబ్బూ అడ్డులేదు.
నా పక్కలో చొచ్చుకుపోయిన బుల్లెట్ ఎక్కడున్నదో తెలీదు.
చడీచప్పుడు లేకుండా నేనుంటే, గాయం నుండి పొగ, నెత్తురు.
చుక్కలు చుక్కలుగా నా ప్రాణరుధిరం నేలను తడుపుతున్నది.

ఇసుక మీద అలా  వెల్లకిలా పడి నేను! దట్టంగా, చుట్టూరా
చలనం లేని కొండలు నిస్తబ్దంగా నిలబడి ఉన్నాయి.
వాటి శిఖరాలను సూర్యుడు స్పృశించగా, కిరణాలు నన్ను తాకుతున్నాయి.
అవి నన్ను కాలుస్తున్నా, నేను గాఢ నిద్రలోకి ఒరిగాను.

కలలో నా మాతృభూమి, నా ఇల్లూ, నావాళ్లు
వేడుకగా జరుపుకుంటున్న విందు, సందడే సందడి.
పూలు ముడుచుకుని కొత్త పెళ్లికూతుళ్లు, కన్యలు, యువతులు
యువకులూ, బ్రహ్మచారులూ, అంతా మాట్లాడుకుంటున్నారు, నా గురించే!

దూరంగా, దుఃఖిస్తూ, ఈ ప్రపంచంతో సంబంధం లేనట్లు ఆమె.
ఏ ఆలోచనలామెను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయో, ఏ
దుఃఖ స్వప్నాలు ఆమె మనసును కలత చెందించగా
ఆమె ఆత్మ ఆమెను వీడి ఎటుపోయిందో దేవునికే ఎరుక!

దాఘెస్తాన్‌లోని ప్రకాశవంతమైన లోయను ఆమె కలగన్నది.
అక్కడ ఆమెకు అత్యంత ప్రియమైనవాడు నేలపై పడి ఉన్నాడు.
నల్లని గాయం నుంచి అతడి రక్తం బొట్లుబొట్లుగా స్రవిస్తూ
ఒక్కసారి వరదలా దూకి, ఆగి, చుట్టూ కొండల్లా, చల్లబడింది.

*****

# 30. తోకచుక్క

**- అపొలాన్ గ్రిగొరియెవ్ (1843)**

అంతరిక్షంలో నక్షత్రాలు, గ్రహాలు వేలాదిగా గుమికూడి
సామరస్యంతో, సఖ్యంతో భ్రమణ సంగీత కర్తలై
తమతమ నిర్దేశిత పథాల్లో నిరంతరాయంగా పరిభ్రమిస్తూ
ప్రశాంతంగా కాంతుల్ని ప్రసరిస్తున్నపుడు, దూసుకొచ్చిందో తోకచుక్క!

అంతా గందరగోళం, అస్తవ్యస్తం, సృష్టి అతలాకుతలమైనట్లు
మూలక శక్తులు మూర్ఛిల్లగా, ఆరని జ్వాలల్తో తారల నదిలిస్తూ
జ్వాలా వలయిత వాలంతో విధ్వంసాన్ని విస్తృత పరుస్తుంది.
-'గ్రహ సంగీతం చెదిరి, తారాదీపాలు మలిగినట్లు ఆ తోకచుక్క!

అదేం లేదు. సరాసరి సృష్టి గర్భంలోంచి విసిరివేయబడిన
వింత కాంతిపిండం ఆకాశపు పొరల్ని చీల్చుకుంటూ
పోరాడుతూ, పోరాటం ద్వారానే పరిశుద్ధం కావాలనుకుని
పరీక్షలు, ఘర్షణలతో, తనను తాను నిర్వచించుకుంటున్నదా తోకచుక్క!

దేవుడు తనను తారగా చేయబోతే తాను ఉల్కగా మారిందా?
సెరాఫిమ్ దేవదూత విసిరేస్తే తానింత అగ్నిధూళిగా విస్తరించిందా?
సముద్రం నుంచి నౌకను తోసుకొచ్చిన పెను తరంగంలా,
మహావృక్షం నుంచి రాలిపడ్తున్న స్వర్ణపత్రంలా మెరిసిందా తోకచుక్క!

*****

---

**అపొలాన్ గ్రిగొరియెవ్ (Apollon Grigoryev 1822-1864) -** ప్రభుత్వోద్యోగి కుమారుడు. మాస్కో విశ్వవిద్యాలయంలో కవులైన ఫెట్, పొలొన్స్కి, చరిత్రకారుడు సొలొవియేవ్‌లకు మిత్రుడు. కవిగా, విమర్శకుడిగా, జర్నలిస్టుగా ప్రసిద్ధికెక్కినాడు. లెర్మన్‌టోవ్‌చే ప్రభావితుడై తనను తాను ఆఖరి 'భావవాదకవి' (Romantic Poet) గా ప్రకటించుకున్నాడు. ప్రపంచంలోని గందరగోళాన్ని, అస్థిరతను, ఒంటరితనాన్ని, నిరాశను ముఖ్య వస్తువులుగా తీసుకుని అనేక కవితలను వ్రాసి ప్రసిద్ధికెక్కినాడు.

# 31. గ్రామ సుంకరి

**- నికొలయి ఒగరేవ్ (1840)**

ఆకాశంలో మబ్బులతో చీకటి మరింత చిక్కబడింది.
ఎక్కడ చూసినా తెల్లటి మంచుదుప్పటి
ఎముకలు గడ్డకట్టించే శీతలరాత్రి పవనాలు
నేలమీద పారాడుతూ చెట్లను వణికిస్తున్నాయి.

ఒక వరుసలో పేర్చబడిన పెట్టెల్లా రైతుల ఇళ్లు
ప్రధాన వీధిని పహారా కాస్తున్నవి
వాటికి ఆసరాగా, అడుగో, గ్రామరక్షకుడు
ఒంటరిగా, అతడికి, ఆ చేతికర్ర సైదోడు.

గజగజ వణుకుతున్నాడన్న కనికరం లేక
మంచు గాలులతడిని ఈడ్చికొడ్తున్నాయి.
అతడి మీసాలపై పేరుకున్న మంచుతుంపర
వాటిని వెండి తీగెలుగా మార్చింది.

ఆనందం లేని జీవితం నీరసంగా నడుస్తుంది.
ఒంటరి పోరాటం మరింత దీనమైనది.
అతడు పాడుతున్న పాట సుడిగాలికి చెదరి
పెను మూలుగులా చలిలో పెనుగులాడుతున్నది.

వెన్నెల లేని రాత్రుళ్లలో అతడు
తెల్లవారేదాకా తిరుగుతూనే ఉంటాడు.
ఏదో రహస్య దుఃఖం అతడి వదనపు
గడియారపు ముళ్లను కదిలిస్తూ నడుస్తుంది.

అతడి చేతికర్ర శబ్దాలు చెలరేగినప్పుడు
శబ్దాలను మించిన ఆర్తనాదం వినిపిస్తుంది.
అతడి దుఃఖపు హృదయం వేగంగా ధ్వనిస్తూ
వేదనలను, బాధలను మరింత తీవ్రం చేస్తున్నది.

✣✣✣✣✣

---

**నికొలాయ్ ఒగరేవ్ (Nikolai Ogarev 1813-1877) -** భూస్వామి కుమారుడు. తన చిన్ననాటి స్నేహితుడు హెర్జెన్‌తో కలిసి డిసెంబరిస్టుల అడుగుజాడల్లో నడిచాడు. మాస్కో యూనివర్సిటీలో విప్లవ గీతాలు పాడినందుకు అరెస్టు చేయబడినారు. 1839లో ప్రవాసం పూర్తయ్యాక, 1856లో హెర్జెన్‌తో కలిసి ఇంగ్లండ్, జెనీవా వలసపోయి Koloko (The Bell), Pole Star పత్రికలు నడిపారు. 1861-62లో భూపోరాటాలు, స్వేచ్ఛాపోరాటలకు నాయకత్వం వహించాడు. రష్యా విముక్తి పోరాటంలో నాయకుడిగా, రచయితగా, రాజకీయ జర్నలిస్టుగా, కవిగా, వేదాంతిగా నికొలాయి ఒగరేవ్ పేరు చిరస్థాయిగా నిలిచిపోయినది.

# 32. దర్శనం

- ఫ్యోదోర్ త్యుత్‌ఛెవ్ (1820-30)

అద్భుతాలు జరిగే అర్ధరాత్రి సమయంలో
అంతటా పేరుకున్న నిశ్శబ్దం అంతరిక్షానికి పాకినప్పుడు
అరుపులు, ఉరుములు లేకుండా జీవనరథం
ఆకాశపు ఆశ్రమంలో అదృశ్యమైనదా క్షణాన!

అనంతపు గందరగోళంలో నేల, నీరు, నింగీ కలిసి
అట్లాస్ మహాకాయుడి అడుగుల భారంతో
అందరికళ్లపై నిద్ర వాలినప్పుడు, భవిష్యత్ దర్శనాల
అధిపతి దేవుళ్లు లలితకళా కన్య ఆత్మను జ్వలించగా
అంతటా ఆమె నడకలే! తక్కినదంతా నిర్జీవమే!

................ ................ ................

సముద్రపు కౌగిలిలోని చక్కని భూగోళంలా,
ఈ భూమిమీద బతుకంతా కలలు, ఊహల మయమే!
అడక్కుండా రాత్రి వచ్చినట్లు, అలలు ఒకదాని వెనుక ఒకటి
తీరపు గోడలపై తీరికలేకుండా విరుచుకుపడ్తాయి.

పెద్దగా అరుస్తూ మనల్ని రమ్మని పిలుస్తాయి.
రేవులో మాయ పడవొకటి సిద్ధంగా ఉంటుంది
సరైన సమయంలో మనల్ని తీసుకుపోతుంది.
సముద్రాల అనంతానంత సామ్రాజ్యంలోకి.

ఆకాశపు లోతుల్లోంచి అనేక తారాదీపాలు
వింతగా, వివిధాలుగా విస్తరించి కనిపిస్తాయి.
అంతు దొరకని సముద్రంలో అలా మనం పోతుంటే
లోతు తెలియని అగ్నిబిలం నోరు తెరచి చూస్తుంది.

✣✣✣✣✣

---

**ఫ్యోదోర్ త్యుత్‌ఛెవ్ (Fyodor Tyutchev 1803-1873) -** ప్రాచీన ఉన్నత కుటుంబంలో జన్మించి, మాస్కో విశ్వవిద్యాలయంలో అద్భుతంగా రాణించిన త్యుత్‌ఛెవ్ రాయబారిగా, మ్యూనిచ్‌లో పనిచేసాడు. 22 ఏళ్లు విదేశాల్లో ఉన్నా మాతృభూమిపై మమకారంతో మెలిగినాడు. 1836లో అతడు వ్రాసిన కవితల్ని పుష్కిన్ చదివి మెచ్చుకుని తన జర్నల్ Sovremennik లో ప్రచురించినాడు. ప్రకృతిగీతాలు, పాటలు విస్తృతంగా వ్రాసి రష్యన్ కవిత్వంలో Baratynsky మార్గాన నడిచిన త్యుత్‌ఛెవ్, పుష్కిన్, టాల్‌స్టాయ్‌లకు ఇష్టమైన కవిగా పేరు తెచ్చుకున్నాడు.

# 33. దుఃఖించే కలం

**- ఫ్యోదోర్ త్యుత్‌ఛెవ్ (1820-30)**

సముద్ర స్వరమెంతో సరాగమై ఉన్నది.
అలల గుసగుసలన్నీ సరిగమలుగ మారినవి.
వేణువు కాంతిలో ఏవో ప్రకంపనలు,
సంగీత యుక్తమై సాగిపోతున్నవి.

ప్రకృతిలో ప్రతిదీ సమతుల్యతల తూగు!
దాటరాని ఒప్పందం శిరోధార్యమందరికీ!
మన మనుకునే మాయాస్వేచ్ఛ,
అదొక్కటే కాస్త అదుపులో ఉండదు.

ఈ పగులు ఎప్పటిది? ఈ రంధ్రమెక్కడిది?
సముద్రపు పాటతో స్వరము కలపాలంటే
ఆత్మ ఎందుకు నన్ను అడ్డుకుంటున్నది?
ఆలోచనా కలమెందుకు అలా దుఃఖిస్తున్నది?

............... ............... ...............

ఏర్లనిండా పారిన వేడిరక్తం, తుఫాను జీవితపు ఆనవాళ్లు
ఆ జ్ఞాపకాలను గుర్తుచేస్తాయా, మైదానంలోని మృతుల దిబ్బలు.
ఎత్తైన దేవదారు వృక్షాలు, అవే ఆ కాలానికి సాక్షులు,
వాటి వేళ్లు ఏ కంకాళాలను తాకుతున్నాయో చెబుతాయి గాలులకు.

గత ప్రకృతి, గడచిన ఏళ్లు, అంతా మాయా వికృతి
ప్రకృతి శిశువులం మనం, ఆమె కలల్లో ఓ చిన్న స్మృతి.
జీవితపు వంపుదారుల్లో, సమయాన్ని వృధా చేసే మనకు
ఆమె శాంతి దూత తన అగాధాశ్రమంలో ఆశ్రయమిస్తుంది.

✤✤✤✤✤

# 34. మూడు గుర్రాల బండి

**- నికొలాయి నెక్రసోవ్ (1846)**

నీ మిత్రులంతా నిన్ను చూసి పగలబడి నవ్వుతుంటే,
నీవెందుకు రహదారి వేపు తన్మయంగా చూస్తున్నావు?
నీ హృదయాన్ని కాల్చివేస్తున్న నిరవధిక భీతికి,
నీ నుదురు, కపోలాలు ఎర్రగా కందిపోయినాయే!

ముడు గుర్రాల రథం వెనుక పరిగెత్తాలనే ప్రయత్నమేమిటి?
అంత వేగంగా పరిగెత్తే ఆ రథం వేపే నీకెందుకా చూపు?
నడుముపై చేతులుంచుకుని, కార్నెట్ వాద్యకారుడు చూస్తున్నాడు.
అతడి కళ్లు నీవేపే స్థిరంగా నిలిచిపోయాయి.

ఏ మగవాడినీ నిన్నలా చూస్తున్నందుకు తప్పు పట్టలేము.
తొలిచూపులోనే ప్రేమలో పడినందుకు మందలించలేము.
కటిక చీకటిలా నల్లనైన నీ కేశ సమూహాలపై
ఎర్రటి రిబ్బను ఎగుర్తూ మోహనంగా కనిపిస్తున్నది.

నీ తెల్లని కపోలాలపై మెరుపు కాంతి
కాసింత మసకదనాన్ని సైతం ప్రతిఫలిస్తుంది.
అందమైన కనుబొమల కింద అమరిన నేత్రాలు
కొంటెతనపు చూపుల్ని కొసరి విసురుతున్నాయి.

ఆ వాలుచూపుల చిన్నదాని నేత్రాల మూలలందు
రక్తాన్ని జ్వలింపచేసే రహస్యమేదో దాగున్నది.
వృద్ధులు బహుమతులిస్తూ మతులు కోల్పోతే
కుర్రకారు గతులు తప్పి కొత్త కథలు అల్లుతారు.

కొన్నాళ్లు నీవు కులాసాగా బతకవచ్చు!
అవకాశమున్నపుడే అనుభవించు అన్నిటినీ.
కాని నీ గమ్యం ఆ రథం వేపు కారాదు.
నీవు పెళ్లాడబోయేది ఒక మందమతి మానవుడిని!

వంటిపై ఓ మొద్దు చొక్కా తొడుక్కుని
ఎండా, వాననకుండా ఎంతో శ్రమపడ్తావు.
మొరటోడు నీ మొగుడు రోజూ చితకగొడ్తాడు!
నీ అత్త నిన్ను రాచిరంపాన పెడ్తుంది.

కాయాకష్టం చేసీ, చేసీ సుకుమారివి,
వికసించని పూవులా వడలిపోతావు
ఇంటా, బయటా చేసే గొడ్డు చాకిరీకి
రాత్రి నిద్రలో పీడ కలలొచ్చి లేచి కూర్చుంటావు.

అందమైన, ఆకర్షణీయమైన ముఖంలో
అతిత్వరగా వస్తాయి అనేక మార్పులు.
ఓర్పుతో, ఓదార్పుతో కళదప్పిన మొహం,
అంతూ పొంతూ లేని, భయంతో అల్లల్లాడ్తుంది.

రహదారి చివరకు చేరుకున్నాక నిన్ను
శీతల సమాధిలో పాతిపెడ్తారు.
నీ యవ్వనపు శక్తి అంతా వృధా కాగా
ప్రేమ నెరుగని హృదయం కాంతిహీనమౌతుంది.

అందుకే చూడకు ఆ రహదారివేపు తదేకంగా,
ఆ రథం వెళ్లేదారి వేపు అదోరకపు తన్మయంగా!
దాని వెనక పరిగెత్తకు! నీ హృదయంలో
చెలరేగే ఆశలను మొగ్గలోనే త్రుంచివేయి!

అతివేగంగా పరిగెత్తే అశ్వాలను అందుకోలేవు;
ఆలోచనలను నీనుంచి అంతం చేసేయి!

లేదులేదు! మూడు గుర్రాల బండిలో నాకే చోటుంది!
ముగ్ధుడై యువరాజు నన్ను ముద్దాడే వీలుంది!

✤✤✤✤✤

(Troika = మూడు గుర్రాల బండి)

---

**నికొలాయి నెక్రసోవ్ (Nikolai Nekrasov 1821-1878) -** వోల్గా నదీ ప్రాంతంలోని నియంతృత్వ పోకడలున్న మిలిటరీ అధికారి కుమారుడు. కుటుంబ సభ్యులను, రైతులను, తండ్రి పెట్టే బాధలను వ్యతిరేకించినాడు. తండ్రి చెప్పినట్లు సైన్యంలో చేరక సెయింట్ పీటర్స్‌బర్గ్‌లోని ఫాకల్టీ ఆఫ్ హిస్టరీ అండ్ ఫైలాలజీలో చదువుతున్నందుకు తండ్రి ఆర్థికసాయం ఆపేసాడు. దుర్భర పరిస్థితుల్లో చదువుకుంటూ, చిన్నిచిన్ని పనులు చేస్తూ, బెలిన్‌స్కీ ప్రోత్సాహంతో తనలోని కవిని గుర్తించినాడు. Sovre Mennik ఎడిటర్‌గా బెలిన్‌స్కీ, హెర్జెన్, దొస్తొవొస్కీ, గ్రిగరొమిచ్, టాల్‌స్టాయ్‌ల రచనలు ప్రచురించడమే గాక, అనేక పోరాటాలకు వేదికగా ఆ పత్రికను నడిపాడు. జార్ ప్రభువు ఆ పత్రికను నిషేధించినాడు. చనిపోయేంత వరకు రష్యన్ ప్రజల జీవితాలను ప్రతిబింబించే **(1850-1880 కాలపు)** కవిత్వాన్ని వ్రాసినాడు. కథకుడు, వ్యంగ్య రచయిత, చరిత్రకారుడు, విమర్శకుడు, అలుపెరుగని పోరాటయోధుడుగా ప్రసిద్ధికెక్కినాడు.

# 35. రష్యన్ స్త్రీలు

**- నికొలాయి నెక్రసోవ్ (1862)**

ఇది పంటలు కోతకు వచ్చేకాలం
రష్యన్ స్త్రీలు ఇప్పుడు పడేంత కష్టం ఎవ్వరూ పడరు.

అందుకే అమ్మా! నీవు త్వరగా వృద్ధురాలివైపోతావు.
రష్యన్ తెగ కష్టపడే తీరుకు ఉదాహరణగా మిగుల్తావు.

చెట్టూ, నీడ లేని మండుటెండల్లో మాడిపోతూ,
మొక్కజొన్నలు పేలాలయ్యే ఎండలో కమిలిపోతావు.

అలసిసొలసి వగరుస్తున్నపుడే నిన్ను
ఈగల దండు చుట్టూ మూగి కుట్టి కుట్టి వదుల్తాయి.

అనుకోకుండా కొడవలి తగిలి కాలికి గాయమైనా
కారే నెత్తురును పట్టించుకునే ధ్యాస ఉండదు నీకు.

పని సగంలో ఉన్నపుడే గట్టుమీద
తొట్టి లోని పసిపాప కెవ్వున ఏడుస్తుంది.
జో పాపా! నిదురపో! జోజో!

అమ్మా! ఎందుకలా మగతగా నిలుచుండిపోయావు?
శాశ్వతమైన సహనంతో జోలపాడి నిదురబుచ్చు!

నీ కనుబొమలపైన చెమటవాన
కురిసి తడిపె నయనాలను, జాలువారె పెదాలపై,

దాహార్తితో తాగుతున్న క్వాస్ రసం పులుపుతో
చెమటి నీటి ఉప్పు కలిసి చెబుతుందే రహస్యమో!

*****

# 36. ఆకుపచ్చని అలలు

- నికొలాయి నెక్రసోవ్ (1862)

వసంతకాలపు ఆకుపచ్చని అలల సంగీతం
చెట్ల నుంచి దూసుకువచ్చిన గాలి పొదల్లో చేసే నృత్యం
పూల పుప్పొడి మేఘాలను నింగికి పంపే ఉత్సాహం
రంగురంగుల పొరలతో నేలకు వస్త్రాభిషేకం.

నా ప్రియమైన భార్య నటాలియా పాత్రికెయెవ్నా,
అమాయకత్వం మూర్తీభవించిన అరుదైన స్త్రీ అయినా
తాను తప్పు చేసానని నాతో తడబడుతూ చెప్పింది.
శీతాకాలం మంచుకు మేమిద్దరం ఇంట్లో బందీలం!

చలిగాలులు నన్ను స్పృశిస్తూ తీవ్రంగా అంటున్నాయి-
'చంపేయి, ఆ విశ్వాసం లేనిదాన్ని. దయ చూపించకు!
నీ పొరుగువాళ్లు, చుట్టాలు, నీ ముఖంమీద ఉమ్మేస్తారు!-
కత్తిని బలంగా పట్టుకున్నది నా కరకు హస్తం.

ఇంతలో వసంతం ఇటు రానే వచ్చింది.
ఛెర్రీ చెట్ల సొబగులు, సూర్యకాంతి వెలుగులు
పైన్, లిండెన్, బిర్చ్, మేపుల్ చెట్ల గుసగుసలు
పచ్చగడ్డి రెల్లుపొదలు పాటలతో పరవశించె ప్రకృతి.

నా చేతిలో కత్తి జారి నేలపై పడింది.
అడవులు, పొలాలు, మైదానాలు కొండలు ప్రతిధ్వనించాయి-
'క్షమతో కూడిన ప్రేమ, ఓర్పుతో కూడిన జీవనం
కరుణతో చేసే నిర్ణయం, మనిషి 'మనీషి'గా చేస్తాయి'

ఆకుపచ్చని అలలకు రుధిరమంటలేదు.
దైవన్యాయ విశ్వాసి ధర్మపథము దాటలేదు.

✣✣✣✣✣

# 37. రష్యా

**- ఇవాన్ నికితిన్ (1851-53)**

నీలి ఆకాశపు గుడారం కింద, ఆకుపచ్చని పచ్చిక తివాచి
మేఘ మాలికలను దాటి, నింగిని తాకే నిశ్చల పర్వత శ్రేణి.
మైదానాలను కోసుకుంటూ, నాలుగు దిక్కులకూ పారే నదీ నదాలు.
దక్షిణాన స్వర్ణ గోధుమ పొలాలు, నదులలో ఊగే రెల్లు పొదలు.

హరిత తివాచీ రంగస్థలంపై, ద్రాక్ష పందిర్ల మంటపాలు.
ఉత్తరాన బీడుభూముల్లో, సుడులు తిరిగే మంచు శకలాలు.
నీలిసముద్రం రొమ్ము పైన, కదుల్తున్న వెండికొండలు,
అరుణ కాంతులగ్నులు కాగా, తొలగి పోతున్న చీకటి జాడలు.

గ్రామాలపై చంద్రుడి నడకలో మెరుస్తున్న నీలి జలతారు యవనిక!
వెన్నెలలో మెరిసే చర్చిపై, వెలిగే కొవ్వొత్తిలా శిలువ వేదిక!
ఒంటరిగా నిలబడ్డ ఇళ్లపై, విరుచుకుపడ్తున్న మంచుగాలులు.
నిశ్శబ్దపు ఖాళీవీధుల్లో, వినబడవే పాదాల చప్పుళ్లు!

పగలంతా అలసి సొలసి, గాఢ నిద్రలో రైతుకూలీలు
ఒక్క గుడిసెలో మాత్రం, మినుకు మినుకు మనే దీపం
అనాథపిల్లలను తలుస్తూ, ఓ వృద్ధురాలి విలాపం
నేను చనిపోతే వీరికి దిక్కెవ్వరు? ఎవరు ఆదుకుంటారు?

చెడుదారుల్లో పడి నశిస్తారు. దేవుణ్ణి సైతం మర్చిపోతారు.
ఆ దీపపు వెలుగులో ఆమె, పిల్లల మొఖాలు చూసింది.
నిద్రపోతున్న వాళ్లను చూస్తూ కన్నీళ్లతో దేవుడికి మొక్కింది.
దూరాన ఎక్కడో తొలికోడి, దీర్ఘంగా కొక్కొరోకోమని కూసింది.

మూడు గుర్రాల రథంపై ఒక యువకుడు అటే బయల్దేరినాడు.
పరచుకున్న దుఃఖపు మంచు, దూరంలా కరిగిపోయింది.

✤✤✤✤✤

---

**ఇవాన్ నికితిన్ (Ivan Nikitin 1824-1861) -** కొవ్వొత్తులు తయారుచేసే చిన్ని కర్మాగారపు యజమాని కుమారుడైన నికితిన్ కొద్దిగా చదువుకుని, తండ్రి కొన్న సత్రంలో పనిచేసేవాడు. రైతుకూలీలు, తాగుబోతుల మాటలు, పాటలు, ఇవన్నీ అతడి మనసులో ముద్రవేయగా, 1853లో 'RUSS' అనే కవితతో పేరు తెచ్చుకున్నాడు. 1859లో పుస్తకాల షాపు నడిపినాడు. ముప్ఫై ఏడేళ్ల వయసులోనే క్షయవ్యాధితో మరణించాడు. నెక్రసోవ్ అనుయాయుడిగా గౌరవం పొందినాడు. అతడి కవితలనేకం జానపద గేయాలుగా ప్రజలచే పాడబడుతూ చిరస్థాయినందినాయి.

# 38. వేసవి వర్షం

- అపొలాన్ మికోవ్ (1841)

'వర్షం! కాదు కాదు, స్వర్ణ వర్షం ఆకాశం నుంచి'-
సంతోషంతో కేకలు పెడుతూ పిల్లలు గంతులేసారు.
ఇప్పుడు కాదు నాన్నా! తెచ్చుకుందాం స్వర్ణాన్ని
మన పొలాల్నుంచి కొద్దిరోజుల తర్వాత-
బంగరు గోధుమలు, స్వర్ణ'రై' ధాన్యపు రాశుల్ని.

కీకారణ్యాల్ని దాటి 'నేవా' నది ఒడ్డుకు వచ్చాడో అశ్వికుడు.
అక్కడో కుటీరం దగ్గర ఓ పాడైపోయిన పడవ.
ఆ పడవ దగ్గర దిగాలుగా ఓ వృద్ధుడు, గొణుగుతున్నాడు-
పాడు రోజులొచ్చాయి. మమ్మల్ని పట్టించుకునే వాళ్లెవరు?

ఇంట్లో ఆడవాళ్లకు నూలుకండెల్లా, ఈ పడవలు మా జీవితం.
వేటగాళ్లకు గుర్రాల్లా, ఈ కొయ్య పడవలు మా ప్రాణం.
వెధవ పరాయిదేశపు పుగాకు, మనుషుల్ని పడవల్ని తగలబెడ్తున్నది.
దూరం నుంచి వచ్చాను చేపల వేటకు, నా పడవ కాస్తా ధ్వంసం.
ఏ 'జార్' ప్రభువు పాలనో, ఈ కుక్క బతుకుల్నెవరు పట్టించుకుంటారు?

అశ్వికుడు గుర్రం దిగి గొడ్డలి, కత్తిని మెరుపులా వాడాడు.
కాసేపట్లో ఆ పడవ, కొత్తగా, ప్రయాణానికి సిద్ధమైంది.
పెద్దాయనా! పోయి చేపలు పట్టుకో హాయిగా!
పీటర్‌ను గుర్తు చేసుకో మంచిచేపలు పడితే!

వృద్ధుడు తలెత్తి చూసే సరికి అక్కడ అశ్వికుడు లేడు.
అరణ్యం నిశ్శబ్దంగా ఉంది. పడవ రమ్మని పిలుస్తోంది.

✣✣✣✣✣

---

**అపాలాన్ మైకొవ్ (Apollon Maykov 1821-1897) -** ప్రాచీన ఉన్నత కుటుంబంలో మాస్కోలో పుట్టినవాడు. తండ్రి చిత్రకారుడు. తల్లి రచయిత్రి. ఇంటి నిండా కళాకారుల సందడి. న్యాయశాస్త్రం, గ్రీకు, రోమన్‌ల చరిత్ర, సాహిత్యాలను చదివినాడు. గేయసాహిత్యం, ప్రకృతి వర్ణనలతో కూడిన కవితలు, చరిత్రలోని విషాదాంతాలు ప్రధాన వస్తువులుగా కవిత్వం వ్రాసినాడు. Three deaths and Two Worlds, Emoshan అనేవి ఇతర రచనలలో ప్రధానమైనవి.

# 39. తొలిప్రేమ

**- అలెక్సి కె. టాల్‌స్టాయ్ (1856)**

అందరూ ఆనందంగా నృత్యం చేస్తున్నపుడు, నేను నిన్ను చూసాను.
నీ కళ్లలో గూడుకట్టిన విచారం, నీ గొంతులో వేణుగానపు మాధుర్యం.
సన్నటి పూలతీగెలా నీ లావణ్యం, నీ చిరునవ్వు ముగ్ధమనోహరం.
ఒంటరిగా నేను శయనించి ఉన్నపుడు, నేను మళ్లీ నిన్ను చూసాను.
నీ కళ్లూ, నీ గొంతూ చెబుతున్నాయి కలలో, నేను నిన్ను ప్రేమించానని.

అవి వసంతకాలపు తొలి రోజులు. బిర్చ్ చెట్టునీడ గుర్తుందా!
నీ నవ్వుల ఇంద్రజాలం, నీ వాలుచూపుల వయ్యారం!
నన్ను ప్రేమిస్తున్నట్లు నీ కనురెప్పలు రెపరెపలాడినాయి.
ఆనందాశృవులు మనిద్దరి కళ్లనిండా బారులు తీరాయి.

కోయిల పాట, వసంతకాలపు పుష్పాల సయ్యాట
బద్ధకపు సంకెళ్లను తెంచి, దిగులు గోడలను విరగగొట్టాయి.
నూతన శక్తి పెల్లుబికి, భూమి స్వర్గాల బంధాలు గట్టిపడినాయి.

✤✤✤✤✤

---

**అలెక్సి కాన్‌స్టాంటినొవిచ్ (Aleksey Konstantinovich Tolstoy 1817-1875) -** సెయింట్‌పీటర్స్‌బర్గ్‌లోని ఉన్నత కుటుంబంలో జన్మించాడు. అతడి బంధువు A. Perovsky 1820 ప్రాంతంలో పేరుమోసిన రచయిత. టీనేజిలోనే కవిత్వం వ్రాసి జుకోవ్‌స్కీ లాంటి వారి మన్ననలను పొందిన టాల్‌స్టాయ్ 1844లో The Vampire అనే కథ వ్రాసినాడు. రెండవ అలెగ్జాండర్‌కు ADC గా పనిచేసి, తన అభిప్రాయాలను స్పష్టంగా చెప్పేవాడు. మారుపేరుతో (Kozma Prutkov) ఇతరులతో కలిసి అనేక వ్యంగ్య, హాస్య కవితలు వ్రాసినాడు. Prince Serebryeniyo నవలను, ట్రిలోజి - The Death of Ivan the Terrible, Tsar Fyodor Ioanovich, Tsar Boris లు అతడి రచనలలో ప్రముఖమైనవి.

# 40. శక్తివంతమైన పదాలు

**- అఫనాసి ఫెట్ (1887)**

ఒక్కోసారి మాటలెంత బలహీనంగా ఉంటాయంటే
నా ఆలోచనలను శత్రువుకూ, మిత్రుడికీ కూడా చెప్పుకోలేను.
ఏదో అవ్యక్త తరంగం నా హృదయాన్ని గందరగోళపరుస్తుంది.
ఎదలో మంటలు, ఆగని కన్నీళ్లు, అంతా వృధా!
ఈ భ్రాంతి ముందు మహాజ్ఞాని కూడా తల వంచుతాడు.

కవీ! నీవొక్కడివే మధుర పదాలతో ఆకాశగమనం చేస్తూ
వాటిని ప్రపంచమంతా వినిపింపజేస్తావు.
ఆత్మ ఉత్సాహాన్ని, పచ్చిక పరిమళాన్ని ప్రకటిస్తూ
మైదానాలను, కొండా కోనల్ని దాటి అనంతాకాశంలోకి ఎగుర్తావు.
జూపిటర్ దేవుడి గురుడ పక్షిలా రివ్వున దూసుకుపోతూ పదునైన
గోళ్లున్న కాళ్లతో మెరుపుల్ని పట్టుకుంటావు.

............... ............... ...............

అదుగో సరస్సుపై ఎగుర్తున్న 'స్వాలో' పక్షులు.
గుండె జల్లుమనేంత వేగంతో నీటిని తాకి ఎగిరిపోతుంటాయి.
తాకినట్లే తాకి చేపతో ఎగిరిపోతున్న ఆ పక్షిని చూడు!
మట్టితో చేయబడ్డ నేను, కలంతో ఒక్కచుక్క తోడుకోలేనా!

*****

---

**అఫనాసి ఫెట్ (Afanasy Fet 1820-1892) -** రష్యన్ ఉన్నత కుటుంబీకుడికి, జర్మన్ యువతికి జన్మించాడు. అతడిని అక్రమ సంతానంగా భావించి, అతడికి తల్లి ఇంటిపేరే ఉంచి, నోబుల్‌మాన్‌గా గుర్తించకపోయినా స్వయంకృషితో ఆ గుర్తింపు తెచ్చుకున్నాడు. 1840లో A Lyrical Panteon కవిత్వ సంపుటి ప్రచురించాడు. 1845-1858 వరకు సైనిక దళంలో పనిచేసి పెద్ద ఎస్టేట్‌కు వారసుడైనాడు. రాజరికాన్ని బానిసత్వాన్ని సమర్థించినవాడు, 'art for art's sake' అని నమ్మినవాడు. 'అందాన్ని ఆరాధించడమే కవి లక్షణం' అని భావించినాడు. ప్రకృతి, ప్రేమ గురించి కవిత్వం వ్రాసి రష్యన్ గేయ కవిత్వానికి అనేక సొబగులద్దినాడు.

# 41. గుర్రపు బండి గంటలు

**- యాకొవ్ పొలొన్‌స్కీ (1854)**

వెన్నెల దారిలో మంచు తుఫాను మౌనంగా ఉన్నది.
కోట్లాది తారానేత్రాలతో రాత్రి వెలుగుతున్నది.
మంద్రంగా మోగే చిరుగంటా! నన్ను నిద్ర బుచ్చుము.
ముగ్గురు పోయే రథమా! నన్ను తీసుకుని పొమ్ము!

మబ్బుల మసకదనంలో మంచు దూరం తరుగుతున్నది.
చంద్రుడి మాయా కిరణాలు, స్వప్నాలను గుర్తుకు తెస్తున్నవి.
చిరుగంటలతో పాటు ఏదో చిక్కటి గొంతు వినవస్తున్నది.
-'నా ప్రియుడెన్నడు వస్తాడో! నా దుఃఖమెప్పుడు తొలగునో!'

ఏమి జీవితం ఇది? నీలాకాశంలో సూర్యుడు వచ్చి వెళ్లిపోయాడు.
పొయ్యి మండుతూనే ఉన్నది. నీళ్లు మరుగుతూనే ఉన్నాయి.
ఏమి జీవితం నాది? చంద్రుడి స్వర్ణకిరణాలు నా గదిలోకి వచ్చాయి.
అరుస్తున్న శీతలగాలిలో నా హృదయదీపం వెలుగుతున్నది.
అతడి రాక కోసం అది దుఃఖిస్తూ రెపరెపలాడుతున్నది.

చిరుగంటలు వినవస్తున్నపుడే, నాకనిపిస్తుంది అతడు వస్తాడని!
ఏమి జీవితం ఇది? మంచులో కనిపించని ఒంటరి ఛెర్రీ చెట్టులా!
అవును, నేను బయటకు వెళ్లి వెదుకుతాను. ఓ చిరుగంటలా మోగు!
ఓ రథమా, గుర్రాలతో సిద్ధంకా! అతడుంటే హాయి నాకు!

✤✤✤✤✤

---

**యాకొవ్ పొలొన్‌స్కీ (Yakov Polonsky 1819-1898) -** ఉన్నతోద్యోగి కుటుంబంలో జన్మించిన పొలొన్‌స్కీ న్యాయశాస్త్రం చదివాడు. 1844లో తొలిపుస్తకం Gamma ప్రచురించబడింది. టిఫ్లిస్‌లో Vice-gerentగా, డిప్యూటీ ఎడిటర్‌గా పనిచేస్తున్నపుడు అద్భుతమైన కవితలను వ్రాసాడు. 1858లో The Russian Wordకు ఎడిటర్‌గా, ఫారిన్ లిటరేచర్ సెన్సార్ కమిటి సెక్రెటరీగా పనిచేసాడు. అపొలాన్ గ్రిగరియేవ్, ఫెట్‌లా గేయకత్వంలో ప్రసిద్ధికెక్కినాడు. తరువాతి తరం Bunin, Blok లాంటి కవులకు మార్గదర్శకుడైనాడు.

# 42. వృద్ధాప్యం

- అలెక్సి జెమ్‌ఛుజ్నికోవ్ (1896)

ఇంకెన్నాళ్లు జీవిస్తాను నేను? చెప్పగలవాళ్లెవరూ లేరు.
నా ఎదలో జీవన దీపమింకా ప్రకాశవంతంగానే వెలుగుతున్నది.
శరీరం కృశించినా, ఆత్మ శక్తివంతంగానే ఎగురుతున్నది.
బాధగానే ఉన్నా, ఎంతో మధురమీ ఆఖరి రోజులు.

ప్రతిరోజూ బతికి ఉన్నట్లు నిర్ధారణ చేసుకోవడం
చుట్టూ ఉన్న ప్రకృతి అందాలను ఆస్వాదించాలనుకోవడం
ఇంద్రియాలెప్పుడో నన్ను వీటికి పరాయివాడిని చేసాయి.
ఈ దేహపు కాడిని ఆత్మగుర్రం అంగీకరించడం లేదు!

ఈ నిరీక్షణ, బంధఛేధనం, పైపైకి ఎగుర్తున్న ఆత్మ!
అదృష్టవశాత్తూ ఏ వ్యాధీ నన్ను బాధపెట్టలేదు.
శాంతి, సుఖాలు నిండిన హృదయంతో నేను నడుస్తున్నాను.
కాని ఈ పొలాల్లో పచ్చిక, పూలపై నా అడుగులు పడడం లేదు.

*****

---

**అలెక్సి జెమ్ ఛుజ్నికోవ్ (Aleksey Zhemchuzhnikov 1821-1908) -** ధనవంతులైన ఉన్నత కుటుంబీకుడు. సెయింట్‌పీటర్స్‌బర్గ్ న్యాయ కళాశాలలో చదివాడు. సెనెట్ నుంచి 1858లో రిటైరైనాక తన సమయాన్నంతా కవిత్వ రచనకే వినియోగించినాడు. తన సోదరులు వ్లదిమీర్; అలెగ్జాండర్, బంధువు టాల్‌స్టాయ్ అలెక్సెతో కలిసి Kozma Prutkov అనే పేరుతో అనేక కవితలు వ్రాసినాడు. గేయ కవితలు, వ్యంగ్య హాస్య కవితలు అనేకం వ్రాసినా పేదలపై సానుభూతి, నూతన సంస్కరణలపై మక్కువ కలవాడు. 1892లో అతడి రచనలు రెండు సంపుటాలుగా వచ్చాయి.

# 43. జ్ఞాపకాలు

**- కాన్‌స్టాంటిన్ స్లుఛెవ్‌స్కీ (1898)**

ఏ జ్ఞాపకాల్ని నీవు హత్య చేద్దామనుకుంటున్నావు?
ఈ సూర్యకాంతిని నీవు ఊది ఆర్పేలోపల,
ఆలోచనా శక్తి పర్వతాన్ని ధ్వంసం చేస్తుంది, లేదా,
బ్రహ్మాండమైన నెగడుగా, రాత్రి చలిని దూరం చేస్తుంది.

జ్ఞాపకాలనేవి లాంతర్లలా, శాశ్వత దీపాలు-
గతించిపోయిన వసంత వస్త్రాల వర్ణాలు
ఆధ్యాత్మిక కష్టాలకు ఆఖర్లో అందిన బహుమతులు
ఆత్మ ఇంకా అంటిపెట్టుకున్న మధుర స్వప్నాలు.

జీవితపు చరమాంకంలో, ఇన్నాళ్లూ పోగు చేసుకున్న స్మృతులు
వేడినీ, వెలుగునిస్తాయి. జ్ఞాపకాలు నశిస్తే జీవితమూ నశిస్తుంది.
జీవితపు నిధి జ్ఞాపకాలు. చిల్లర డబ్బుల్లాంటివి.
పెద్దపెద్ద నోట్లు కరిగిపోయాక ఆసరాగా ఉండే అద్భుతాలు.

జ్ఞాపకాల విందులో మనం ఆనందంగా ఉన్నప్పుడు
గతంలో మనమేదైనా చెడు చేసి ఉంటే
అది నిశ్శబ్ద విషంలా, దుష్టపిశాచంలా
మన విందులో చేరి, విషమయం చేస్తుంది.

✤✤✤✤✤

---

**కాన్‌స్టాంటిన్ స్లుఛెవ్‌స్కీ (Konstantin Sluchevsky - 1837-1904) -** ఉన్నతోద్యోగి కుటుంబంలో జన్మించినాడు. సైన్యంలో పనిచేసి రిటైరయ్యాక వేదాంతంలో ఆసక్తి చూపినాడు. హీడెల్‌బర్గ్ విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పొంది దేశానికి తిరిగివచ్చి సివిల్ సర్వీస్‌లో చేరి ఉన్నత పదవులను పొందినాడు. సైకాలజిస్ట్, వేదాంతి, మేధావి అయిన స్లుఛెవ్‌స్కీ కవిత్వంలో శక్తివంతమైన పదాలు, వచనపు జాడలు, పదబంధాలు అద్భుతంగా కానవస్తాయి. 1880-1890 ప్రాంతంలో అతడి కవిత్వం ప్రచురింపబడి Bryusov లాంటి తరువాత కవులకు మార్గదర్శకమైనది.

# 44. యవ్వనం... ఒంటరితనం

**- ఇవాన్ బ్యునిన్ (1916)**

అడవిలో ఒకచోట కొరడా ఛెళ్‌మన్న మోత
పశువులు గుంపుగా తోసుకుంటూ పరిగెత్తుతుంటే
వాటి పాదాల కింద నలిగిన ఎండుటాకుల గలగలలు
మంచు బిందువులు నీలి తలలెత్తి చూసే చూపులు-

అకస్మాత్తుగా దూసుకువచ్చిన గాలి, కమ్ముకున్న నల్లమబ్బులు
ఆకాశం నుండి రాలుతున్న పుష్పాల్లా చల్లటి వాన చినుకులు
హృదయంలో సంతోషం దుఃఖాల మేళవింపులు
మైదానంలా విశాలంగా ఉన్నా, ఖాళీగా ఉన్నందుకు ఏదో దిగులు.

............... ............... ...............

అది చీకటి వర్షపు రాత్రి. ఘనీభవించిన సరస్సుపై చల్లటిగాలి.
వచ్చే వసంతం వరకూ జీవితం మంచు సమాధిలో నిద్రిస్తుంది.
ఇల్లు, ఇంటిలో నేను ఒంటరిగా, చీకటి పడేసరికి అన్నీ జ్ఞాపకాలే!

➡

అవే మబ్బులు మళ్లీ వచ్చాయి. ఆకాశాన్ని కమ్ముకుని కుండపోతగా వర్షించి,
చెరిపివేసాయి నీ పాదముద్రలను. మళ్లీ చీకటి పడుతోంది.
నీవు వెళ్లిపోతుంటే నేను కేకబెట్టాను. 'వచ్చేయ్! మనం ప్రేమికులం!'-

ఆడవాళ్లు గతాన్ని పట్టించుకోరు. ప్రేమ ముగిసాక నీవు అపరిచితుడివి.
నీవు వస్తే నీకు నేను ఎప్పటిలా తోడుంటాను. లేకుంటే,
ఒంటరితనమా! నెగడు దగ్గర చలికాగుతూ, ఇంత వైను తాగుతాను.
మరీ అవసరమైతే ఒక కుక్కను తెచ్చుకుంటా! దానికి విశ్వాసముంది!

*****

---

**ఇవాన్ బ్యునిన్ (Ivan Bunin) -** ఆర్థికంగా వెనకబడిన ఉన్నత కుటుంబీకుడు. చిన్నప్పుడు దూరప్రాంత మైదానాల్లో- In the deep silence of the fields - నిశ్శబ్దం మధ్య ప్రకృతి నుంచి పాఠాలు నేర్చుకున్నాడు. ఇంటివద్దే చదువుకుని ఝుకొవ్‌స్కీ 'ఒడిస్సీ' అనువాదంతో సాహిత్యాన్ని చదవడం మొదలెట్టాడు. ప్రూఫ్ రీడర్‌గా, లైబ్రేరియన్‌గా పనిచేస్తూ వచన, గేయకవిత్వాలు వ్రాసినాడు. 1898లో లాంగ్‌ఫెలో కవిత The Song of Hiawatha ను రష్యన్ భాషలోకి అనువాదం చేసినాడు. అప్పటి నుంచి రష్యన్ సాహిత్యంలో అగ్రగణ్యుడిగా, కవిగా, వచన రచయితగా పేరు పొందినాడు. అనేక వాదాలకు సాక్షిగా ఉన్నా పరంపరాగత ప్రాచీన సాహిత్యం, జీవన విధానాలపై మక్కువ కలిగి ఉండి అక్టోబర్ విప్లవాన్ని అంతగా సమర్థించలేదు. దానివలన ప్రయోజనం ఉండదని భావించి పారిస్ వెళ్లిపోయి అక్కడే చనిపోయినాడు. రెండవ ప్రపంచయుద్ధంలో రష్యా విజయాన్ని ఎంతగానో ప్రశంసించినాడు.

# 45. పైన్ వృక్షాలు

**- కాన్‌స్టాంటిన్ బాల్మాంట్ (1928)**

గాలిదెబ్బలకు నడుం వంగినట్లున్న గూని ఇసుక తిన్నెలు,
కాస్త దూరంలో ఓ చిన్న సరుగుడు చెట్ల తోపు.
ఆకుపచ్చ తంత్రీపత్రాలు వెలువరిస్తున్న సంగీత నాదాలు
ఆగకుండా దూసుకువస్తున్న పరిమళభరిత సువాసనలు.

ఉత్తరదేశవాసులు దక్షిణానికి ప్రవాసం వచ్చినారు.
మాటలు రాకపోయినా గాలుల సావాసంతో గానం చేస్తారు.
వంపులు తిరిగినవి కొన్ని, ఆకాశాన్నంటేవి మరికొన్ని.
ఇక్కడ తిరుగాడే పాటల పక్షులేవి? పూచే చేమంతులేవి?

గుంపులు గుంపులుగా ఎగిరే సీతాకోక చిలుకలేవి?
బొట్లుబొట్లుగా రాలే అగరు బిందువులేవి?
గాన కోయిలలు కానరావు. లిల్లీపూల జాడలేదు.
జివ్వున వీస్తున్న గాలికి, రోమాలు నిక్కబొడుస్తున్నాయి!

గుడ్లగూబ వినిపించుకోదు, నీడలు పట్టించుకోవు
ఎండు శంఖువుల తబలా, వాయులీన వాయిద్యాలు.
జ్ఞాపకాల నీడలో వీటిని చూసి శాంతినొందుతాను.
మా ఊరి తోటలో కోయిల పాడుతున్న పాటను ఆలకిస్తాను.

✤✤✤✤✤

---

**కాన్‌స్టాంటిన్ బాల్మాంట్ (Konstantin Balmont 1867-1942) -** వ్లదిమీర్ ప్రావిన్స్‌లో పుట్టి 1886లో న్యాయకళాశాలలో చేరినా విద్యార్థి ఉద్యమంలో పాల్గొన్నాడని బహిష్కరింపబడినాడు. ప్రజల త్యాగాలు, దుఃఖం మూలవస్తువులుగా కవిత్వం వ్రాసినాడు. In Infinity, Silence, Buildings on Fire, Let us be as the Sun అనే పుస్తకాలు, విస్తృతంగా ప్రపంచమంతా పర్యటించి యాత్రానుభవాలు వ్రాసినాడు. 1905 విప్లవాన్ని సమర్థిస్తూ Songs of an avenger అనే కవిత్వ పుస్తకాన్ని ప్రచురించాడు. ప్రాక్పశ్చిమ కవితల్ని అనువదించినాడు. 1921లో ఫ్రాన్సుకు వలసవెళ్లినాడు. కడు పేదరికంలో కన్నుమూసినాడు.

# 46. ఉయ్యాల - జంపాల

- ఫ్యోదార్ సొలొగబ్ (1907)

పరవళ్లు తొక్కేనది పక్కన, ఫర్ వృక్షాలున్న చోట
సాక్షాత్తు డెవిల్ ఊపుతున్నాడు, నే ఊగుతున్న ఉయ్యాలను.
అతడు నవ్వుతూ ఊపుతున్నాడు.
పైకిపోతున్నా... కిందకు వస్తున్నా...
కూర్చున్న పీట కీచుమన్నది.
తాడు పేలికలవుతున్నది కొమ్మకు రాసుకుని.
ఊయల ఇంకా వేగంగా ఊగుతున్నది,
డెవిల్ ఇంకా బలంగా నెట్టుతున్నాడు,
చేతుల్తో పొట్ట పట్టుకుని పకపకా నవ్వుతున్నాడు...
పైకి పోతున్నా.... కిందకు వస్తున్నా...
జారుతూ, ఒరుగుతూ, వేలాడుతూ, పైకెగుర్తూ-
ఫర్ వృక్షాలకన్నా పైకెగిరినాక
నీలాకాశమే నా చుట్టూ
-'ఇక్కడే కూర్చో! ఎంత నీలం కావాలి నీకు?'-
ఈసారి డెవిల్ మరింత గట్టిగా ఊపాడు.
తాడు తెగింది, నేల నా వేపు వస్తున్నట్లున్నది.
ఇప్పుడు ఫర్ చెట్లకన్నా ఇంకా పైపైకి
తలకిందులుగా పడినాసరే! ఏమైనా కానీ,
ఈ అనుభవం ఇంకా కావాలనిపిస్తున్నది.

❖❖❖❖❖

---

**ఫ్యోదార్ సొలొగబ్ (Fyodor Sologub 1863-1927) -** ఇతడి అసలుపేరు టెటెర్నికోవ్. తండ్రి టైలర్. ఇతడి నాలుగవ ఏట కన్నుమూసినాడు. కష్టపడి చదువుకుని ఇరవై అయిదేళ్ల పాటు లెక్కల మాస్టారుగా పనిచేసినాడు. ప్రతీకాత్మక కవిత్వం వ్రాసి ప్రసిద్ధికెక్కినాడు. జీవితాన్ని కలగా భావించినాడు. జీవితం ఒంటికన్ను రాకాసి అంటాడు. వాస్తవిక జీవితాన్ని చక్కగా చిత్రీకరించినాడు. Petty Demon అనే ప్రసిద్ధ నవలను **(1905)**, To the Mother Land (1906), The Flaming Circle (1908, The Red Poppy (1916), The cathedral chimes (1922) కవితా సంపుటాల్ని ప్రచురించాడు. **1905** విప్లవానికి సానుభూతి చూపినా అక్టోబరు విప్లవాన్ని సమర్ధించలేదు.

# 47. అస్సర్‌గాడన్

**- వాలెరి బ్రైయుసోవ్ (1897)**

రాజాధిరాజును నేను, నాపేరు అస్సర్‌గాడన్
చిన్నాచితకా రాజుల్లారా! గుర్తుంచుకోండి!
నా ఆజ్ఞ మీకు కష్టాల్ని, దుఃఖాన్ని తెచ్చిపెడ్తుంది!
తిరుగుబాటు చేసిన సిడాన్, ఈనాడు సముద్రగర్భంలో ఉంది.

ఈజిప్టుకూ రాజును నేనే! ఎలామ్‌కు ఏలికను నేనే!
శత్రువుల కంకాళాలపై నా సింహాసనాన్ని ప్రతిష్ఠించాను.
గుర్తుంచుకోండి! నా ఆజ్ఞ మీకు కష్టాన్ని, దుఃఖాన్ని తెచ్చిపెడ్తుంది.

బలంలో నాకు సాటిరాగల వాడెవడు? నాకు సమానుడెవడు?
మిగతా వాళ్ల పనులు కలల్లా అదృశ్యమవుతాయి.
వాళ్ల వీరత్వ ప్రదర్శనలు కథల్లా కరిగిపోతాయి.

ఈ భూమిపై కీర్తిని ఆఖరిచుక్క వరకూ తాగాను.
నా వైభవాన్నంతా కలబోసుకుని ఉన్నతంగా నిలబడ్డాను.
మీ జార్ ప్రభువులకే ప్రభువును, అస్సిరియన్ అస్సర్‌గాడన్‌ను!

✣✣✣✣✣

---

**వాలెరి బ్రైయుసోవ్ (Valeri Bryusov 1873-1924) -** మాస్కోలో వ్యాపార కుటుంబంలో జన్మించాడు. హేతువాది, సైన్సును నమ్మినవాడు. మాస్కో యూనివర్సిటీలో డిగ్రీ చదివాడు. ప్రతీకాత్మక కవిత్వాన్ని వ్రాసిన కవులలో ప్రముఖుడు. రచయిత, విమర్శకుడు, కవి, అనువాదకుడు, నాటక రచయిత అయిన బ్రైయుసోవ్ అక్టోబరు విప్లవం తొలిరోజు నుండి దానిని సమర్థించినాడు. 1919లో కమ్యూనిస్టు పార్టీలో చేరినాడు. The Russian Symbolists, Terra Vigilia, Urbi et orbi, Stephanos, The Mirror of Shadows, The Seven colors of the Rainbow, Mea అతడి ప్రసిద్ధ రచనలు. ప్రకృతి శక్తులపై మానవుడి విజయాన్ని ప్రస్తుతించే అంశాల్ని అతడు తన కవిత్వంలో ప్రస్తావించినాడు.

# 48. పిడిబాకు

**- వాలెరి బ్రైయుసొవ్ (1904)**

**('పిడిబాకును చూసేంత వరకూ ప్రతీకారపు గొంతును పట్టించుకోము'**
*-మైఖెయిల్ లెర్‌మాన్‌టోవ్)*

ప్రాచీన కాలపు ఒర నుంచి లాగబడిన ఈ ప్రసిద్ధ పిడిబాకు
చూడు! ఎంత పదునుగా, కాంతివంతంగా మెరుస్తున్నదో!
తుఫానులు గర్జిస్తున్నపుడు కవిగాయకులు వీరులతో కలుస్తారు.
ఎందుకంటే, పాట, తుఫాను అక్కచెల్లెళ్లు కదా!

అందరూ తలలు వంచాక, ధైర్యం, బలం రక్తస్రావమైనాక,
పిరికివాళ్లు మట్టికరిచాక, వీళ్లమీద ద్వేషంతో నేను,
యుగాల కింద మట్టి ప్రపంచంలోకి పారిపోయాను.
అది నిశ్శబ్దం, రహస్యాలు తలదాచుకున్న స్మశానం.

అందం, ఆలోచన, దూరదృష్టి లేని ఈ క్షుద్రజీవితం
నాలో పెంపొందించింది అంతులేని అసహ్యం.
బానిసల యుద్ధపు కేకలు కూడా, నాలో రగిలించాయి తిరస్కారం.
అవిగో రణభేరులు! ఎగుర్తున్న పతాకలు! ఉరుముల ప్రతిధ్వనులు!

ఓ కవిత్వపు పదునైన శస్త్రమా!
రోజులు గడుస్తున్నకొద్దీ నీ పదును పెరుగుతున్నది.
నాకూ గుంపులో కలవాలనుంది, కాని, నేను కవిని కదా!
దూరంగా మెరుపులు తీవ్రంగా ప్రజ్వలిస్తున్నవి.

# 49. కొండల్లో...

**- ఆంద్రీ బెలి (1903)**

పెళ్లికిరీటాలు పర్వత శిఖరాలపై మెరుస్తున్నవి.
యవ్వనోద్రేకాన్ని శుద్ధిచేసే శీతల మజాను ఆస్వాదిస్తున్నాను.
ఈ లోయ దగ్గర నావద్దకు ఓ గూనివాడు
రైతులా వచ్చి, కొన్ని పైనాపిల్స్ బహుమతిగా ఇచ్చినాడు.

అరుణకాంతి వస్త్రాలతో అతడు, నీలాల నింగిలో నాట్యమాడుతుంటే
అతడి ఊగుతున్న గడ్డం వెండి మంచుతుఫానును పంపింది.
మంద్రమైన సంగీత ధ్వనిలో ఒక పైనాపిల్‌ను గాలిలోకి విసిరాడు.
మెరుపు తీగెల వలయంలా అది దూరంగా పడి అదృశ్యమైంది.

స్వర్ణ తుషార బిందువులు తళతళలాడ్తుంటే
చూసినవాళ్లది సూర్యబింబమని సంబరపడినారు.
బంగరు రంగు అగ్ని జలధారలు లోయల్ని కమ్ముకున్నాయి.
మంచుస్ఫటికాలు అరుణకాంతిని ప్రస్ఫుటం చేసాయి.

నేను గ్లాసులో మధువు నింపి కనబడకుండా వెళ్లి నవ్వుతూ
ఆ గూనివాడిపై వరదలా నురగ మధువు కుమ్మరించాను.

*****

---

**ఆంద్రెడి బెలి (బోరిస్ బుగయేవ్ 1880-1934) -** మాస్కోలో జన్మించాడు. అతడి తండ్రి లెక్కల్లో ప్రొఫెసర్. మాస్కో యూనివర్సిటీలో మాథమెటిక్స్ డిగ్రీ తీసుకున్నాడు. 1902లో Dramatic Symphony, 1905లో Gold in Azure, 1909లో Ashes కవితా సంపుటిలు వెలువరించాడు. ప్రతీకాత్మక కవిత్వం, వేదాంత ధోరణి, నియోకాంటియన్ ఫిలాసఫీ, భౌతికవాద వ్యతిరేకత, మార్మికత, దైవభక్తి ప్రధానాంశాలు. 'The meaning of art is purely religious' అని నమ్మినవాడు. అక్టోబరు విప్లవంలో పాల్గొని రష్యా పునర్నిర్మాణంలో పాత్ర వహించాడు. 1930లలో At the turn of the century, The Begining of the Century, Between two revolutions అనే గ్రంథాలు రచించినాడు.

# 50. రాత్రి సమయం

- ఇన్నొకెంటి అన్నెన్స్కీ (1906)

పగలు నిష్క్రమించినాక, సంధ్యాచీకటిని స్పృశించావా ఎన్నడైనా!
కాసేపట్లో నూతన ప్రపంచావిష్కరణ జరగబోతోందని గ్రహించావా!
నీడలలో నీడలు నిశ్శబ్దంగా కలిసిపోయే నిర్మల క్షణాలలో
కళ్లతో చూడలేని కిరణాల మధ్య మనం ఒకరినొకరం దాటి పోయుంటాం!

రాత్రి భయాన్ని తాకుతూ, చిన్ని శబ్దాన్ని కూడా, చెవులు నిక్కపొడుచుకు వింటాం!
తలుపులు తెరచి దీపాన్ని వెలిగించగానే, పారిపోతున్న నీడలను పరిహసిస్తాం!

............... ............... ...............

హద్దులు లేని ఈ క్షోభను, మృత్యువేనా ఆపగలిగింది!
వడలి రాలిపోతున్న ఆకుల్లా, నేనూ కాలంతో కరిగి పోవడంలేదా!
స్ఫటికపు కన్నీళ్లు కారుస్తూ, నాలోని అగ్ని చల్లారిపోతున్నది.
ఎడారి రాళ్ల మధ్య ఎండిన చెట్లలా, గులాబీలపై మంచు పరచుకున్నది.
ముత్యాల దారాల్లా కురవబోతున్న వర్షమన్నా నాకు ఉపశమనాన్నిస్తుందా?

............... ............... ...............

తుమ్మెదలు నిష్క్రమించిన హృదయవనంలోకి దోమల సంగీతం.
ఎదలో ఏదో వెలితి, పగటి వెలుగుపై చీకటి ఆధిపత్యం
జ్ఞాపకాల మబ్బులు వస్తూపోతుంటే, అరమోడ్పు కళ్లలో స్వప్నగీతం.
ఈ జీవితానికి ఒక్క ఉద్విగ్నక్షణం చాలు, దీపం దగ్గర కీటకం.
అగ్నిగానైనా మారతాను, అగ్నిలో శలభంగానైనా మాడిపోతాను.

*****

**ఇన్నొకెంటి అన్నెన్స్కీ (Innokenty Annensky 1856-1909) -** ఉన్నతోద్యోగి కుటుంబంలో జన్మించినా, చిన్నప్పుడే తల్లిదండ్రులను కోల్పోయిన అన్నెన్స్కీ తన పెదనాన్న దగ్గర పెరిగాడు. సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో History and Philology అభ్యసించి, ఉపాధ్యాయ వృత్తిలో స్థిరపడినాడు. విమర్శలు, ఫ్రెంచి అనువాదాలు, యురిపిడిస్ గ్రీకునాటకాల అనువాదాలు, Quiet Songs అనే కవిత్వ సంకలనం, The Cyprus Casket అనే గ్రంథం, అనేక నాటకాలు వ్రాసినాడు. తన చుట్టూ ప్రపంచాన్ని పీడకలగా, పిశాచంగా భావించిన అన్నెన్స్కీ రచనలలో మానవత్వం, ఆత్మశోధన ప్రస్ఫుటంగా కనిపిస్తాయి.

# 51. ప్రేమ

**- వ్యాఛెస్లావ్ ఇవనోవ్ (1901)**

పిడుగు కాల్చిన రెండు వృక్షాలం, అర్ధరాత్రి వెలిగే రెండు కాగడాలం!
నింగిలో దూసుకుపోతున్న జంట ఉల్కాలం, రెండు అగ్నిబాణాలం!
కళ్లేలున్నా ఆపలేని వేగంతో దూసుకుపోతున్న జోడు గుర్రాలం!
ఒకే దృశ్యాన్ని చూస్తున్న రెండు నేత్రాలం, ఒకే స్వప్నానికున్న రెండు రెక్కలం!
చలువరాతి సమాధిలోని నిశ్చల సౌందర్యవతిని చూస్తున్న సజల నయనాలం!
ఒకే రహస్యాన్ని దాచే రెండు పెదాలం, ఒకే స్ఫింక్స్ పొడుపు కథలం!
మేము శిలువకున్న రెండు చేతులం, హస్తాలం.

# పాతమద్దిచెట్టు

వృద్ధాప్యం మీదబడినా నాలో కవిత్వం చావలేదు.
పాత మద్దిచెట్టు కూడా వసంతకాలంలో చిగురిస్తుంది.
ఉత్తరపు తుఫాను గాలుల్ని ఓర్చుకుంటూ శీతాకాలమంతా నిద్రపోయి,
కొండవాలులన్నీ ఆకుపచ్చని ప్రవాహంగా మారినప్పుడు,
వడలిపోయిన లోహపు ఆకులకింద నల్లటి లేత శాఖ
గది నుంచి బయటపడిన పిల్లాడిలా నవ్వుతూ, గెంతుతూ!

*****

---

**వ్యాఛెస్లావ్ ఇవనొవ్ (Vyacheslav Ivanov 1866-1949) -** మాస్కోలో సర్వేయర్ కుటుంబంలో జన్మించాడు. 1886లో బెర్లిన్‌లో ప్రఖ్యాత చరిత్రకారుడు Mommsen వద్ద ప్రాచీన రోమ్ చరిత్ర అభ్యసించి ఇటలీలో చాలాకాలం ఉండి 1905లో రష్యాకు తిరిగి వచ్చినాడు. ప్రతీకాత్మక కవిత్వం వ్రాసినాడు. Pilot Stars (1903) ప్రచురించబడింది. 'A Poet is a religious arranger of life' అన్నది ఇతడి ప్రతిపాదన. అక్టోబరు విప్లవం తరువాత సోవియట్ రష్యా పునర్నిర్మాణంలో భాగస్వామిగా ఉండి 'బాకు' విశ్వవిద్యాలయంలో ఉపాధ్యాయుడిగా ఉన్నాడు. 1924లో రోమ్‌కు వెళ్లి అక్కడ రోమన్ కాథలిక్‌గా Utterlyothodox గా పేరుతెచ్చుకున్నాడు. ఇటలీలో రష్యన్ సాహిత్యము, చరిత్రను బోధించినాడు. అతడి Winter Sonnets (1919), Roman Sonnets (1925) ప్రసిద్ధమైనవి.

# 52. వృద్ధ ధ్యాని

- సెర్జి గొరొడెట్స్కీ (1906)

అదుగో, ఆ కొండకావల మైదానంలో
ఎర్ర ఉల్లిపాయల మధ్యలో సూర్యుడస్తమిస్తాడు.
పచ్చని యవధాన్యం స్వర్ణశిరాల్ని ప్రకాశింపజేస్తుంది.
అక్కడే ఒక పొగచూరిన గుడిసె,
ఆకుపచ్చని నాచుపట్టిన దుంగలు
ఏళ్ల తరబడి వేళ్లు పాతుకున్న ఉన్నత వృక్షాలు
మధ్యలో మట్టిముద్దలా వృద్ధ ధ్యాని కుటీరం
ముఖం చిట్లిస్తూ, చిరునవ్వులు చిందిస్తూ
గాలికి అతడి గడ్డం కంపిస్తున్నట్లు ఊగుతున్నది.

-'అందమైన కన్యలారా! సాయంకాలం కావస్తున్నది!
రండి ఈ మైదానంలోకి, ముచ్చట్లకు సమయమిది'-

ఒక కన్య తరువాత ఇంకొకరు వచ్చి పలకరించినారు.
-'అవునా! అయితే అడుగుదాం ఆ బకరాజాన్ని ఆలోచన!

కొంగా! కొంగా! ఓ పొడుగుకాళ్ల కొంగా!
మా భవిష్యత్తును చెప్పవా లాఘవంగా!
తలను నీళ్లలో ముంచు, తాగు మధురజలాలను ఆనందంగా!
తలపైకెత్తి ఎగిరిపో రెక్కలార్చి వేగంగా!

ఉత్సుకతతో నీ గుండె ఉప్పెనగా కొట్టుకుంది.
ఎగిరిపోతున్న కొంగను వేదనతో పిలిచింది.
కొంగా! కొంగా! నా ప్రియుడి వార్త నాకు తెలియజేయుము.
ఈ ఎర్ర రిబ్బనును నా బహుమతిగా అతడి కందజేయుము!'

✤✤✤✤✤

---

**సెర్గి గొరొడెట్స్కీ (Sergey Gorodetsky 1884-1967) -** ప్రభుత్వోద్యోగి కుమారుడైన గొరొడెట్స్కీ, సెయింట్‌పీటర్స్‌బర్గ్‌లో History, Philology చదివాడు. **1907**లో Vitality పుస్తకాన్ని వెలువరించాడు. రైతుల, గ్రామస్తుల జానపద గీతాలు, పురాణ కథల నేపథ్యంలో వ్రాసిన అతడి కవితలు ఆ కాలంలో ఎంతో ప్రాచుర్యాన్ని పొందాయి. Blok, Bryusov, Bely లాంటి కవులు వాటిని మెచ్చుకున్నారు. **1909**లో Acmeists Poetry Workshop స్థాపకులలో ఒకడు. అక్టోబరు విప్లవంలో అతడు టర్కిష్ ఫ్రంట్‌లో యుద్ధలంలో పాల్గొన్నాడు. కవిత్వం, వచనం అనేక సంపుటాలుగా వెలువరించినాడు. ప్రతీకాత్మక కవిత్వం, పట్టణ శివార్లలలోని ప్రజల- Cellar windows- రైతుల, నిరుపేదల జీవితాన్ని అర్థవంతమైన కవిత్వంగా మలిచినాడు.

# 53. అయితే...

- మిఖాయిల్ కుజ్‌మిన్ (1908)

నేను గనుక ప్రాచీన చక్రవర్తినైతే
ఇథియోపియా, పర్షియాల నాక్రమించి
'ఖియోప్స్' పిరమిడ్ కన్నా ఎత్తైనది నిర్మించి
ఈజిప్టులో అతి శక్తివంతుడనయ్యేవాడిని!

నేను గనుక పగటి చుక్క లాంటి దొంగనైతే
'మెంకారా' సమాధిని కొల్లగొట్టి, రత్నాల్ని, మణుల్ని
అలెగ్జాండ్రియా యూదులకమ్మి, ఇల్లూ, పొలాలు కొని
ఈజిప్టులో మహా ధనవంతుడనయ్యేవాడిని!

నేను గనుక నైలునదిలో మునిగిన
రెండవ 'ఏంటినౌస్' నయితే, నా అందాన్ని
ఆరాధించేవాళ్లతో దేవాలయాలు కట్టించుకుని
ఈజిప్టులో గొప్ప పేరున్నవాడినయ్యేవాడిని!

నేను గనుక మహాజ్ఞానినయితే
నా ఆస్థిపాస్తుల్ని పేదసాదలకు పంచి
రాత్రిపూట కాపలా భటుడిగా
ఈజిప్టులో అతిస్వేచ్ఛగలవాడినయ్యేవాడిని!

నేను గనుక నీ బానిసనయితే,
చీకటి కొట్టంలోంచి, ఏడాదికో, రెండేళ్లకో
నీ పాదాలకున్న పాదరక్షల పైని స్వర్ణ రేఖల్ని చూసి
ఈజిప్టులో అందరికన్నా ఎక్కువ ఆనందంగా ఉండేవాడిని.

*****

---

**మిఖాయిల్ కుజ్‌మిన్ (Mikhail Kuzmin 1875-1936) -** ఉన్నత కుటుంబీకుడు. ఉన్నత విద్యాభ్యాసం చేసినాడు. వయసులో ఇటలీ, ఈజిప్టులు సందర్శించినాడు. Nets, The Carillons of Love, Autumn lakes, Clay Pigeons, The leader, ప్రసిద్ధికెక్కిన Songs of Alexandria (1910) కవితా సంపుటిలను వెలువరించినాడు. ఇంద్రియ సుఖాలు, వ్యంగ్యం, సరసోక్తులు, నిశిత పరిశీలన, పాతరోజులపై మక్కువ ఇవన్నీ అతడికి ప్రత్యేక శైలినిచ్చాయి. కవి, రచయిత, అనువాదకుడు, విమర్శకుడు, నాటక రచయితగా కుజ్‌మిన్ ఎంతో పేరు పొందినాడు.

# 54. మేము లోహకారులం...

**- ఫిలిప్ ష్కులెవ్ (1914)**

లోహకారులం మేము, యవ్వన గీతాలు పాడుతాం!
ఆనందపు తాళం చెవిని, అందంగా తయారు చేస్తాం!
మా బలంకొద్దీ సుత్తిని లేపి, దాగలిపైని
కాలిన ఇనుమును దెబ్బమీద దెబ్బ కొడ్తాం!

కొత్తదార్లు నిర్మిస్తాం, అందరూ మమ్మనుసరించేందుకు!
మాతృభూమి నూతన దినానికి స్వాగతం పలుకుతాము!
మా కొలుములు జ్వలిస్తాయి, స్వేచ్ఛను ప్రతిఫలిస్తాయి.
ఉక్కులా కలకాలం, దృఢంగా మన్నుతాము.

మా దళాల అగ్నిఘాతాలకు, చీకటి చిత్తగిస్తుంది.
కొండా కోనల్లో, మైదానాల్లో, తిరుగుబాటు బావుటా లేస్తుంది.
అణగదొక్కబడిన వాళ్ల తెగువ, శత్రువుకు తెలుస్తుంది.
స్వేచ్ఛాగీతమే వాయువై, ఈ నేలనంతా నింపుతుంది.

................ ................ ................

✤✤✤✤✤

---

**ఫిలిప్ ష్కులెవ్ (Pilipp Skulev 1868-1930) -** పేద రైతు కుటుంబంలో పుట్టి చిన్నప్పుడే ఫ్యాక్టరీలో పనికి పంపబడినాడు. చేతికి గాయం కాగా కూరగాయాల దుకాణంలో పని చేసినాడు. కొద్దిగా చదువుకున్నా నెక్రసొవ్, నాడ్సన్లను అనుకరిస్తూ అనేక కవితలు వ్రాసి టీనేజ్ వయస్సులోనే కవిత్వాన్ని ప్రచురించినాడు. **1905**లో సాయుధ తిరుగుబాటులో పాల్గొన్నాడు. **1912** నుంచి జ్వాద్దా, ప్రావ్దా పత్రికలకు పనిచేసినాడు. జైలుకు పంపబడినాడు. అక్టోబరు విప్లవం తరువాత సాహిత్య ఉద్యమాలలో పాల్గొన్నాడు. A Hymn to labour (1922), The Black Smiths (1923) ఇతడిలోని శ్రామికుల మనస్తత్వాన్ని, పోరాట పటిమను తెలియజేస్తాయి.

# 55. ఎదురుచూపులు

**- మాగ్జిమిలియన్ వొలిషిన్ (1910)**

కొండలపైనుంచి ఏటి ప్రవాహాలు
అనంత గానంతో ఆహ్వానిస్తున్నాయి వసంతాన్ని.
మంచుతో కప్పబడిన చెట్ల కొమ్మలు
సన్నటి కొవ్వొత్తుల్లా వరుసలుగా అమరినాయి.

పారే జల ప్రవాహాల్లో, రాలిన ఆకులు
అక్కడక్కడా ఆగి శీతాకాలమంతా చీకిపోతాయి.
మొండి పొదలు చలికి వణుకుతూ
నీలి ఊదారంగు పొగల్తో నిగనిగలాడ్తాయి.

కొమ్మలన్నీ తలవంచి నింగికి మొక్కుతూ
వసంతాన్ని పంపమని మరీమరీ ప్రార్థిస్తుంటాయి.
తన దీపాల్ని వెలిగించి చీకటిని పారద్రోలమని
'కాండెలాబ్రా' మనల్ని కోరుకున్నట్లు అవి కానవస్తాయి.

✤✤✤✤✤

---

**మాగ్జిమిలియన్ వొలొషిన్ (Maximilian Voloshin 1877-1932) -** కోసక్కుల ఉన్నత కుటుంబంవాడైన వొలొషిన్ మాస్కో విశ్వవిద్యాలయంలో న్యాయశాస్త్రం అభ్యసించాడు. విద్యార్థుల ఉద్యమంలో పాల్గొన్నందుకు బహిష్కరింపబడినాడు. జర్మనీ, ఫ్రాన్స్, ఈజిప్టు, యూరప్‌లను సందర్శించినాడు. కవిత్వం, చిత్రలేఖనం (The greatest of Pleasures)లో నిమగ్నుడై Poems (1910), Ivernie (1918), Deaf and Dumb Demons (1919) పుస్తకాలను ప్రచురించినాడు. తనను తాను 'A wanderer of the world's roads and cross roads' గా అభివర్ణించుకున్నాడు. అతడి Simmerian Darkness అనే కవితల (సానెట్స్) సంపుటిలో చిత్రాల్లా కనిపించే కవితలను మనం గమనిస్తాం.

# 56. ఓ బాటసారీ...

- మారినా స్వెతాయెవా (1913)

ఓ రకంగా నీవే నేను, ఈ దారిలో నడిచేప్పుడు,
ఓ బాటసారీ! ఓ క్షణం కాస్త ఆగు!
ఆ పచ్చిక మిట్టమీది ఎర్రపూలున్నాయి చూసావూ,
అక్కడే నా జనన, మరణాల తేదీలున్నాయి చూడు!

అవును, అది నా సమాధి, నీ వెంట పడనులే భయపడకు!
నన్ను నమ్ము! నేనూ ఒకప్పుడు మనసారా నవ్వేదాన్ని, కన్నీళ్ల మధ్యన!
నా రక్తం జలజలా ప్రవహించేది, నా ముంగురులు గాలికి ఊగేవి.
ఓ బాటసారీ! ఓ క్షణం కాస్త ఆగు!

నేను ఎర్రటి స్ట్రాబెర్రీని. పడిఉన్నాను నేలపై! తీసుకో, తిను!
స్మశానంలోని పళ్ల రుచి ఇంకా వేటికీ ఉండదులే!
పెదాలు బిగించకు! వణికి పోకు! మరచిపో నన్ను!
ఓ బాటసారీ! ఓ క్షణం ఆగు! సమాధిలో గొంతును మరచిపో!

మణికట్టు నరాల్ని కోసాను. రక్తం వెల్లువై పారింది.
ఎంత పెద్ద గంగాళాలూ చాలవు. రక్తం పొంగి పొర్లుతున్నది.
నల్లమట్టిలో కలిసి, పురుగులకు ఆహారమౌతున్నది.
ఎవరూ నా జీవన రుధిర కవిత్వాన్ని నాలో తిరిగి నింపలేరు.

*****

---

**మారినా స్వెతాయెవా (Marina Tsvetayeva 1892-1941) -** ప్రొఫెసర్ ఇవాన్ స్వెతయేవ్ (మాస్కోలో పుష్కిన్ మ్యూజియం ఆఫ్ ఆర్ట్ స్థాపించినవాడు) కుమార్తె మారినా. 1912లో An Evening Album ను ప్రచురించింది. 1922లో ప్రవాసం పోయి Berlin, Prague, Parisలో నివసించింది. పేదరికంలో మగ్గిన ఆమె 1939లో రష్యాకు తిరిగి వచ్చింది. ఆమె కవితలలో లయ, దూకుడు, శిల్పం, భావుకత అద్భుతంగా ఉంటాయి. రష్యన్ జానపద గీతాలు, విశాల మైదానాలు, నెగళ్లు, స్వేచ్ఛాజీవుల గాథలు కలబోసిన కవిత్వ పంక్తులతో ఆమె కవిత్వం అందరినీ అలరిస్తుంది. ఫాసిజానికి వ్యతిరేకంగా ఆమె ఎన్నో కవితలను వ్రాసింది.

# 57. అవే కళ్లు

- మారినా స్వెతయెవా (1918)

ఆ విశాల మైదానాన్ని అనుదినం పరికించే ఆ కళ్లు
కన్నీళ్ల బాధకు ఏనాడో అలవాటు పడ్డాయి.
పసుపు ఆకుపచ్చదనాన్ని, గెలుపోటములను భరించే
ఆ రైతు కళ్లు, ఉప్పునీటి చెలమలకు ఆనవాళ్లు.

నేనే గనక రైతు భార్యనయితే, ఆ కళ్లు
నాకు ఆశ్రయాన్ని, ఆహారాన్నిస్తాయి.
పసుపు ఆకుపచ్చ, ప్రశాంతమైన
ఆ హుషారైన కళ్లు సుఖ దుఃఖాలకు పుట్టిళ్లు.

నేనే గనక రైతు ఇల్లాలినైతే,
బయట ఎండలో బల్లమీద కూర్చుని
నా ఒడిలోని పసిపాపను ఆడిస్తూ
కాస్త నీడ వచ్చేలా పాపను, కనుపాపలను కప్పుకుంటాను.

అంగవస్త్రాన్ని ముఖంపై కప్పుకుని, సన్యాసిలా నిద్రిస్తూ,
ఆ వస్త్రం కింద నిజాయితీ, సహనం గల రెండు కళ్లు.
ఆ విశాల మైదానాన్ని కన్నీళ్లతో పరికించే ఆ కళ్లు
ఎవరినీ మోసం చేయనివవేకళ్లు! ప్రేమలోగిళ్లు!

*****

# 58. సముద్ర ప్రయాణీకులు

- నికొలాయి క్లైయుయెవ్ (1927)

మేము సముద్రయాన కవులం!
సుడిగుండాలన్నా, తుఫానులన్నా జడవం!
తోకచుక్కల్నీ, భీకర గాడ్పుల్నీ అన్వేషిస్తూ
అనంత సముద్రపు టలలపై విహరిస్తాం!

అగాధాల్ని దాటుతూ, నిశీధిలో జారుతూ
అట్లాంటిక్ జలధి అల్లకల్లోలాన్ని స్పృశిస్తాం!
పుష్పవన కుటీరపు పూలమొక్క వరుసల్లా
తుఫాను గాలి తాకిడికి తలవంచక వికసిస్తాం.

కందిరీగ తుట్టె నుంచి కదిలిన కీటకమై
సైరన్ కేకలతో సముద్రాన సాగుతాం!
అలల్ని జోకొట్టే మరపడవ నడకలా
కవిత్వపు పాదాలతో కొదమ సింగాలమౌతాం!

మంచు తెరల మధ్య నుంచి సింహం గర్జిస్తుంది.
రష్యన్ శ్రామికుల రక్తములికి పడుతుంది.
యుద్ధానికి, గుఱ్ఱాలను సిద్ధం చేస్తారు వీరులు.
పిడుగును చేతబట్టి లెనిన్ పీడితుల ముందుంటాడు.

పద్యాల్లా నెమళ్ల నేల పరవశించి వికసిస్తుంది.
తిమింగలాల్ని వేటాడ్తూ కవుల నావ సాగుతుంది.
అక్షరాలు పదాలైన సుగంధ తుషార బిందువులు
నేలతల్లికి మా భావాలను నమ్రతతో అర్పిస్తాయి.

✤✤✤✤✤

---

**నికొలాయి క్లైయుయెవ్ (Nikolai Klyuev 1887-1937) -** రైతు కుటుంబంలో జన్మించిన క్లైయుయెవ్ పబ్లిక్ పాఠశాలలో చదువుకున్నాడు. అంతిమ సంస్కారాలప్పుడు విషాద గీతాలనుపాడే రుదాలి, గాయని అతడి తల్లి. అతడికి పదాల పొందికను, గీతాల నిర్మాణాన్ని నేర్పిందంటాడు. 1906లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా కరపత్రాల్ని పంచినందుకు ఆరు నెలలు జైలుశిక్ష ననుభవించాడు. అలెగ్జాండర్ బ్లొక్‌తో పరిచయం ఏర్పడింది. The Pealing of the Pine trees లాంటి కవితా సంపుటాలు వెలువరించినాడు. పట్టణ జీవితానికి, యంత్రాలకు వ్యతిరేకి. అక్టోబరు విప్లవాన్ని సమర్ధించినాడు. ప్రకృతిని జానపద గీతాల శైలిలో వర్ణించినాడు. రైతుల ప్రజల జీవనాన్ని కవిత్వంలో ప్రతిబింబించినాడు.

# 59. ప్రయాణం

**- ఒసిప్ మండెల్‌ష్టమ్ (1917)**

కలశం నుంచి స్వర్ణద్రవం ఏరులా ప్రవహించింది.
నా ఇంటి యజమాని నన్ను హెచ్చరించగలిగింది.
-'ఈ 'తౌరిదా' మైదానంలో మనం కొన్ని అద్భుతాలను చూడవచ్చు'
ఆమె నవ్వుతుంటే ఆ బంగరు కాంతి మరింత ప్రజ్వలించింది.

ఎక్కడ చూసినా బాకస్-అనుయాయులు-మధుపాన ప్రియులే,
కాపలావాళ్లు, వేటకుక్కలు; నిండు పీపాల్లా నెమ్మదిగా పగళ్లు,
దూరంగా, కుటీరంలో వినీ వినబడనట్లున్న గొంతులు,
నీకు తెలుసు వాళ్ల సమాధానాలను ఆశించడం లేదు.

తేనీరు సేవించి మేము తోటలో నడిచాము.
కిటికీ తలుపులపై ఎండ, క్రీగంట చూస్తున్న తెరలు
తెల్లటి స్తంభాల కావల, యోధుల్లా నిలబడిన ద్రాక్ష చెట్లు
ఎక్కడ చూసినా ద్రాక్ష గుత్తుల సుగంధాలు, స్వర్ణకాంతులే!

గదిలో చరఖా వడుకుతున్న గ్రీకు స్త్రీ! హెలెన్ కాదు కదా!
బంగారు ఉన్ని! బంగారు ఉన్నీ! ఎక్కడ నీ ఉనికి?
అలల విధ్వంసక సౌందర్యం మధ్య 'ఒడిస్యూస్' అడుగో!
అతడి పడవ అలసి సొలసి అక్కడ రేవులో ఆగినది.

✤✤✤✤✤

---

**ఒసిప్ మండెలష్టమ్ (Osip Mandelshtam 1891-1938) -** వార్సాలో చర్మశుద్ధి కార్మికుడి కుటుంబంలో జన్మించాడు. సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో హిస్టరీ, ఫైలాలజీ, ప్రాచీన ఫ్రాన్సు చరిత్ర చదివాడు. The Stone (1913), Tristia (1922), Poems (1928) లాంటి కవిత్వ సంపుటాల్ని, The Noise of Time (1925), The Egyptian Stamp (1928), A Journey to Armenia (1933), A talk about Dante లాంటి వచన గ్రంథాలను వ్రాసినాడు. అతడి కవిత్వంలో శిల్పం, సంగీతం, కవిత్వం అసాధారణంగా కనిపిస్తాయి. చరిత్రతో కూడిన అంశాలు కవిత్వానికి సొబగులనిస్తాయి.

# 60. పిలుపు

**- అన్నా అఖ్‌మతోవా (1917)**

నేనొక గొంతు విన్నాను.
అవి నాకు మనశ్శాంతిని వాగ్దానం చేసింది.
-'రష్యాను వదిలి ఇక్కడకు రా!
పాపపంకిలమై, కరుణ రహితమై ఉన్నదానేల!
ఇటు వచ్చేయి! నీ రక్తసిక్త హస్తాలనిక్కడ ప్రక్షాళన చేస్తాను!
నీ హృదయంలో నిండిన చీకటిని తొలగిస్తాను.
అపజయాల్ని, పొరపాట్లను, తద్వారా కలిగిన నెప్పిని
మటుమాయం చేసి నీకు మరోపేరు పెడ్తాను'-
నా చేతులు నెమ్మదిగా, ఖచ్చితంగా పైకి లేచాయి.
ఆ పిలుపు వినబడకుండా నా చెవుల్ని మూసేసాయి.
కన్నీళ్లతో నిండిన ఆత్మను ఆకర్షిస్తున్న దెయ్యపు పిలుపును ఆపివేసాయి.

# ఉడుత

శీతాకాలం మేఘంలా ఉన్న ఓ ఉడుత నావేపు చూసి అన్నది-
ఓ మంచుకన్యా! మార్చి నెలలో నీవు కరిగిపోతావు సుమా!
ఆగిన హృదయ స్పందనను, వేడిని, నేనెలా తిరిగి తీసుకురాగలను?
పగా? ప్రతీకారమా? లేదు! లేదు! జనవరంతా నన్ను ప్రేమించిందా ఉడుత!

*****

---

**అన్నా అఖ్‌మతోవా (Anna Akhmatova 1889-1966) -** నౌకా ఇంజినీరు కుమార్తె. అసలుపేరు గొరెంకొ. సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో హిస్టరి, లిటరేచర్ చదివింది. **1907**లో కవిత్వాన్ని ప్రచురించింది. మొదటి పుస్తకంతోనే రష్యా అంతా ప్రసిద్ధికెక్కినదామె. ఇరవై శతాబ్దపు ప్రముఖ రచయితలలో ఒకరిగా ఆమె ప్రాచీన, నవ్య కవిత్వ ధోరణులను రష్యన్ కవిత్వంలో ప్రదర్శించినది. **1941-1945**లో లెనిన్‌గ్రాడ్‌లో ఉండి దేశభక్తి గీతాలను వ్రాసింది. Evening (1912), Rosary (1914), The Whiteflock (1917), The Plantain (1921), Sixbooks (1940), Poems (1961), The flow of time (1965) ఆమె రచనలు.

# 61. కొత్త వ్యక్తి

**- అలెగ్జాండర్ బ్లోక్ (1906)**

ఫలహారశాలలపై సాయం పవనాలు చిక్కబడ్తున్నాయి.
వసంతకాలపు వాసనలపై తాగుబోతుల కేకలు తేలి వస్తున్నాయి.
దూరంగా నీలాల నింగి దిగువ దుమ్ము కొట్టుకున్న వీధుల్లో
రొట్టెల దుకాణపు దీపాన్ని రెపరెపలాడిస్తున్నట్లు పసిపాప ఆకలి కేక.

గుంటల్లో, కాలువల్లో జంటలు జంటలుగా ముక్కు చేపల షికారు.
చెరువు పక్కన గుడిసె నీడను చెదరగొడ్తూ ఓ స్త్రీ కేక.
తనకిది మామూలే అన్నట్లు తారా సమేత చంద్రుడి నడక.
ప్రతి సాయంకాలం వైను గ్లాసులో ప్రత్యక్షమయ్యేనా ఏకైక మిత్రుడు.

పక్కనే నిద్రకళ్లతో సాకీ! 'పట్టుకురా మధువు' అనే తాగుబోతులు.
కలలోలా ఎదురుగా ఉన్న గవాక్షంలో ఓ యువతి అస్పష్టరూపం.
ఆమె తాగుబోతుల మధ్య నడుస్తూ, ఆ కిటికీ వద్ద కూర్చుంటుంది.
ఎన్నో మరచిపోయిన పాత జ్ఞాపకాలు వెల్లువై ప్రవహిస్తాయి.

తనకత్యంత ఆప్తుల్ని పోగొట్టుకున్నట్లున్న ఆ దుఃఖిత,
పక్కనే ఉన్నాను కదా ఆమె చూపుల ననుసరించాను.
సుదూర తీరాలలో ఉన్న ఓ మంత్ర నగరి చేరుకున్నాను.
ఎవరి సూర్యుడో నా స్వంతమై, మధువు మత్తు వదిలిపోయింది.

ఆస్ట్రిచ్ పక్షి ఈకలు నా మెదడులో నర్తించినాయి.
లోతు తెలవని నీలికళ్లు తీరాన అసంఖ్యాకంగా విరిసాయి.
నా హృదయంలో దాగున్న నిధికి తాళం చెవి దొరికింది.
అవును. నాకు తెలిసింది! ఓ తాగుబోతూ! మధువులో నిజముంది!

# 62. ఆకురాలు కాలం

**- అలెగ్జాండర్ బ్లోక్ (1909)**

నీవూ నేనూ పంటకోసిన పొలాల్లో నడుస్తాము
లేదా, చర్చిలో ఏదో మారుమూల మనసులు విప్పుకుంటాము.
ఆకురాలు కాలం ప్రశాంతంగా ఉంది; కాకుల కేకలు గుంపులుగా,
అప్పుడప్పుడూ ఓ ముసలమ్మ దగ్గు వాటిని బెదరగొడ్తున్నది.

గోధుమ గడ్డి పనలు ఆరబెట్టిన చోట గాలి దుమ్ముతో ఉన్నది.
వలస పోతున్న కొంగలు ఆకాశాన్ని బాణాల్లా ఈదుతున్నవి.
ఏటవాలుగా అవి దూసుకుపోతూ ఏదో విషాద గీతాన్ని ఆలపిస్తున్నవి.
వాటి నాయకుడి గొంతు ఆకురాలు కాలాన్ని ప్రశ్నిస్తున్నది.

ఎటు చూసినా నీ కళ్లముందు పేదల పూరిగుడిసెలు
ఆకాశపు అంచుల దగ్గర జ్వలిస్తున్న చలిమంటలు.
ఓ నా పేద దేశమా! నా హృదయంపై ఏ భారాన్ని మోపుతున్నావు?
ఓ నా ప్రియ నేస్తమా! ఎందుకలా గుండెలవిసేలా దుఃఖిస్తున్నావు?

*****

---

**అలెగ్జాండర్ బ్లోక్ (Alexander Blok 1880-1921) -** బ్లోక్ తండ్రి న్యాయశాస్త్రంలో ఆచార్యుడు. చిన్నప్పుడే తల్లిదండ్రులు విడిపోగా తాత గారింటి వద్ద పెరిగినాడు. తాతగారు (బెకెటోవ్) బొటానిస్టు, సెయింట్ పీటర్స్‌బర్గ్ యూనివర్సిటీ రెక్టార్. అక్కడే బ్లోక్ హిస్టరి, ఫైలాలజీ చదివాడు. Lines about the beautiful lady (1903-1904) అతడి మొదటి పుస్తకం. భావవాదం, ప్రతీకాత్మక వాదాల ప్రభావాన్నుంచి బయటపడి మానవతావాదంపై దృష్టి నిలిపినాడు. The Factory, Unexpected Joy, Snow Covered Land, The field of Kulikovo, Retribution, The garden of Nightingales కవిత్వ పుస్తకాలు; The Puppet Snow, The Rose and the Cross నాటకాలు, అనేక గేయాలు వ్రాసినాడు. అక్టోబరు విప్లవాన్ని సమర్ధించి World Literature Publishing House, Writer's Organisation, Theatre నిర్మాణాలలో ప్రముఖ పాత్ర వహించాడు. The Twelve, Scythians; The intelligensia and the Revolution అనేవి ప్రఖ్యాత రచనలు. అద్భుతమైన లయ, పద విన్యాసంతో బ్లోక్ కవిత్వం చిరస్మరణీయమైనది.

# 63. స్వేచ్ఛ

**- వెలిమిర్ ఖ్లెబ్నికొవ్ (1918)**

స్వేచ్ఛ నగ్నంగావస్తూ మన హృదయాలపై కాంతిపూలను జల్లుతుంది.
ఆమెతో నడుస్తూ మనం స్వర్గంతో సమస్థితిలో మాట్లాడతాము.
సరైన కారణంతో సరైన పథంలో నడిచే యోధులం మనం.
'ప్రజలే పాలకులు, ఎవరికీ తలవంచకు' అంటూ నినదిస్తాం భీకరంగా!
వీరులను పొగుడ్తూ గానం చేసే గాయనీమణులు ఇప్పుడు
అనంత ప్రజాశక్తిని ప్రముఖంగా పొగడెదరు గాక!

............... ............... ...............

ఈ స్వేచ్ఛా సుడిగాలి పవనాల్తో కలిసిరా! మిత్రమా!
హంసల రెక్కలతో అరుణ పతాకను ఎగురవేయి.
అగ్నిజ్వాలల్ని శీతలపరిచే స్వేచ్ఛానేత్రపు ప్రచండశక్తిని చూడు.
మన నూతన వదనాలపై ఆకలి వర్ణాన్ని అలంకరించు!
స్వేచ్ఛాగీతాల్ని పాడుతూ మనం సాగుదాం కలిసిమెలసి.
గాయపడినా తేరుకుంటాం, పోరాటాన్ని కొనసాగిద్దాం!
మన పద ధ్వనులే ఉప్పొంగిన తరంగాల్లా దూరాల నధిగమించి,
దేవుళ్లే ఖైదు చేయబడి ఉంటే, వారికీ స్వేచ్ఛ నిద్దాం!

*****

---

**వెలిమిర్ ఖ్లెబ్నికొవ్ (Velimir Khlebnikov 1885-1922) -** అస్త్రఖాన్ ప్రొవిన్స్‌లో జన్మించిన ఖ్లెబ్నికోవ్ తండ్రి Natural Scientist. A fish pond of Judges అనే Futuristic కవితా సంకలనం 1908లో ప్రచురింపబడింది. Russian Futurist Movement లో ముఖ్యపాత్ర వహించి ఆ వాదానికి budetlyanin (Budet-It will be) అనే పేరు పెట్టినాడు. మొదటి ప్రపంచ యుద్ధంలో రెడ్ ఆర్మీ తరపున ఉత్తర ఇరాన్‌లో సైనికుడిగా పనిచేసినాడు. విప్లవకాలంలో నిజజీవితాలను వర్ణించే ఎన్నో కవితలు వ్రాసినాడు. The Night before the Soviets, The Washer woman అనేవి దీర్ఘకవితలు. విప్లవాన్ని ప్రజల ప్రతీకారంగా, అణచివేతకు సమాధానంగా భావించాడు. ఖ్లెబ్లికోవ్‌ను మయకోవిస్కీ- The Columbus of New Poetic Continents గా అభివర్ణించాడు.

# 64. నీ సంగతేమిటి?

**- వ్లదిమీర్ మయకొవ్‌స్కీ (1913)**

చెంబుడు రంగునీళ్లు జల్లి ఈ గబ్బు ప్రపంచానికి ఉద్వేగం పులిమాను.
జెల్లీ వంటకం మీద ప్రయాణిస్తూ సముద్రపు దవడ ఎముకల్ని ఢీకొన్నాను.
చిన్ని సాల్మన్ చేప పొలుసులపై మూగపెదాల పిలుపును విన్నాను.
కనీసం నీవు, నీటిగొట్టాన్ని వేణువుగా ఊది పాట పాడాల్సింది!

............... ............... ...............

గుర్రపు గిట్టల చప్పుడు
టక్ టకాటక్... టక్...
స్విష్.... హెహేహే....
నూనెమీద జారినట్లు మంచు మరింత...
మాస్కోలో కుజ్నెట్స్కీ వీధి.
ఫాషన్లు మారిపోతుంటాయి క్షణాల్లో...

ముసలిగుర్రం జారి బండి బోల్తాపడింది... తలకిందులుగా!
దారిన పోయేవాళ్లు భళ్లున నవ్వారు.
-'ఇది గుర్రం కాదు హిప్పొపొటామస్'-ఎగతాళి చేసాడొకడు.

నేను గుర్రం కళ్లలోకి చూసాను.
ఆ కన్నీళ్లలో కనిపించింది తలక్రిందులైన ప్రపంచం.
నేనన్నాను గుర్రంతో- 'మేమూ అప్పుడప్పుడూ గుర్రాలమే!
మాకంటే నీవే మెరుగు'-
గుర్రానికి నా మాటలు నచ్చాయో, లేదో కాని
అది లేచి నిలబడింది. బండి గమ్యస్థానం చేరింది.
ఆ తర్వాత రెండేళ్లు బతికింది- రేసుగుర్రంలా - చాలదా!

*****

# 65. కవాతు

**- వ్లదిమీర్ మయకోవ్‌స్కీ (1917)**

వీరుల నినాదాలతో వీధులు మార్మోగాలి!
అహంకారపు శిరసుల చెవులనవి తాకాలి!
ఈ ప్రపంచాన్ని కడిగేస్తాం రెండవ జల ప్రళయంతో.
వాళ్ల భయంతో వణికే క్షణం రానే వచ్చింది.

ఏళ్లకొద్ది ఎడ్లబండి నెమ్మదిగా నడిచింది.
వేగమే మా దేవత, యుద్ధభేరి మా నేత!
పాటలు మా ఆయుధాలు, శస్త్రాస్త్ర సన్నిధాలు.
మా స్వరాలు స్వర్ణతుల్యాలు, అగ్ని జ్వాలానిర్మితాలు.

పచ్చిక మైదానం మా నేల! సమృద్ధిగా ఫలపుష్పాలు
మా కాలరథపు గుర్రాలకు ఇంద్రధనుసు వర్ణాలు.
అంతరిక్షపు పాలపుంత, తలవంచును మా పాట చెంత
సప్తర్షిమండలం మ్రోగించును విజయ ఢంకా మరింత!

ఆనందపు గేయాలతో వసంతాన్ని గ్రోలుదాం!
హృదయము ఢమరుకమై తాండవ నాట్యమాడుదాం!

✤✤✤✤✤

---

**వ్లదిమీర్ మయకొవ్‌స్కీ (Vladimir Mayakovsky 1893-1930) -** అటవీ రక్షకాధికారి కుటుంబంలో జార్జియాలోని బాగ్దాది గ్రామంలో జన్మించాడు. పదిహేనేళ్ల వయసులోనే RSDLP (B) లో చేరి ప్రచార బాధ్యతలు నిర్వహించినాడు. మూడుసార్లు అరెస్టు చేయబడి జైల్లో ఉన్నాడు. 1912లో క్యూబా-ఫ్యూచరిస్టు వర్గంలో చేరినాడు. Night, The Cloud in pants, The Flute - back bone war and peace, Vladimir Mayakovsky ప్రసిద్ధికెక్కిన కవితలు Cloud in Pants లో అతడు ప్రవచించిన విప్లవం, అక్టోబరు 1917 విప్లవంతో సాకారమయ్యింది. 1924లో లెనిన్; 1927లో ఫైన్ కవితలను 'October Cast in Bronze'గా ల్యూనాఛార్స్కీ పొగిడినాడు. Aloud and Straight (స్పష్టంగా, సూటిగా) అనేది చాలా పేరొందిన కవిత. సోవియట్ కవిత్వాన్ని ప్రభావితం చేసిన కవిగా మయకోవ్‌స్కీ ఎంతో ప్రసిద్ధికెక్కినాడు. 'I hail my country as it is, but thrice as it will be' - దేశభక్తుడిగా, కవిత్వ రచనలో నూతన పోకడలను తొక్కినవాడిగా మయకోవ్‌స్కీ ధన్యుడైనాడు.

# 66. స్పష్టంగా, సూటిగా...

- వ్లదిమీర్ మయకోవ్‌స్కీ (1930)

**(పంచవర్ష ప్రణాళికకు ముందుమాట)**

గౌరవనీయులైన కామ్రేడ్స్!
ఇన్నేళ్లుగా పేరుకున్న కుళ్లూ, కశ్మలాన్ని తొలగిస్తూ,
మనల్ని ఖైదు చేసిన అంధకారాన్ని శోధిస్తూ,
నన్ను మీరు అడగవచ్చు...
మీలో ఎవరైనా శాస్త్రవేత్త ప్రశ్నించవచ్చు-

-"పాండిత్యం, ఆసక్తి నోరు మూస్తుంది కదా అని!
కాగబెట్టిన నీటికి, మామూలు నీటికి తేడా లేదా అని!"-

ఆచార్యా! మీ దృష్టి చక్రానికో నమస్కారం!'
నేనే ఈ అంశాన్ని తమతో ప్రస్తావిస్తాను.

అవును ఆర్యా!
నేను కూడా అక్టోబరు పిలుపులో
బురదను తొలగించి, నీటిని సరఫరా చేసాను.
కవిత్వపు తోటలోంచి యుద్ధప్రాంగణంలోకి వెళ్లాను.
తిండీ, గుడ్డా, నీడా; తోటలు, పిల్లలు, నీళ్లూ
అబ్బో! ఎంత అందమో!
ఫాన్సీ-నాన్సీ పాతిందొక ఆర్కిడ్ పూలమొక్కను,
మంచిగా నీళ్లుపోసి పోషించెను!
కొందరు ఎకరాల కొద్దీ కవిత్వాలు పూస్తారు.
కొందరు గోరంత వ్రాసి గోలపెడ్తారు.

మిత్రికిన్ వంకీలు, కుద్రికొ డింకీలు
వాళ్లనే అడుగు అవేమిటో!
దాన్ని ఆపడానికి దారేదో అడుగు!
ఎక్కడ విశ్రమిస్తారో దేవుడికే తెలుసు!

తార... రా... తినా... నా... తార...రా...తినా...నా...
తెన్....న్... సస....రిరి....గగ...
సరిగా పదమని నేనంటే ఊరుకుంటారా?

నగరపు నడిబొడ్డున, కూడళ్లలో,
వేశ్యలు, రౌడీలు తిరిగే మహత్తర ప్రదేశాలలో
వాళ్ల గులాబీల మధ్య నా శిల్పాన్ని ఉండనిస్తారా?
క్షయ విత్తుల మధ్య ఉద్వేగప్రచారాలు
నరకాగ్ని చిటపటల్లా-

నేనూ ప్రేమగీతాలు రాయగలను
పొట్టా, పర్సూ నిండుతాయి. కాని, నేను
వాటి పీకల మీద కాలేసి తొక్కుతాను.

మిత్రులారా! వినండి!
విప్లవకారుడు మండే అగ్నిశలాక
కవిత్వాలంకారాల్ని నేనా ఛందోశాస్త్రజ్ఞుల మీదకు
విసిరికొట్టి, కమ్యూనిజంలోకి 'ఏసినిన్' సృష్టిలా ప్రవేశిస్తాను.

నా కవిత్వం మూఢ కవుల, ప్రభుత్వాల తలలపై ఎగిరి-
మన్మధుడి భాణాల్లా కాదు,
నాణేలు పోగు చేసేవాళ్ల ప్రదర్శనలా కానే కాదు,
ఎన్నడో నశించిన తారా కిరణాల్లా కాదు,

నా కవిత్వం దుర్గమ పర్వతారణ్యాలను దాటి
శక్తివంతంగా, స్పష్టంగా, సాధికారంగా మీకు కానవస్తుంది.

రోమన్ బానిసలు నిర్మించిన నీటి కాలువల్లా
గ్రంధాల పాటిదిబ్బలను తొలిచి
మీ హస్తాలకు, మనసుకు అందుతుంది.
పాత ఆయుధాల్లా మీకవి హస్త భూషణాలవుతాయి.
అవి గురితప్పవు.
నా మాటలు మీ చెవులను ముద్దాడవు.
సగం సిగ్గుతో మీ చెవిదొప్పలు ఎర్రబడతాయి.

చూడండి!

నా వాక్యాలు ఎంత ప్రశాంతంగా, ఎంత ధీమాగా,
ఎంత ఆత్మవిశ్వాసంతో కవాతు చేస్తున్నాయో!

చిన్నిచిన్ని పదాలు చచ్చి, చావని కీర్తికై నిలుచున్నాయి.
పెద్దపెద్ద వాక్యాలు లక్ష్యఛేదనకు సంసిద్ధమైనాయి.

ఆయుధాలెట్లా ఉండాలంటే, అనుకున్న క్షణాన
అరచేతిలోకి వచ్చి, శత్రువును చావుదెబ్బ గొట్టాలి.

కొరడాలా 'ఛెళ్'మని నవనాడుల్ని తెంపాలి.
వాయువేగాన పోయే అశ్వికదళాన్ని
ఇరవై ఏళ్లు విజయపథాన నిలిచిన వీరుల సమూహాల్ని
నేను పీడిత ప్రజలకిస్తున్నాను.

శత్రువు శ్రామికుల దారిలో మందుపాతర
మనందరం అస్యహించుకున్న వెట్టి జాతర,
ఎర్రజండాల మధ్య మనం ఆహారానికి శ్రమిద్దాం.
మార్క్స్ పుస్తకాల్ని తెరచి మన ఇళ్లలో కాంతి నింపుదాం.

అవి చదవకపోయినా మనకు మన గమ్యం తెలుసు,
హెగెల్స్ మోసపు ఎత్తుగడలు కావు మనవి.
యుద్ధభీభత్సం మన కవిత్వపు ప్రధానాంశం.
ఒకప్పుడు వాళ్ల బుల్లెట్లకు మనం తలవంచాం!
ఇప్పుడు మరింత శక్తివంతమైన బుల్లెట్లతో వాళ్ల తలలు తుంచుదాం!

పేరు ప్రఖ్యాతి అనే విధవరాలు
తెలివితేటల సమాధిపై కన్నీరు కార్చనీ!
నా కవిత్వం, వాక్యం తర్వాత వాక్యం
మన కామ్రేడ్లలా ఒక్కటొక్కటే నేలకూలనీ!
ఊరూ పేరూ లేని చోట మనం నశించినా
ఏ తామ్రఫలకాలకో నేనాశపడను!
ఏ చలువరాతి సమాధినో నే కోరుకోను!

మనందరం మిత్రులం! కామ్రేడ్స్!
కీర్తిని పంచుకుందాం!
తరతరాలకు మన సాహసాల్ని సందేశాలుగా అందిద్దాం!
సోషలిజం వ్యవస్థలో అందరూ భాగస్వాములే!

మిత్రులారా! నిఘంటు పుటలు తెరవండి!
'లెథె' బాధల నదిలో ఈదే చేపలు
-'వ్యభిచారం, క్షయ, ముట్టడి'-
ఇనుప ముడులున్న నీ గట్టితనాన్ని మరింత గట్టిపరచుకో!
ఎవడో ఒక కవి క్షయ విత్తుల్ని మింగేసాడు.
అతడి గరకు నాలుక గోడపత్రిక.
చరిత్ర కళ్లతో చూస్తే నేనొక రాక్షసబల్లిని.

మిత్రులారా! కామ్రేడ్స్!

ఈ పంచవర్ష ప్రణాళికలో పంచకళ్యాణిలా పరిగెడ్దాం!
కవిత్వంతో నేను ఒక్క రూబుల్ సంపాదించలేదు...
ఏ దేవదారు భోషాణాన్ని కొనబోవడం లేదు,
ఒక జత ఉతికిన అంగీలు చాలు నాకు,

కవుల, మోసగాళ్ల శిథిలాలపై నిలబడి
కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీ సమావేశంలో
నా వందలాది పుస్తకాలొక మెట్టుగా
నక్షత్ర సహిత అరుణ పతాకను చేతబూని నిలబడతాను.

*****

# 67. కామ్రేడ్ లెనిన్‌తో సంభాషణ

**- వ్లదిమీర్ మయకోవ్‌స్కీ (1929)**

సంఘటనల సుడిగాలులు
        అసంఖ్యాక పని ఒత్తిడులు
పగలు గతించి నెమ్మదిగా
        పరచుకున్న రాత్రినీడలు.
ఇద్దరమే ఆ గదిలో
        నేను
        లెనిన్
ఒక ఫోటో
        తెల్లగా విస్తరించిన సున్నపురోడ్‌పై!
సిగరెట్ ముక్క పైకి కదిలి
        అతడి పెదవి
అతడి నోటి నుంచి
        వెలువడనున్న పదాలు
        సాగిన
కనుబొమల ముడతలు
        ఆలోచనను
                తమ పిడికిలిలో పట్టుకున్నాయి.
విశాలమైన ఫాలభాగానికి
        విస్తరించిన మరింత లోతైన ఆలోచన
పతాకల అరణ్యం
        దట్టమైన అడవిలా చేతులెత్తినాయి.
వేలాదిమంది నడుస్తున్నారు
        అతడి నాయకత్వంలో
                ఇనుమడించిన

ఆనందంతో......
నేనున్న చోటు నుంచి లేచి నిలబడినాను
అతడిని చూద్దామని
జేజేలు పలుకుదామని
అతడికి వార్తలందిద్దామని.
"కామ్రేడ్ లెనిన్,
ఇది నా రిపోర్టు.
అధికారికమైనది కాదు.
నా హృదయగతమైనది.
ఈ నరకలోకపు చాకిరి
మనం చేద్దామనుకున్నది.
మనం చేస్తాం.
ఇప్పటికే చాలా చేసాం!
మనం ఇస్తున్నం కాంతిని, వస్త్రాల్ని
నిరుపేదలకు, నగ్నంగా ఉన్నవాళ్లకు?
పంపకాలు
బొగ్గు
ఇనుము
పూర్తైనాయి.
అక్కడ కూడా
కొంత మొత్తం
రక్తం
చెత్త
చెదారం
మన చుట్టూరా ఉన్నది.

నీవు లేకపోయేసరికి
చాలామంది
చేయి దాటిపోయారు.
అనేక ఘర్షణలు
గొడవలు
అంతర్గతంగా
వాటిని
గణించి
నిర్మూలించాలి,
అన్నిరకాల
దట్టంగా
ముళ్లపొదలు
కులక్‌లు,
రెడ్ టేపిస్టులు,
అడుగున ఉన్నవాళ్లు,
తాగుబోతులు
విభజనవాదులు
అడుక్కునేవాళ్లు
ఎక్కడబడితే అక్కడ
నెమళ్లలా
గర్వంగా తిరుగుతున్నారు.
రకరకాల కలాలు, గౌరవ చిహ్నాలు
వారి రొమ్ముల నలంకరించాయి.
వాళ్లందరినీ అణచివేద్దాం.
అయితే,
వాళ్లని అణచివేయడం

అంత తేలిక కాదు,
కాని, మనదే విజయం.
మంచు మైదానాలలో
బీడు భూముల్లో
పరిశ్రమలలో
కర్మాగారాలలో
నీవు మా హృదయంలో!
కామ్రేడ్ లెనిన్!
మేం నిర్మిస్తాం.
మా ఆలోచన
మా ఊపిరి
మా బతుకు
మా పోరాటం.
సంఘటనల సుడిగాలులు,
అసంఖ్యాక పని ఒత్తిడులు
పగలు నెమ్మదిగా గతించి
పరచుకున్న రాత్రి నీడలు.
ఇద్దరమే ఆ గదిలో
నేను
లెనిన్......
ఒక ఫోటో
తెల్లగా విస్తరించిన సున్నపుగోడపై!

**(కామ్రేడ్ వ్లదిమీర్ లెనిన్ 22-4-1870 - 21-1-1924)**

✤✤✤✤✤

# 68. 'ప్రావ్దా' పతాకం కింద

- దెమ్యాన్ బెద్నీ (1920)

కర్షకులారా!
శ్రామికులారా! ఏకం కండి!
మీ బలమైన చేతుల్లోనే మీ విధి పదిలంగా ఉన్నది.
ప్రభువులు, యజమానులకిక తావేలేదు.

బానిసత్వం నిషేధించబడినది సంపూర్తిగా!
శత్రువు ఎత్తుగడలిక ఫలించవు.
మీ శక్తినతడు ఎదుర్కోలేడు.
మొక్కవోని ధైర్యంతో, నిరసనలను నిర్మూలించి
ఒకే బాటలో నడవండి! శ్రామికులారా! ఏకంకండి!

శత్రువు మిమ్మల్ని లొంగదీయలేడు. సందేహాలిక వద్దు.
మీతో కలవని వాడే మిమ్మల్ని మోసం చేయగలడు.
తెగిన సంకెళ్లను తిరిగి తేవద్దు.
మీ దారి రహదారి! మీ నాయకుడు 'ఊళ' వెయ్యడు.

కాపాడుకోండి మీ స్వేచ్ఛా శ్రమలను దోపిడి నుంచి;
మీతో ఉన్నారు నాయకులు ఉక్కుపిడికిలి బిగించి!
ఎగురుతోంది అరుణ పతాక! సర్వకాలాల కరదీపిక!
అన్ని పతాకలను త్రోసిరాజనే ఎరుపు కాంతి రేఖ.

ఒకే జ్వాల శ్రామికుల హృదయాలలో
ఒకే కోరిక వారి మనసులో, మాటలో
ఎగరాలి, ఎగరాలి, ప్రావ్దా పతాక!
మనల్ని నడిపించే మహోన్నత భూమిక!

✣✣✣✣✣

---

**దెమ్యాన్ బెద్నీ (Demyan Bedny 1883-1945) -** నిరుపేద రైతుకుంటుంబంలో పుట్టిన బెద్నీ అసలుపేరు యెఫిమ్ ప్రిద్వోరోవ్. కీవ్ మిలిటరీ మెడికల్ స్కూల్ నుంచి గ్రాడ్యుయేషన్ చేసినాడు. 1912లో RSDLP (B) లో చేరి జ్వెజ్దా, ప్రావ్దాల బొల్షివిక్ ప్రెస్‌లో పని చేసినాడు. నియంతృత్వాన్ని, కులక్‌లను, భూస్వాములను, ఫ్యాక్టరీ యజమానులను, ప్రీస్టులను, ప్రభుత్వంలో బూర్జువా ధోరణులున్న మంత్రులను నిశితంగా విమర్శించినాడు. అతడి వ్యాఖ్యలను ఆరోజుల్లో ప్రతి ఒక్కరూ చదివేవారు. రైతుల, ఎర్రసైన్యపు సిబ్బంది జేబుల్లో రొట్టె, టొబాకొతో పాటు ఈ పాంప్లెంట్లుండేవట (కరపత్రాలు). బెద్ని అంటే పేదవాడు అని అర్థం.

# 69. సోవియట్ రస్

**- సెర్గి ఎసినిన్ (1924)**

తుఫాను తీరాన్ని తాకి తొలగింది. పాత స్నేహితులికలేరు.
ఎనిమిదేళ్లకు నేను వచ్చేసరికి నా ఊళ్లో నన్నెవరూ గుర్తుపట్టలేదు.
ఎవరిని పిలువను? ఎవరితో నా సంతోష విషాదాల్ని పంచుకోను?
ఎప్పుడూ తిరిగే పాత గాలిమర కూడా ఒక రెక్క వదులై నిద్రిస్తున్నది.

ఇక్కడ నేనొక అపరిచితుడిని. నా ఇల్లొక శిథిలాల గుట్ట.
నా చుట్టూ ఎందరో ఉన్నా, నన్ను సాదరంగా ఆహ్వానించేవారేరి?
నాలో ఎన్నో ఆలోచనలు. అసలు, ఇల్లంటే ఏమిటి? స్వప్నమా!
చాలామందికి నేను ఎక్కడ నుంచో ఊడిపడిన తీర్థయాత్రికుడిని.

అవునూ! ఇంతకీ నేనెవర్ని? ఈ ఊరికి నాకూ సంబంధమేమిటి?
నా తల్లి నన్నిక్కడ కన్నది, ఓ సంచార గాయకుడికి!
నా హృదయం పలికింది తీవ్రంగా- 'ఎందుకు నీకీ బాధ?
నీ తరం ముగిసింది. ఇది మరో తరపు నూతన శోభ!'

వాళ్లకు ఊరు కాదు, ప్రపంచమే మాతృభూమి.
వాళ్ల భాష నాకు అర్థం కాదు, నా స్వంత ఊళ్లో నేను పరదేశిని.
గ్రామస్థులిప్పుడు చర్చికన్నా, రాజకీయాలను చర్చిస్తున్నారు.
సూర్యుడస్తమించాడు. ఏదో తప్పు చేసినవాడిలా నిష్క్రమించాడు.

బయట బూరుగుచెట్లు బురదలో దిగబడ్డ కోడెదూడల్లా ఉన్నాయి.
ఎర్ర సైనికుడొకడు కుంటుతూ జనాలకు యుద్ధగాథలను వినిపిస్తున్నాడు.
మేపుల్ చెట్ల ఆకుల నీడలో మహిళలు ఆశ్చర్యపోతున్నారు.
రైతుకూలీలు 'దెమ్యాన్ బెద్నీ' పాటల్ని పాడుతూ వస్తున్నారు.

అదే రష్యా అంటే! ప్రజలతో నా పరిచయాన్ని చెప్పేవాణ్ణి గొప్పగా!
ఇప్పుడిక్కడ ఎవరికీ నా పద్యాలవసరం లేదు.
నా ఇల్లు బాగోనప్పుడు నేను పాటలు పాడాను, బాగు చేసాను.
ఇప్పుడు మే, అక్టోబరు నెలలో ప్రతిజ్ఞలు చేస్తున్నాను.

అయితే నా వీణ నెవ్వరికీ ఇవ్వను.
నా భార్యకు, స్నేహితుడికి, మా అమ్మకు కూడా!
ఆ సంగీతం, పాటలు నాకే స్వంతం.
యువ కవులారా! మీరు కొత్త పాటలు పాడండి!

ఏ దూర తీరాలకో పోయి ఒంటరిగా జీవిస్తాను.
ప్రపంచ ప్రజల మధ్య వైషమ్యాలు తొలగి
విధ్వంసం, దుఃఖం శాశ్వతంగా నిష్క్రమించినా
ఈ ప్రపంచంలో ఆరోవంతుండే రష్యాను ఘనంగా కీర్తిస్తాను.

✤✤✤✤✤

---

**సెర్జి ఎసినిన్ (Sergei Esenin 1895-1925) -** రైతు కుమారుడు. ధనవంతుడైన తాతగారి వద్ద పెరిగాడు. తాతగారికి మత సాహిత్యమంటే ఇష్టం. **1912**లో మాస్కోలో ప్రింటింగ్ ప్రెస్‌లో పనిచేస్తూనే కవిత్వం వ్రాసినాడు. **1915**లో పెట్రొ గ్రాడ్‌లో ఉన్నపుడు Blok, Gorodetsky, Klyuev కవులతో పరిచయమేర్పడింది. అతడి మొదటి పుస్తకం Radunitsa (1916) **1918**లో మాస్కోలో Imaginists Group వ్యవస్థాపకులలో ఒకడైనాడు. జర్మనీ, ఫ్రాన్స్, ఇటలీ, బెల్జియం, కెనడా, అమెరికాలలో **(1922-23)** పర్యటించినాడు. అమెరికన్ డాన్సర్ ఇసడొరా డంకన్ అతడి భార్య. కమ్యూనిజాన్ని, మాతృభూమిని ఇష్టపడి కవిత్వం వ్రాసి పేరు గడించినాడు.

## 70. శీతాకాలం

**- బోరిస్ పాస్టర్‌నాక్ (1941)**

ఎండుటాకులు రాలిపడే జీవం లేని ఋతువు ఇది
ఆఖరి అడవి బాతుల గుంపు ఆకాశంలో అదృశ్యమైనది.
చింతించనవసరం లేదు, ఎందుకంటే భయానికి పెద్ద కళ్లు.
గాలి, నిద్రపోతున్న ఆకుల్ని వణికిస్తున్నది, కాని, కథ సుఖాంతమే!

దీర్ఘ నిద్ర నుంచి రేపు మేలుకుంటావు.
ఘనీభవించిన తెల్లదనం మీద నడుస్తూ కాసేపు నిలబడతావు.
గాలిలో తేలివస్తున్న దూదిమంచు
క్రిస్మస్ తాత, చిమ్నీలు, ఇంటిపైకప్పు; మారువేషంలో అరణ్యాలు.

పొంచి ఉన్న నక్కలా కళ్లదాకా లాక్కున్న ఉన్ని టోపీ.
నడుస్తూ, నడుస్తూ నీవొక గల్లీ వద్దకు చేరుకుంటావు.
మంచు భవనం ముందు చెక్క పందిరి కనిపిస్తుంది.
కాస్త దూరంగా దారి పక్కన లాడ్జి, కొన్ని చెట్లు, మంచుతెర!

శవపేటికలో, నిద్రిస్తున్న రాకుమారిని వర్ణించే నాలుగు పంక్తుల పద్యంలా
నాలుగు స్తంభాలపై నగిషీలు చెక్కిన దారు నిర్మిత వసారా!
ఈ మృతశ్వేత రాజ్యం ఎవర్నైనా వణికిస్తుంది లోలోపల.
నేననుకున్నాను- 'కృతజ్ఞతలు. నేనడిగిన దానికన్నా ఇచ్చావు ఎక్కువగా!'

✤✤✤✤✤

---

**బోరిస్ పాస్టర్‌నాక్ (Boris Pasternak 1890-1960) -** మాస్కోలో చిత్రకారుడు, అధ్యాపకుడైన లియొనిడ్ పాస్టర్‌నాక్ కుమారుడు. ఫిలాసఫీలో ఉన్నత విద్యాభ్యాసం చేసి ఫ్లోరెన్స్, వెనిస్‌లు సందర్శించాడు. స్క్రైలాబిన్ సంగీతానికి ఆకర్షితుడై ఆరేళ్లపాటు సంగీతాన్ని నేర్చుకున్నాడు. 'My Sister Life' అనేది అద్భుత గేయ సంపుటి. దానితో అతడు ఆ కాలంలో ప్రసిద్ధ రచయితగా పేరు తెచ్చుకున్నాడు. 1915-1917లో ఊరల్ ప్రాంతంలో రసాయన కర్మాగారాల్లో,

# 71. భూమి

**- బోరిస్ పాస్టర్‌నాక్ (1947)**

ఏ ఆర్భాటాలూ లేకుండా వచ్చింది వసంతకాలం మాస్కో గృహాల్లోకి,
చిన్నిచిన్ని రెక్కల పురుగులు దాచిన కోట్లు, టోపీలపై ఎగుర్తున్నాయి.
వసారాల అంచుల వద్ద పేర్చిన పూలకుండీల్లో పూలు వికసించాయి.
గదులలో స్వేచ్ఛా గంధం, అటకపై పేరుకున్న దుమ్ము, నిశ్శబ్దం.

వీధులు, అరమూసిన గవాక్షాలతో చేసుకున్నవేదో రహస్య ఒప్పందం.
మసక చీకటి, తొలి వేకువ ఏటి పక్కన సమాగమం.
ఈ దారి నుంచి నీవు గ్రహించవచ్చు మైదానంలో శబ్దాలను,
ఏప్రిల్ మాసంలో మంచు కరిగే క్షణాల్ని, మనసు కరిగే దృశ్యాల్నీ.

అంతేకాదు ఏప్రిల్ నెలంటే వేయి మానవ వ్యధలూ, కథలే కదా
సాయంకాలమయ్యేసరికి తగ్గిన వెలుగులో ఏదో దుఃఖగాధ.
పొయ్యి వెచ్చదనంతో ఇల్లు సౌఖ్యమే, కాని, గాలికి ఊపిరాడదు.
అవే విల్లో కొమ్మలు, మంచుముద్దలు, కిటికీలలో, వీధుల్లో!

ఎందుకు మంచుకీ దుఃఖం? ఈ శిధిలపు వాసనకేమిటర్థం!
దూరాలు దుఃఖించవు. పట్టణ సరిహద్దుల కావల నేల ఒంటరి కాదు.
అందుకే వసంతకాలం రాగానే నేను వీడ్కోలు విందుల నిస్తాను.
ఘనీభవించిన ఉనికిని బాధల వేడి కరిగిస్తుందని!

✤✤✤✤✤

1917 తరువాత Peoples Commissariate of Education లో పనిచేసాడు. 1920లో మయకొవ్‌స్కీ స్థాపించిన LEF లిటరరీ గ్రూపులో చేరినాడు. Lieutenant Schmidt, Second birth చాలా ప్రసిద్ధికెక్కిన పుస్తకాలు. 1941-45లో Great Patriotic War లో Front line correspondent గా పనిచేసాడు. కవి, రచయిత, అనువాదకుడు (జార్జియా కవుల రచనలు, షేక్స్పియర్ ట్రాజెడీలు, ఫాస్ట్) గా రష్యన్ సాహిత్యంలో చిరస్థాయిగా నిలిచిపోయినాడు.

# 72. నీలి కోటు హుస్సార్‌లు

- నికొలాయి అసియెవ్ (1927)

**1**

దెబ్బతిన్న ఎలుగ్గొడ్డులా మంచు కొరుకుతోంది.
ఫొంటాంకా మంచువాలులపై బళ్లు దూసుకుపోతున్నాయి.
అతివేగంతో వాళ్లు మంచు దాడినధిగమిస్తున్నారు.
ఎవరి గొంతులవి హెచ్చుతగ్గులతో ప్రతిధ్వనిస్తున్నవి?

మిత్రుడా! గుండెపై చేయి ఉంచుకుని బ్రతిమాలుతున్నాను నిన్ను.
కత్తి దూయకు. అది ముప్పు తెస్తుందని గ్రహించు.
మహా శక్తిముందు నీవు తిరగబడాలనుకుంటే,
నీ కోసం కాకపోయినా, నీవాళ్ల కోసం కాస్త ఆలోచించు.

**2**

మంచును చెల్లాచెదురు చేస్తూ తెల్లటి గిట్టలు.
ఎగుర్తున్న మంచుబండి నీడ నల్లగా మెరుస్తోంది.
'మిత్రమా! విను! ఉరితాడు బిగిసాక భయముండదు.
బానిసత్వంలో ముసలాడిగా చచ్చేకన్నా వీరమరణం గొప్పది.
కత్తికి కత్తి! స్వేచ్ఛ మనకు లభించే బహుమతి!'

**3**

యువ పెదాలు, నీలికోటు హుస్సార్‌లవి, పదాలు పలుకుతున్నవి.
ఎవరికీ లొంగని వీరు ఎక్కడ సమావేశమైనారు?
మినుకు మినుకు దీపాల చీకట్లలో వైను గ్లాసులు తళుక్కుమన్నవి.
మన దక్షిణ దేశపు సోదరులకు జయం! మనదే విజయం!

**4**

గిటారు ధ్వనుల్లా మాటలు కోటలైనాయి.
వారికి భయం లేదు, వాళ్లు కోల్పోయేదేమీ లేదు.
ఛాంపేన్ బుడగల్లా ఉద్వేగాలుప్పొంగినాయి.
పుష్కిన్ 'జిప్సీ'ల కావ్యం మరచిపోయినారు.

మంచువాలులపై బళ్లు ఇళ్లకు మళ్లినాయి.
రాజభవనాల్ని వెక్కిరించే గొంతులు వేడెక్కినాయి.
ఇక మాటలతో పనిలేదు, గుర్రాలపై దూసుకుపోవడమే
ఉదయాన తూర్పున తిరుగుబాటు బాటలోన.

**5**

ఈ నేల నలుచెరగులా వినిపించే పాట ఏది?
అరచేతుల్లో ముఖాన్ని దాచుకున్న కారణమేది?
గిటారు ధ్వనులెందుకు విషాదాన్ని వర్షించెను?
నీలికోటు హుస్సార్ దళం మంచు కింద నిదురించెను.

❖❖❖❖❖

---

**నికొలాయి అసెయెవ్ (Nikolai Aseyev 1889-1963) -** ఇన్సూరెన్సు ఏజంటు కుమారుడైన అసెయెవ్, మాస్కో విశ్వవిద్యాలయంలో చదువుకున్నాడు. 1914లో మొదటి కవిత్వ పుస్తకం 'The Night Time Flute' ప్రచురితమైంది. 1914లో మొదటి ప్రపంచ యుద్ధంలో పాల్గొన్నాడు. 1917లో Soviet of Soldiers deputies గా ఎన్నికైనాడు. 1922లో మాస్కో వచ్చినాడు. మయకోవ్స్కీ LEF లో ముఖ్య సభ్యుడైనాడు. పదాలలో స్పష్టత, నూతన పదాల సృష్టి, లయ, యతి, స్వేచ్ఛ, కొత్తదనం, శిల్పం, విప్లవభావాల పొందికతో ఇతడి కవిత్వం రమణీయంగా ఉంటుంది. The Steel Nightingale, Storm in Sverdlovsk, Semyon Prosakov, A Russian Tale, Mayakovsky Begins ఇతడి ప్రసిద్ధ రచనలు. అద్భుత గేయమైన Cadences ఇతడి రచనలలో మణిపూస లాంటిది.

# 73. కొత్త పదాలు

**- నికొలాయి టిఖొనోవ్ (1921)**

అగ్ని, తాడు, బుల్లెట్, గొడ్డలి
సేవకుల్లా మనకూడా ప్రయాణిస్తాయి.
అవి పడిన ప్రతిచోటా విధ్వంసం పలకరిస్తుంది.
మహా పర్వతాలు తమ శిఖరాల్ని గులకరాళ్లలో దాచుకుంటాయి.
ఉక్కు పాదాల కింద నలిగిన ప్రతి తీగె చప్పుడుకూ
మహారణ్యాలు భయంతో కంపిస్తాయి.

అన్యాయం మనతో పాటు విందు గుడిచింది.
చర్చి గంటలు యధాలాపంగా మోగీ మోగనట్లున్నాయి.
నాణెములు తమ నాణ్యతను పోగొట్టుకున్నాయి.
శవాల్ని చూసి పిల్లలు భయపడడం లేదు.
మనం కొత్తపదాల్ని నేర్చుకున్నట్లున్నాము.
చేదు పదాలు, అందమైనవి, క్రూరమైనవి...

................ ................ ................

మనం దానధర్మాలనే పదాలు మర్చిపోయాం,
ఇంత రాగి గొట్టానికి బంగారపు ముద్దల్నిస్తున్నాం.
ఓడలిటు రావు. రైళ్లు ఎప్పుడో ఒకసారి
జనాన్ని పేరుబెట్టి పిలువు, చచ్చినవాళ్లు లేచివస్తారా?
విరిగిన కత్తుల్ని పారేసినట్లు వాళ్లను విసిరేద్దాం.
మన జీవన చరిత్ర పుస్తకంలో శాశ్వత పేజీలను కత్తిరిద్దాం.

✤✤✤✤✤

---

**నికొలాయ్ టిఖొనోవ్ (Nikolai Tikhnov 1867-1979) -** సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో శిల్పకారుల కుటుంబంలో జన్మించినాడు. తొలి ప్రపంచయుద్ధంలో హుస్సార్ దళంలో ప్రైవేట్‌గా పనిచేసాడు. 1918లో రెడ్ ఆర్మీలో వాలంటీర్‌గా యుద్ధలంలో పాల్గొన్నాడు. The Horde and Exhilaration (1922) అతడి మొదటి పుస్తకం. అంతులేని శక్తి, జానపద గేయాల ప్రవాహం అతడి కవిత్వం. వీరోచిత గాధలు, వేగంగా నడిచే కథ, అద్భుత శిల్పం అతడి

# 74. గోళ్ల పాట

**- నికొలాయి టిఖొనోవ్ (1922)**

నింపాదిగా అతడు పైపు కాల్చడం ముగించాడు.
మరింత నింపాదిగా ముఖంపై చిరునవ్వు తుడుచుకున్నాడు.
కంపెనీ! అటెన్షన్! ఆఫీసర్స్, ఇన్‌ఫ్రంట్!
చిన్నిచిన్ని అడుగులు వేస్తూ కమాండర్ వచ్చినాడు!

అందరూ క్రమపద్ధతిలో గంభీరంగా నిలబడ్డారు.
-'ఉదయానే ఎనిమిది గంటలకు, తూర్పు దిక్కు ప్రయాణం!

భార్యా, బిడ్డలు, సోదరుడుంటే, వ్రాయండి ఉత్తరం.
మరలా వెనక్కి రాబోవడం లేదు మనం.
అయితే మన శత్రువును చావుదెబ్బ కొడతాం!
వాడి తోలు తీసి ఆరబెడ్దాం!'- ఆయ్! కెప్టెన్! ఆయ్!

దళంలో అందరికన్నా చిన్నవాడు, మహా ధైర్యస్తుడు.
ఒక్క క్షణం సూర్యుడిని, మెరిసే అలల్ని చూసాడు.
-'ఎక్కడికైతే ఏం? సముద్రం వేపైతే మరీ మంచిది.
అంత ప్రశాంతమైన ప్రదేశం మరొహటి ఉండదు'-

మరుసటి రోజు ఉదయం, అడ్మిరల్‌కో సందేశం
పని పూర్తయ్యింది. ఒక్కడు మిగల్లేదు. మనదే విజయం!
అటువంటి వీరుల చేతి గోళ్లను చూసావూ!
ప్రపంచంలో ఏదీ వాటి వాడికి ఎదురు నిలబడలేదు.

*****

కవిత్వాన్ని సోవియెట్ సాహిత్యంలో ప్రత్యేక స్థానంలో నిలిపాయి. The Shadow of a Friend (1936) ప్రథమ ప్రపంచ యుద్ధపు జ్ఞాపకాలతో కూడినది. 1941-45లో లెనిన్‌గ్రాడ్‌లో ఉండి ఆనాటి Patriotic war లో ప్రజల బాధలను కవిత్వ రూపంగా మలచినాడు. కవిత్వం, వచన కవిత్వం వ్రాసిన టికొనోవ్ సోవియట్ పీస్ కౌన్సిల్ ఛైర్మన్‌గా గౌరవించబడినాడు.

# 75. శీతాకాలంలో కాకి

- మిఖాయిల్ జెంకెవిఛ్ (1918)

అడవి బాతుల కేకలతో ఆకాశం మార్మోగింది.
సాయంకాలపు తార మినుకు మినుకుమంటున్నది.
కొండపై కూర్చుని ఓ కాకి కొండంత దుఃఖాన్ని
కావు కావుమంటూ లోకానికి ప్రకటిస్తున్నది.

సంధ్యాకాంతి వస్త్రాలు చక్కగా మెరవగా అతడు
శీతల సరస్సులు, మైదానాలను శీఘ్రగతిన దాటినాడు.
ఆ కాకి అరపులు నా ఆత్మను కదిలించాయి.
అతడి రెక్కల చప్పుడు నా గుండెను తాకిందప్పుడు.

వలస పోయే పక్షుల్ని అతడు పట్టించుకోడు
శీతాకాలపు కరువును ఛీత్కరించి మరిపోడు.
మంచుగాడ్పులను సైతం మంచిగా తట్టుకుని
గడ్డకట్టిన చెత్త నుంచి గ్రహిస్తాడు ఆహారం.

చిన్న శీతల గాలికి రాలే ఆకుల్లాంటివా అడవి బాతులు.
పెను మంచు తుఫానును తట్టుకునే గుండె ఈ కాకిది.
ఆ పక్షి కేకల్నుంచి పాఠం నేర్చుకున్నాను.
ఏకాకిగా ఉన్నా ఎటువంటి చలినైనా ఎదుర్కొంటాను.

*****

---

**మిఖాయిల్ జెంకెవిఛ్ (Mikhail Zenkevich 1891-1973) -** వ్యవసాయ కళాశాలలో అధ్యాపకుడి కుమారుడైన జెంకెవిఛ్ న్యాయశాస్త్రంలో పట్టభద్రుడైనాడు. అక్టోబరు విప్లవం తరువాత రెడ్ఆర్మీలో వాలంటీరుగా పనిచేసినాడు. అనేక యూరోపియన్, అమెరికన్ కవుల కవిత్వాల్ని రష్యన్ భాషలోకి అనువదించాడు. Wild Porphyry **1915**లో వెలువడింది. Acmeists పొయిట్స్ వర్క్‌షాపులో సభ్యుడు. The Late Flight (1928), Reaping with Machinary (1931), Selected Poems (1933), Through the Tempest of the Years (1962) ఇతడి ఇతర పుస్తకాలు. చిక్కని గాఢతగల పద్యపంక్తులు, నూతన శబ్దాల పొందిక, ప్రత్యేకమైన వాక్యశైలి ఇతడి కవిత్వంలో ప్రధాన అంశాలు.

# 76. ఎకార్డియాన్ గాయకుడు

**- వాసిలి కాజిన్ (1922)**

తోటలో అంతా ప్రశాంతం.
శీతల గాలి తోటమాలి పాదాల వద్ద ప్రశాంతంగా నిద్రిస్తున్నది.
.........ఇంతలో అకస్మాత్తుగా వీధిలో నుంచి
ఓ యువకుడు, వాడి చేతిలో ఎకార్డియాన్ పెట్టె
వాడి చేతివేళ్లు, హృదయం, మీటల్ని నొక్కుతుంటే
తోటలోకి, పొలాల్లోకి, మైదానాల్లోకి సంగీతం...
పూలన్నీ నిదురలేచి చేస్తున్నాయి నృత్యం, వాడితోపాటుగా!

ఇటుకల ఇళ్లు బురదలో కాస్త ఒరిగి
స్ట్రాబెర్రీ కలల సుగంధాన్ని వీక్షిస్తున్నాయి.
బాల్కనీల నుంచి బయటపడ్డ జనం గుండెలు
ఎకార్డియాన్‌తో శృతి కలిపి ధ్వనిస్తుంటే, మైదానాలలో
ఎక్కడ చూసినా, మంచులో పాదముద్రల ముగ్గుల తోరణాలే!

అడుగో, పోస్ట్‌మాన్! చూస్తున్నాడు సంచిలో ఉత్తరాలపై అడ్రసులు!
ఆశ్చర్యం! అన్నిటిపైనా చిరునామా ఒకటే! మైదానంలోని చెట్లు.

✤✤✤✤✤

---

**వాసిలి కాజిన్ (Vasili Kazin 1898) -** ప్లంబర్ కుమారుడైన కాజిన్, టెక్నికల్ కాలేజీలో చదువుకున్నాడు. యంగ్‌వర్కర్స్ యూనియన్, డిస్ట్రిక్టు కమిటీలలో పనిచేసినాడు. 1920లో KUZNITSA (The forge) అనే లిటరరీ గ్రూపును మిత్రులతో కలిసి స్థాపించినాడు. Worker's May, Fox - for coat and love (1926), Confessions (1928), The great Beginning (1956) అతడి రచనలు. సోవియట్ సాహిత్యపు తొలిదశలోని ప్రముఖ కవిగా ప్రసిద్ధికెక్కినాడు. పీడిత తాడిత శ్రామిక జనపు ఆలోచనలను తన కవిత్వంలో ప్రతిబింబించినాడు.

# 77. శ్రామికుల 'మే'

- వాసిలి కాజిన్ (1919)

'పైపు' చుట్టూ 'రెంచి'ని ఉంచి
సుత్తితో ఠాంగ్, ఠాంగ్ మని కొడ్తాను.
వీధిలోని ప్రతి యిల్లూ వెంటనే ప్రతిధ్వనిస్తుంది.

పదునైన దవడలున్న నా ఉక్కుకత్తెరలు
లోహపు రేకల్ని పరా, పరా, కోసేస్తాయి.
గొట్టపు మూతి నుంచి నీళ్లు జారి సుళ్లు తిరుగుతాయి.

బయట వసంతం అదే పనిమీద ఉన్నది.
'మే' నెలలో మంచు గలగలా కరిగి సరస్సులై
నీలిరంగులో మెరుస్తూ జింకు ముక్కల్ని తలపిస్తాయి.

కిటికీ తలుపుల మీద వానచుక్కలు
సుత్తిదెబ్బల్లా ఠప్, ఠప్ మని పడ్తాయి.
ధ్వని, ప్రతిధ్వనుల మోతతో వాననీళ్లు వడివడిగా సుడి తిరుగుతాయి.

✤✤✤✤✤

# 78. పుచ్చకాయ - ద వాటర్‌మెలన్

- ఎడువర్డ్ బాగ్రిట్‌స్కీ (1924)

సముద్రపు గాలి సత్తువ పుంజుకున్నది,
అజూర్ సముద్రంలో కలకలం మొదలైనది.
మా పడవ నిండా మరకతాల్లాంటి పుచ్చకాయలు
మూడు రాత్రులూ పగళ్లూ ముచ్చటగా గడచిపోయాయి.

తెల్లటి గడ్డాలతో అలలెగసిపడినాయి.
గాలి అలల్ని ఛేదిస్తుంటే నీలిముత్యాల వాన.
ఒక ప్రశస్తమైన పుచ్చకాయపై నేను
హృదయాన్ని ఎంతో అందంగా చిత్రీకరించాను...

నింగిపైని సూర్యుడు నురగలోకి నిష్క్రమించాడు.
చంద్రుడిని అలలు పైపైకి నెడ్తున్నాయి.
గాలి గట్టిగా ఊపిరి తీసుకుని వదుల్తున్నది.
ఎట్లా వీస్తున్నదో చూడు!
ఎలా ధ్వనిస్తున్నదో విను!
నీ తెరచాపలు జాగ్రత్త, సుమా!

తెల్లగొర్రెల మంద తొక్కిసలాడుతున్నది.
పుచ్చకాయలు గొర్రెల మధ్య దొర్లుతున్నవి.
తుఫాను హోరుగాలి ఈలలు వేస్తున్నది.
ఆకాశాన నల్లమబ్బులు సమావేశమైనవి.
చుక్కాని దిక్కులు చూస్తుంటే, పడవ మూల్గుతున్నది.
ఇంకా తెరచాపతాళ్లు దృఢంగానే ఉన్నాయి.

అలలతోపాటు పడవ తూగుతున్నది.
ప్రచండ వాయువులో మేఘంలా సాగుతున్నది.
నురగ, తరంగాలొక్కుమ్మడి దూకుతుండగా
గాలుల ఊళల మధ్య పడవ దారి తప్పినది.

సుడిగుండపు గండంలో నావ చిక్కుకున్నది.
ఎత్తైన అలలు విసిరి విసిరి కొడ్తున్నవి.
తెల్లగొర్రెల మంద తొక్కిసలాడుతున్నది.
పుచ్చకాయలు, గొర్రెల మధ్య దొర్లుతున్నవి.

నా ఆఖరి పాటను నేనింకా పూర్తి చేయలేదు.
నా మెడపై మృత్యువు శీతలాన్ని ఊదుతున్నది.
జీవితపు జూదంలో నన్ను నేను కోల్పోతున్నాను.
ఈ నౌక నాకిప్పుడు జలసమాధిగా మారినది.

మాలో ఎవ్వరికీ సూర్యుడిక కనుపించడు.
ఒక పుచ్చకాయ తీరాన్ని చేరుకున్నది గమనించడు.
తెల్లటి గడ్డాలతో అలలెగసి పడినాయి.
చేపల గుంపును దాటి ఓ పుచ్చకాయ తీరాన్ని చేరుకున్నది.

పనై పోయినట్లు తుఫాను నిష్క్రమించినది.
ఓ కోసక్కు కన్య పుచ్చకాయను చూసినది,
చేరాల్సిన చోటుకే ఆ పుచ్చకాయ చేరినది.
హృదయాన్ని తడుముతున్న ఆమెకు నా ఉనికి తెలియదన్నది.

❖❖❖❖❖

---

**ఎడువర్డ్ బాగ్రిట్స్కీ (Eduard Bagritsky 1895-1934) -** అసలు పేరు Dzyubin. ఒడెస్సాలో ఒక మధ్యతరగతి కుటుంబంలో జన్మించినాడు. సర్వేయర్‌గా పనిచేసినాడు. అంతర్యుద్ధంలో పాల్గొన్నాడు. 1926లో మాస్కో చేరుకున్నాడు. The Ballad of Opanas లో ఉక్రెయిన్‌లోని అంతర్యుద్ధాన్ని అత్యద్భుతంగా కవిత్వీకరించి పేరు తెచ్చుకున్నాడు. The South-West (1928), ఇంకా అనేక పుస్తకాలు అతడిపేరు ప్రతిష్ఠలను ఇనుమడింప జేసినాయి. అతడి కవిత్వంలో యువకులలోని వీరత్వం, భావుకత్వం మిక్కుటంగా ఉంటాయి. విప్లవకారుల జీవితాల్ని, యుద్ధగాథల్ని, పీడిత జనపు విముక్తిని కవిత్వంగా మలచిన బాగ్రిట్స్కీ 1930 ప్రాంతంలో కవులకు గురువుగా ప్రసిద్ధికెక్కినాడు.

# 79. గ్రనడా

- మిఖాయిల్ స్వెత్లోవ్ (1926)

మా పెదాల మీద ఆపిల్ పాటతో
మేం దాడిచేసాం శత్రుశిబిరంపై.
అక్కడి పొదలు, రాళ్లూ, సగం కోసిన గడ్డీ
ఇప్పటికీ పాడుతున్నాయి ఆ పాటను.

నా స్నేహితుడొకడు ఇంకో పాట పాడినాడు.
తారలు చూపిన దారిలో మేం గుర్రాలమీద పోతుంటే
అతడు తన మాతృభూమి వేపు తలతిప్పి
స్వప్న భాషలా - గ్రనడా, గ్రనడా, గ్రనడా, నా దేశమా!

అతడు ఉక్రెయిన్‌లో పుట్టినవాడే, అయినా
స్పెయిన్‌లోని గ్రనడా మీదెందుకంత ప్రేమ?
కీవ్, కార్కోవ్ మీరైనా చెప్పగలరా,
ఎందుకతడు స్పానిష్ దేశాన్ని తలుస్తున్నాడో!

నేనడిగాను అతడిని, మిత్రమా! నాకు తెలుసును,
నీవు ఉక్రెయిన్ దేశవాసివి, దేశభక్తుడివీ!
మరెందుకు పాడతావు- 'గ్రనడా, గ్రనడా, గ్రనడా' అని?
అతడన్నాడు నెమ్మదిగా, తలవాల్చినా స్థిరంగా!

'అక్కడ ప్రజలు పేదవాళ్లు, వాళ్లకోసం పోరాడతాను,
నా ఇంటికీ, నా దేశానికి వీడ్కోలు- గ్రనడా, గ్రనడా!'
మా గుర్రాలు పరిగెడ్తూనే ఉన్నాయి, యుద్ధ వ్యాకరణం వింటూ,
తెల్లవారింది, పొద్దుగూకింది. తుపాకి భాష తెలుసుకుంటూ!

మా పెదాలమీద ఆపిల్ పాట
గుఱ్ఱపు డెక్కల చప్పుడు వాయిద్య ఘోష
ఏది మిత్రమా నీ పాట? అయ్యో విను!
నీరసంగా మూలుగుతూ- గ్రనడా, గ్రనడా! గ్రనడా!

తుపాకి గుండు ముఖానికి తగిలి నేలపై పడినాడు.
మాలో, మొదటివాడు, మరణానికి చేరువైనాడు.
తారలకాంతిలో అతడి పెదాలు తళుక్కుమన్నాయి.
గ్రనడా... గ్రనడా... గ్రనడా... నా దేశమా!

మంచు లోయలలో అతడిప్పుడొక నీడ
ఆ పాట, ఆ గాయకుడు ఇరువురూ లేరు.
మా పెదాలపై పలుకుతున్న ఆపిల్ పాటతో
మాలో ఒకడిని కోల్పోయిన భావనా లేదు.

చీకటి పడేప్పుడు సంతాపం తెలుపుతున్నట్లు
ఉక్రెయిన్ వాన అతడిపై కురిసింది.
కొత్తపాటలెన్నో వస్తాయి, నిరాశ చెందకని!
నిరాశ చెందకు మిత్రమా! గ్రనడా! గ్రనడా!
నీ స్వప్నం నిజమౌతుంది, గ్రనడా సుభిక్షమౌతుంది.

*****

---

**మిఖాయిల్ స్వెత్లోవ్ (Mikhail Svetlov 1903-1964) -** ఎకటెరినొస్లావ్‌లో జన్మించినాడు. అక్కడే చదువుకుని వేర్‌హవుస్‌లో, తరువాత ఫొటొగ్రాఫర్ వద్ద పనిచేసినాడు. తరువాత ప్రెస్ విభాగంలో, రెడ్ ఆర్మీలో సేవలందించినాడు. 1922లో Rails ను ప్రచురించి Komsomol Poets లో ఒకడిగా సోవియట్ సాహిత్యంలో ప్రసిద్ధికెక్కినాడు. అతడి Granada కవిత సోవియట్ ప్రజల మనస్తత్వాన్ని, ఇతరులకు సాయపడే ధోరణిని ప్రతిబింబిస్తుంది.

# 80. నాకెన్నడూ లేని కొడుకు గురించి...

**(జోల పాట)**

**- వెరా ఇన్‌బెర్ (1927)**

వెల్వెట్ పాదాలపై వచ్చిన రాత్రి ఎలుగుబంటిలా నిశ్వసిస్తున్నది.
తల్లులు పసిపాపలను జోకొట్టి నిద్రబుచ్చ చూస్తున్నారు.
నా బాబు నిద్రపోతున్నాడు, దుస్వప్నాలు ఇటు రావలదు.
నిదురపో తండ్రీ నిదురపో! నా అందమైన అంగుళి లైదు.

నింగిలో వెన్నెల స్వర్ణధారలను కురుస్తున్నది.
నీలిగిన్నెకు అయిదు మూలల తార వేలాడుతున్నది.
నా పిల్లవాడు పెద్దవాడై 'అమ్మా, వెళ్తున్నా!' అంటాడు.
అతడి మెడలో ఎర్రటి 'టై' కడ్తాను నేనానాడు.

భేరీల పిలుపులా వసంతాలు గడుస్తాయి.
శీతాకాలపు మంచు దట్టంగా పేరుకుంటుంది.
గుర్రంపై అతడు భవిష్యత్తులోకి స్వారీ చేస్తాడు.
ఈలోగా, నా చిన్ని కన్నా! నిదురపో హాయిగా!

దూరదేశాల్నుంచి పంపుతాడెన్నో ఉత్తరాలు, బహుమతులు.
రేవులో ఆగే నౌకల్లా కాసేపు మనతో ఉంటాడు.
మగపిల్లలు ఓడల్ని నడుపుతారు. తల్లులు ఎదురుచూస్తుంటారు.
ఏళ్లకేళ్లు గడిచి నా జుట్టు తెల్లబడ్తుంది. నా గుండె నెమ్మదిస్తుంది.

నా గుండె ఆగిన సంగతి, కొండా కోనల్ని దాటుతుంది.
నా కొడుకు దుఃఖిస్తాడు, నేను ప్రశాంతంగా నిద్రపోతాను.
ఈలోగా, నా చిన్నికన్నా! నిదురపో! నిదురపో హాయిగా!
నీకు నిక్కరు తొడుగుతాను, పట్టుకో నా అందమైన అంగుళిలైదు.

✤✤✤✤✤

---

**వెరా ఇన్‌బెర్ (Vera Inber 1890-1972) -** ఒడెస్సాలో జన్మించిన వెరా ఇన్‌బెర్ తండ్రి ప్రచురణ సంస్థ మేనేజరు, తల్లి అధ్యాపకురాలు. ఒడెస్సా హైస్కూల్‌లో చదువుకున్న తరువాత స్విట్జర్‌లాండ్, ఫ్రాన్స్ వైద్యంకోసం వెళ్లింది. Wine of Sorrow (1912), Bitter Pleasures and Fleeting Words (1914), The aim and the way (1923), The Pulkovo Meridian (దీర్ఘకవిత), Nearly Three Years, The Way of Water (లెనిన్ గురించి)- ఆమె పుస్తకాలు. ఎంతో భావుకత, అక్షర రమ్యత ఉన్న కవిత్వమామెది.

# 81. ఉమ్కా (ధృవపు ఎలుగుబంటి)

**- ఇల్యా సెల్విన్‌స్కీ (1933)**

రా, ప్రియతమా! తీసుకో నీ చేతుల్లోకి,
                ప్రకాశించే ఈ నీలిగోళాన్ని
రేఖలపై ప్రయాణం, అలలపై తేలుతూ,
                ఆర్కిటిక్ సముద్రంలోకి.
నీకై నా ఎడబాటు దుఃఖిస్తున్న నౌకలా...

మంచు శిఖల కోడిపుంజులు పోట్లాట,
                ముక్కూముక్కూ కలిపి...
చుకొట్కా, అలాస్కా
                మధ్యలో బేరింగు అఖాతం.
రోజుల తరబడి సూర్యుడూ
                ఒక్కోసారి చంద్రుడూ ఉండనిచోట
గాలి వేగంగా రంధ్రాల్ని పూడ్చేస్తుంది
                పదముద్రల్ని మంచు కప్పినట్లు.
అరుదుగా మంచుగాలులు ఆగినప్పుడు
                ధృవపు జింకల కొమ్ములు ధగధగా మెరుస్తాయి.
సూర్యుడు లేని ఈ చోటున
                అంతా నీలి మంచు మైదానమే!
ఆర్కిటిక్ నక్కలు ఆనందంగా తిరిగేస్తాయిక్కడ.
సంధ్యాకాంతులు నల్లగా మెరిసేప్పుడు
                గ్రీన్‌లాండ్ ఎలుగుబంటి
                        రష్యావేపు నడకసాగిస్తుంది.

సముద్రపు సింహాలు వసంతాన్ని ఆహ్వానిస్తూ
పెళ్లికేకలు పెడ్తాయి.
రెక్కలు రెపరెపలాడిస్తూ, గుండ్రంగా తిరుగుతూ
మల్లయోధుల్లా కుస్తీలు పడతాయి.
ఇదుగో, ఇది తిమింగలపు కంకాళం,
మృత్యువులో విశ్రాంతి తీసుకుంటున్నది.
చిన్ని నక్కలు మందుల పెట్టెలోంచి
ధర్మామీటర్లు దొంగిలిస్తాయి.

ఇక్కడే, పొగచూరిన ఇళ్లు,
సీల్ చర్మాలు ఢంకాకున్నట్లు బిగుతుగా-
నీవు లేని తలుపు తడ్తావు.
తేనె తుట్టెలోని గదుల్లా కిటికీలుండవు, తలుపులుండవు
బతికున్నవాళ్లు పాతకథల్లోలా
పేదలు కదా! చిత్రంగా కనిపిస్తారు.

ఎన్నో సాహస పడవలిటువచ్చాయి,
నక్కల కేకల్ని విని వెనక్కు మళ్లుతాయి.
వీళ్లు సీల్ దంతాల దెబ్బకు చచ్చిపోతారు.
దేవుడి దయ ఉంటే బతుకుతారు.
రిగ్గుల మోత, నక్కల ఉన్ని చర్మాల వేట
పేదలకు రంగురాళ్లిచ్చే దగా వ్యాపారులు
ఈ మోసగాళ్లను 'చుక్చి' నిశ్శబ్దంగా గమనిస్తున్నాడు.
ఉత్తరపు గాలి వచ్చేదాకా ఆగు!

ఉత్తరపు గాలి వచ్చింది.
నార్వే పడవ సిబ్బందికి కుక్కలు కావాలి.
పడమటి గాలి వచ్చింది.
అమెరికన్ ఓడలు 'ఫర్' నింపుకుని వెళ్లాయి.
దక్షిణపు గాలి వచ్చింది.
జపాన్ నావలు ఓపియం తెచ్చాయి.
చానాళ్లకు తూర్పుగాలి వీచింది.
రష్యన్ మరపడవ మంచును బద్దలుకొట్టింది.
అతడికప్పుడు తెలిసింది స్వేచ్ఛనిచ్చే
అసలు గాలి 'సోవియట్ శక్తి' అని.

✤✤✤✤✤

---

**ఇల్యా సెల్విన్‌స్కీ (Ilya Selvinsky 1899-1968) -** ఫర్ వ్యాపారి కుమారుడు. న్యాయశాస్త్రం చదువుకున్నాడు. నటుడు, ప్రయోక్త, రిపోర్టర్, వెయిట్‌లిఫ్టింగ్ కోచ్‌గా పనిచేసినాడు. 1922-30లలో బాగ్రిట్‌స్కీ, ఇన్‌బెర్, లుగొవొస్కయ్‌తో కలిసి Constructivists అనే లిటరరీ గ్రూపును స్థాపించినాడు. అనేక గేయకవితలు, పురాణ కవితలు, నవలలు, నాటకాలు, విషాదాంత నాటకాలు వ్రాసినాడు. రష్యా ట్రిలోజి, The man who was astranger than destiny (లెనిన్ గురించి), The Studio of Verse లాంటివెన్నో ప్రచురించినాడు. రష్యా గురించి, విప్లవం గురించి పలవరించినాడు. Patriotic War లో గాయపడినాడు. కవిగా, రచయితగా బృహత్ కావ్యాలను వ్రాసి ప్రసిద్ధికెక్కినాడు.

# 82. మేపుల్ ఆకు

**- వ్లదిమీర్ లుగౌవ్స్కాయ్ (1936)**

నా నల్లని బుగ్గల మీద కన్నీటి ఏటి జాడలు
నా నిద్రని దోచే జ్ఞాపకాల కాళరాత్రులు
చేపముల్లులా బాధపెట్టే చేదు గాలులు
నా నుదుటిపై నిరాశా నాగటి చాలులు.

నన్ను నేను ప్రశ్నిస్తాను- 'ఈ బాధలకు లొంగిపోతున్నావా?'-
'లేదు' కవి గాయకుడి గేయంలా ఈ బాధ పవిత్రమైనది.
జ్ఞాపకాలు చెదిరిపోవు, గాయాలు మాసిపోవు.
నిశ్చల నేత్రాలు అనంతంలోకి, పక్షి ఎగిరిపోయింది.

నీ గొంతు గాలితో కలిసి మంద్రంగా వినిపిస్తుంది.
సైనిక దుస్తులు, బాయొనెట్ కత్తులు, రక్తవర్షపు జల్లులు.
అబద్దాలు, ప్రేమ, గుండెకోత, సంతోషపు దారులు.
అవన్నీ ఒక ఎత్తు, శీతలమైన ఆనాటి నీ చేతి స్పర్శ ఇంకా గుర్తుంది.

నీ మాట నన్ను బతికిస్తున్నది. ఈ మట్టి బూడిదౌతుంది.
నీ బాధ మెరుపులా నా భుజాలపై దూకుతున్నది.
నా దేశంలో ప్రచండ పవనాలు జీవన వృక్షాలను పెల్లగిస్తాయి.
రాత్రిపూట దుస్వప్నాలు నన్ను పీడిస్తున్నాయి.

అనాది శీతల మంచు తుఫానుల్లో వీరుల ఛాయలు
ఖ్యాతి మృత్యువు కవల పిల్లలు
కొమ్ము బూరల అగ్నిస్వరాల మధ్య యువకుల మరణాలు
సమాధి ఫలకాలపై పిడుగుల వ్రాతలా పేర్లు.

నీతోపాటు వచ్చిన సంధ్యాకాంతి శాంతినిచ్చేది
గాలులకు తలలూపే చెట్లు నన్ను పలకరించేవి
లారీల శబ్దాలు, చీకటి గాలులు సంగీతమయ్యేవి.
నదికిరువైపున్న గుట్టల్లా నీ వక్షోజాలు నన్ను తాకేవి.

నీవు నా యవ్వనానివి, ఉద్రేకపు పొంగుగా ప్రవహించే దానివి.
హ్రస్వదినాలు, దీర్ఘరాత్రులు నన్ను బాధపెడ్తున్నవిప్పుడు.
శత్రువుల చేతిలో నేను కూలినా, నీ మాట నాతో ఉన్నది.
వీరులతో పాటు జయాపజయాలు పంచుకుంటూ సాగుతున్నది.

నాకు పూలపై మక్కువ లేదు.
రెక్కల గాలులతో పూచే గులాబీలంటే ఇష్టం.
మేపుల్ పత్రంలా గులాబిరంగున్న నీ హస్తం
గాలికి, ఆకురాలే కాలంలో ఆకులా రాలిపోయింది.

✤✤✤✤✤

---

**వ్లదిమీర్ లుగొవ్‌స్కొయ్ (Vladimir Lugovskoy 1901-1957) -** మాస్కోలో రష్యన్ సాహిత్యాన్ని బోధించే అధ్యాపకుని కుమారుడు. పాఠశాల విద్య తరువాత రెడ్ ఆర్మీలో చేరాడు. Northern Lights (1926), Muscle, Europe, Life, Blue Spring, Middle of the Century అతడి రచనలలో కొన్ని. విస్తృతంగా దేశాలను పర్యటించి తన కవితలలో ఆ అనుభవాల్ని పొందుపరచినాడు. The word wind in my poetry has become synonymous with revolution అన్నాడతడు.

# 84. గిటార్

**- ఐవొసిఫ్ ఉట్‌కిన్ (1926)**

గత కాలపు గాలితో ఓ గిటార్! నా ఎదనిక కదిలించలేవు.
యుద్ధకాలపు మృత్యు పంట, నీ వెండి తీగల్ని విదిలించింది.
పోరు తుఫాను హోరుగాలిలో సైతం నిన్ను నా భుజాన్నుంచి తీయలేదు.
ఆ అత్యంత కష్టకాలంలో, కన్నీళ్లు, ప్రేమలను, నే మరవలేదు.

బుల్లెట్ దెబ్బతిన్న చేతి స్పర్శ పాత జ్ఞాపకాల్ని పలవరిస్తుంది.
పంట పొలాల్లోని సూర్యకాంతిని, పైన్ వృక్షాలు పలకరిస్తున్నాయి.
ఆహారం, నీరు లేక మరకతపు ఆకాశం కింద దళం అల్లల్లాడింది.
అగ్ని తునకలా ఓ తుపాకి గుండు, లెఫ్టినెంట్‌ను నేలకూల్చింది.

యువ కమిస్సార్ పెట్టెను గుండె కదుముకున్నాడు.
ఆకుపచ్చని ఏటి పక్కన అశ్వికుల నీడలు పొడుగైనవి.
ఋతువులు, ఏళ్లు గడిచాక, జ్ఞాపకాలే కదా మిగిలేవి!
పెరికాప్‌లో, ఉర్గాలో అదృశ్యమైన వారికి గిటార్ పాటలెందుకు?

ఇప్పటికీ నా భుజాలపై గిటార్ ఉన్నట్లే అనిపిస్తుంది.
అశ్విక దళాల హోరు, కోసక్కు ఖడ్గాల మెరుపులు
మరలా యుద్ధ జ్వాలలు తుఫానులా కమ్ముకు వస్తే,
ప్రియతమా! వచ్చేయి నా భుజాలపైకి! పాటగా ప్రవహిద్దాం!

✣✣✣✣✣

---

**ఐవొసిఫ్ ఉట్‌కిన్ (Iosif Utkin 1903-1944) -** కింగాన్ రైల్వే ఉద్యోగి కుమారుడు. 1920లో రెడ్ ఆర్మీలో వలంటీర్‌గా సైబీరియా యుద్ధంలో పాల్గొన్నాడు. మాస్కోలో జర్నలిజం అభ్యసించాడు. The tale of ginger head Motele, The inspector, The Rabbi Isaiah, Commissar Block ఇతడి ప్రసిద్ధ రచనలు. నిజాయితీతో కూడిన నిర్భయత్వం ఇతడి కవిత్వంలో ప్రధానాంశం. 1941 పెట్రియాటిక్ వార్‌లో గాయపడి కోలుకున్నాడు. 1944లో విమాన ప్రమాదంలో కన్ను మూసినాడు.

# 85. సృష్టి

- సెమ్యాన్ కిర్సనొవ్ (1943)

ఓ సాయంకాలం సర్జన్ శిబిరంలోకి
తీసుకువచ్చారు గాయపడిన సైనికుడొకడిని.
అతడి గుండె దాదాపు ఆగిపోయింది.
రొమ్ములో గుచ్చుకున్న వేడి ఉక్కు శలాక,
పెదాలు ఊదారంగులో, కళ్లు మసక మసకగా!
చొక్కా కత్తిరించేసరికి, గాయంలోతుల్లో గుండె ఎర్రగా!
ఏ శత్రువుకూ జడవని ఆ గుండెను, ఆగని స్పందనను
ఇనుప ముక్క ఆపిందంటూ ఆ వైద్యుడు హృదయాన్ని
తన మృదు హస్తాలతో స్పృశించి, శలాకను తీసివేసినాడు.
కన్నీళ్ల పర్యంతమవుతూ అతడు గుండెను తట్టి,
రక్తమోడుతున్న గాయానికి సున్నితంగా వేసినాడు కుట్లు.

ఆశ్చర్యంగా హృదయస్పందన ఆ క్షణమే మొదలైంది.
ఆ సైనికుడి పెదాలు కదిలాయి, కళ్లలో కాంతి.
తన పని ముగించి వైద్యుడు ప్రశాంతంగా కూర్చున్నాడు.
కళ్లు మూతలు పడిన కాసేపట్లో ఆగిపోయిందతడి గుండె.
ఆ సర్జన్ గుండె కదిలించే వైద్యుడెవరూ అందుబాటులో లేరు.

ఈ సంఘటన గుర్తుకొస్తే నా గుండె జలదరిస్తుంది.
నీ సోదరుడి గుండెను స్పృశించడం కన్నా ఆనందమేమున్నది?
నా హృదయం ఉద్వేగంతో కాలిపోయినా ఫరవాలేదు.
జీవితమైనా, కవిత్వమైనా ఇదేకదా సృష్టి గొప్పతనం!

✤✤✤✤✤

---

**సెమ్యాన్ కిర్సనొవ్ (Semyon Kirsanov 1906-1972) -** ఒడెస్సాలో జన్మించిన కిర్సనోవ్ అక్కడే గ్రాడ్యుయేషన్ పూర్తి చేసినాడు. 1925లో మాస్కో వచ్చి మయకొవ్స్కీ LEF లో సభ్యుడైనాడు. మయకొవ్స్కీతో కలిసి రష్యా అంతటా పర్యటించి ఎన్నో కవితలను, వ్యాసాలను వ్రాసినాడు. The Target, Experiments అతడి తొలి రచనలు. The five gear plan, Cinderella, Your Poem, Fight the plague అతడి రచనలు. మయకొవ్స్కీ రచనా విధానాన్ని, నూతన పోకడలను కవిత్వంలో అభివృద్ధి చేసినాడు. కిర్సనోవ్ మంచి అనువాదకుడు కూడా!

# 86. ముంచుకొస్తున్న తుఫాను

**- నికొలాయి జబొలాట్స్కీ (1957)**

నొసలు చిట్లిస్తూ మబ్బులు నింగి సగాన్ని కమ్ముకున్నాయి,
అదుగో ఆ పెనుమేఘం చేతిలో ఆరుతూ వెలుగుతున్న విద్యుల్లత!
అప్పుడప్పుడూ వర్షాభ్రాలు నన్ను వెండివానతో తడిపేస్తాయి.
మెరుపు తీగెల పట్టకారుతో పట్టుకుని నన్ను ఉరుము సుత్తితో సాగదీస్తాయి.

వాటి జాడ కనబడగానే నేనున్నచోటే నిశ్చలమౌతాను.
ముందుకెళ్లే శక్తి ఉడిగి, కుతకుతా ఉడికిపోతాను.
మెరుపు ఖడ్గానికి రెండుగా చీలిన ఆ 'పైన్ చెట్టును చూడు!
చచ్చి, ఎండినా తన కొమ్మల కిరీటంతో నింగినెలా ఆపుతున్నదో!
ఎద చీలిన జీవితంలో గాయమింకా సలుపుతూనే ఉన్నది.
కాలిన మీది ఆకులు నక్షత్రాల్లా వర్షించి కాలాన్ని నల్లబరుస్తున్నవి.

ఎన్నో దుఃఖాల్ని చవిచూసిన వృక్షమా! ఒక పాట పాడు!
నీలానే నేను మెరుపు ప్రహారాలకు మోడునయ్యాను.
మరి, రెండుగా చీలినా నేనెందుకు, ఎండి చావలేదు?
నా హృదయమెందుకు ఆకలి, ప్రేమ, పాటలతో నిండి వున్నది?

❖❖❖❖❖

---

**నికొలాయి జబొలాట్స్కీ (Nikolai Zabolotsky 1903-1958) -** కజాన్‌లోని అగ్రానమిస్ట్ కుమారుడు. లెనిన్ గ్రాడ్‌లో లిటరేచర్‌లో గ్రాడ్యుయేషన్ చేసినాడు. మొదటి పుస్తకం Columns (1929), రెండవది Second Book (1937). వ్యంగ్యం, ఎత్తిపొడుపులు ఇతడి తొలినాటి కవిత్వంలో మెరుపుల్లా కానవస్తాయి. తరువాతి కాలంలో వేదాంతం, ప్రకృతిలో మానవుడి స్థానం, సంఘర్షణలు ప్రధానాంశాలైనాయి. శిల్పం, కవిత్వం అగ్నిధారల్లా ఇతడి కవిత్వాన్ని ప్రకాశింపజేసినవి.

# 87. హృదయం నుంచి హృదయానికి

**- అలెగ్జాండర్ ప్రొకొఫియెవ్ (1930)**

**1**

మాటల్లారా, మేల్కొనండి,
మార్గంలా మీరు శాశ్వతాలు.
ఖాళీ బీరు సీసాలకన్నా చీకటిగా మాపై దుర్మార్గులు విరుచుకుపడ్డారు.
సైనికులు, గన్నర్లు, కెప్టెన్‌లు, కొత్తవాళ్లు, నానా చెత్తా
డ్రొజ్‌డొవైట్ బంట్లు, గూండాలు వాళ్లు, మొరటు జనం!

యుద్ధమంటే అన్నిరకాల శత్రువుల్ని ఎదుర్కోవడం.
మా తుపాకులు మూడవ స్వర్గం మీద గర్జించాయి.
మేం సృష్టించిన అగ్ని మంటలకు నరకాగ్ని చిన్నబోయింది.
శత్రువు అరిచాడు- 'మృత్యువు! శత్రువుకు మృత్యువు!'
మేం తిరిగి కేకలు పెట్టాము- 'జాగ్రత్త! చచ్చిపోతావు!'
ఆకుపచ్చ, నీలం, తెలుపు నీకే రంగు కావాలి?
తిను! ఇదుగో బుల్లెట్!

ఒక తరాన్ని రక్షించాము. మిత్రుడా! సోవియట్ల శక్తిని చాటినాము!
సెయింట్ జార్జి గుర్రాల కాళ్లకన్నా వేగంగా ఎగిరాడు,
మేం పడిపోతూ, పారిపోయినట్లే పోయి వెనక్కు మళ్లినాం!
ఎగిరిన సెయింట్ జార్జి బోల్తా పడ్డాడు.
కాల్పుల దళం చేతిలో కాటికి చేరాడు.

**2**

మేలుకో, పంథొమ్మిది వందల పంథొమ్మిదీ!
సైన్యం కాదిది ప్రజల ప్రవాహం.
సముద్రం దాకా విస్తరించిన నేల, ఆకాశంలో లేదు కాంతి జాడ!

ఆహారం అడుగంటింది, పళ్లు కుళ్లిపోతున్నాయి.
మన ఉక్కుదేశం ఉక్కుయుద్ధంలో చిక్కుకున్నది.
నీ జన్మలో నీ వటువంటి దృశ్యాలు చూడలేవు.
చల్లగాలికి జుట్టు తెల్లబడింది. కాకిలా దుమ్ము
రాళ్లకు రంధ్రాలు చేసి నీళ్లు తాగి బతికాము.
పర్వత పాదాల్నుంచి సముద్రతీరం వరకూ కవాతు చేసినాము.
డెవిల్ కూడా అసహ్యించుకునే ఉప్పు చేపల్ని తిన్నాం.
రక్తంతో తడిచిన జెండాను ఒకరికొకరు అందించాము.
ఈ ప్రపంచ దుఃఖమంతా మా దుఃఖానికి సరితూగదు.

అయినా మేం యుద్ధాగ్నులలో దూకి బయటకు వచ్చాం!
మీరు ఏనాడూ అటువంటివి చూడకుండానే కన్నుమూస్తారు!

వందతలల రాకాసి మాపై గంట గంటకూ మంటల్ని జిమ్మేది.
గుళ్లవర్షం మాపై నిర్విరామంగా కురుస్తూనే ఉండేది.
మేం తుపాకులు పైకెత్తి విశ్రాంతికి స్వస్తి చెప్పేవాళ్లం.

**-'ద్వేషంతో దోపిడీ వ్యవస్థను కూల్చేద్దాం!**
**ప్రేమతో నూతన ప్రపంచాన్ని నిర్మించుకుందాం!'-**

తోడేళ్లు మనల్ని చూసి వెనకడుగువేసాయి.
శత్రువులు అరిచారు- 'మృత్యువు! శత్రువుకు మృత్యువు!'
మనం కేకలు పెట్టాం- 'జాగ్రత్త! చచ్చిపోతావ్!'
మిత్రుడా! ఒక తరాన్ని రక్షించాము. చీకటిని ఛిన్నాభిన్నం చేసాం!
ఆకుపచ్చలు, నీలం, తెలుపు అవి వాళ్లకు మంచి క్షణాలు,
అగ్ని ఎరుపు, మిత్రమా! అవి సోవియట్ శక్తి లక్షణాలు!

*****

---

**అలెగ్జాండర్ ప్రొకొఫియెవ్ (Alexander Prokofiev 1900-1971) -** రైతు కుటుంబంలో జన్మించి, సెయింట్‌పీటర్స్‌బర్గ్‌లో విద్యాభ్యాసం చేసినాడు. 1919లో రెడ్ ఆర్మీలో చేరినాడు. Midday (1931), The Street of Red dawns (1931), Victory (1932) ఇంద్రధనుసు రంగుల్లా అతడి కవిత్వం ప్రకాశవంతంగా, ఉద్వేగభరితంగా ఉంటుంది. చలనగతి, ప్రేమ, ఉద్వేగాల కలబోత ప్రొకొఫియేవ్ కవిత్వ ప్రవాహం. Russia ఇంకా అనేక కవితలలో అతడు రష్యా పోరాటాలను సమర్థవంతంగా కవిత్వీకరించినాడు.

## 88. కుంభకారులు

**- వెసెవొలొద్ రోజ్‌దెస్త్వెన్‌స్కీ (1961)**

టిక్విన్ చిత్తడి నేలల్నుండి, నిద్రిస్తున్న రేవుల్లోకి
మంచు తెరల్ని చీల్చుకుంటూ, మా నగరానికి వస్తారు వాళ్లు.
పై అంతస్థుల్లోని కిటికీలకు, సంధ్య రంగుల్ని పులిమింది.
ఫొంటాంకా నదిలో వాళ్ల పడవల రాక మొదలైంది.

అన్నీ మృణ్మయ పాత్రలే! క్వాస్ కలశాలు, అన్నం కుండలు,
నీటి కూజాలు, గ్లాసులు, మూకుళ్లు, మూతలు, కుండీలు.
రేవు ఒడ్డునే అమర్చారు అందంగా దొంతర దొంతర్లుగా
ఈ కాలానికి వెనకబడినా పనితనంలో ముందుకే ఉన్నారు.

మండే ఎండను చల్లబరిచే చలివేంద్రాలు వాటిలో దాగుంటాయి.
నా చిన్ననాటి జ్ఞాపకాల వెల్లువలు వాటిలో కలలు కంటాయి.
పగలల్లా మట్టి తొక్కి, చక్రం మీద, చేతుల్తో మృదువుగా
ఒక్కొక్క పాత్రను సృష్టిస్తుంటే, ప్రకృతి పడే పురిటినొప్పులు గుర్తుకొస్తాయి.

✤✤✤✤✤

---

**వెసెవొలొద్ రోజ్‌దెస్త్వెన్‌స్కీ (Vsevolod Rozhdestvensky 1895-1977) -** ఉపాధ్యాయుడి కుమారుడు. సెయింట్‌పీటర్స్‌బర్గ్‌లో చదివాడు. రెడ్ ఆర్మీ నుంచి విడుదలయ్యాక **1922**లో World Literature Publishing House లో పని చేసినాడు. Summer, The Golden Spindle (1920-21) అతడి తొలి పుస్తకాలు. **1941-45**లో పెట్రియాటిక్ యుద్ధంలో లెనిన్‌గ్రాడ్ ముట్టడి నిర్మూలనలో పాల్గొన్నాడు. The Oriole (1958), Russain dawns (1962), Selected Writings (1965) అతడి ప్రముఖ రచనలలో కొన్ని. పదాలలో నవ్యత, శక్తి, భావవాదం ఇతడి కవిత్వంలో ప్రధానంగా కానవస్తాయి.

# 89. నటాల్యా

**- పావెల్ వాసిలియెవ్ (1934)**

కర్టెన్లు లేని కిటికీలోకి సూర్యుడు మండుతూ చూస్తున్నాడు.
వేసవి ఎండలో హొయలొలికిస్తున్న తెరలు చూడక్కడ,
సగం తెరచిన నటాల్యా కిటికీ దగ్గర!

నువ్వేం చేస్తావంటే చేతుల్లేని ఈ సిల్కు రవిక తొడుక్కో,
నీ బంగరు దేహంపై ఫిరంగి గుండ్లు ఆ వక్షోజ సంపద-
నేను యుగాల్ని క్షణాలుగా నెమరు వేస్తూ స్వప్నిస్తాను.

నీ కళ్లు, నీ వళ్లు, నీ కాళ్లు, నీ హస్తాలు,
బొద్దుగా, ముద్దుగా నీ భుజాలు, నీ వాలు చూపులు
నీ వయ్యారపు నడకలు, నీ సరస సంభాషణలు.

నీ చిరునవ్వు, నీ పెదాలపై వెలిగే వెన్నెల పువ్వు
చిత్తరువు లోని బొమ్మవని జనం ప్రశంసించే నీవు,
నీవు నడుస్తుంటే చిగుర్లు ఆకులై చిందులు వేస్తాయి.
నీవు నడుస్తుంటే మేఘమాల నెమ్మదిస్తుంది.
నీవు నడుస్తుంటే స్వర్ణగోధుమలు తలలూగిస్తాయి.
ఎండలో నీవు బంగరు వెండి బొమ్మలా మెరుస్తావు.

నీవు నడుస్తుంటే నేల పులకరించి పలకరిస్తుంది.
నీకు దారి ఇస్తూ బాటసారులు నమస్కరిస్తారు.
స్వైరిణులు చెల్లాచెదరై తలలు వంచుతారు.
జూన్ నెలలో గిటార్లు ఝుమ్మని మోగాయి.
నా చేతుల్లో నటాల్యా నవ్వుతూ ఒదిగింది.
సుఖ దుఃఖాల్లో నేనామెకు తోడుంటాను.
ఈ శుభరాత్రిని మధురస్వప్నంగా మలచుకుంటాను.

✣✣✣✣✣

---

**పావెల్ వాసిలియెవ్ (Pavel Vasiliev 1910-1937) -** మంగోలు సరిహద్దు గ్రామంలోని ఉపాధ్యాయుని కుమారుడు. విద్యాభ్యాసానంతరం సైనికుడిగా, బంగరుగనిలో పనివాడిగా పనిచేసాడు. తరువాత మాస్కోలో లిటరేచర్ అధ్యయనం చేసినాడు. The salt rebel lion (1934), Summer, Sinitsyn & Co, Prince Foma, Fists ఇతడి రచనలలో కొన్ని. జానపదగీతశైలి, ఉద్వేగాలు, వర్ణన ఇతడి కవిత్వాన్ని శోభాయమానం గావించాయి.

# 90. సగం వృద్ధుడు

**- స్టెపాన్ ష్ఛిపఛెవ్ (1939-40)**

నా జుట్టు తెల్లబడిందంటే నేను వృద్ధుడినైనట్లేనా?
నా నడక యువకుడిది, నా మనసు ఇంకా, కుర్రదే!
అయినా వాళ్లు 'పెద్దాయనా, ముసలోడా!' అనబోతారు.
నా స్నేహితురాళ్లు, నాకంటే వయసులో చిన్నవాళ్లు మరీనూ!
నిజం నిష్ఠూరమే కాని, ఒళ్లు మండదా 'బాపూ, అంకుల్' అంటే!
మా జీవితమంతా యుద్ధాల్లో గడిచింది, మొద్దుబారిపోయాం
వీళ్లే అంటారులే- 'పాతికేళ్లకే ముసలాళ్లయ్యారు వీళ్లు,
అరవై దాటినా చూడు ఎలా కుర్రాళ్లలా ఉన్నారో ఇప్పుడు!'

............... ............... ...............

నేను చస్తే ఏమిటి? ఏళ్లకేళ్లు ఎగిరిపోలేదా ఏం?
నేను మట్టిలో కలిసిపోతాను చివరకు, చావు తప్పదు కదా!
అయినా, నాకు నచ్చిన పిల్ల నాపై నడుస్తున్నపుడు
మృత్యువును విదిలించుకుని మట్టి రూపాన్నవుతాను.
గడ్డిపూలు, చేమంతుల సువాసనతో కదిలే,
ఆమె పాదాలను మురిపెంగా ముద్దాడుతాను.

✤✤✤✤✤

---

**స్టెపాన్ ష్ఛిపఛెవ్ (Stepan Shchepachev 1899-1980) -** రైతుబిడ్డ. తొమ్మిదేళ్ల వయసులో తండ్రి చనిపోగా, వర్కర్‌గా పనిచేసాడు. పశువుల కాపరిగా, ఆస్బెస్టాస్ గని కార్మికుడిగా, పుస్తకాలు అమ్మేవాడిగా, సైనికుడిగా (రెడ్ ఆర్మీలో ఛపయేవ్ దళంలో) పనిచేసినాడు. చిన్నప్పటి నుంచి కవిత్వం వ్రాసినా 1939 తర్వాత పేరు వచ్చింది. 1923లో మొదటి సంకలనం వెలువడింది. The little house in Shushenskoye (లెనిన్ గురించి) దీర్ఘకవిత చాలా ప్రసిద్ధమైనది. Good luck (1947), The Palm (1964), From my diary (1970) - ఇతర రచనలు. ప్రేమ, కాలం, పేద ప్రజలు ఇతడి కవిత్వంలో ప్రధానాంశాలు.

# 91. సైనికుడు

**- అలెక్సీ సుర్కోవ్ (1943)**

రక్తంతో తడిచిన నుదుటిని తుడుచుకుని ఆ సైనికుడు
తానున్న గోతిలోంచి శత్రువుపై కురిపించాడు గుళ్ల వర్షాన్ని.

ఓ అగ్నిగోళం బద్దలై, బురద, ఉక్కుతునకల వాన,
నేలలో మరింత పాతుకుపోయినట్లు ఈ వీరుడి అగ్ని స్పందన.

అతడి స్వేదం, రక్తాన్ని చిమ్ముకుంటూ యుద్ధ ట్యాంకుల కవాతు.
టోపీకున్న బ్యాడ్జి రక్తపు ఎరుపు, నుదుటిపై నక్షత్రపు మెరుపు.

లోహపు హోరు, టియన్‌టి, సబ్‌మెషిన్‌గన్ అరుపులు,
నరకాగ్నిలో కూడ అతడు తన విధిని నిర్వహించాడు.

రేపటి తరాలను తన త్యాగంతో ఉత్తేజపరచినాడు.
శాంతికోసం ప్రాణాలనర్పించి ఈ కవితకు ప్రాణమైనాడు.

................ ................ ................

నీవొక సుడిగాలివి, జ్వలించే అగ్ని గుండానివి.
అన్యాయాన్నెదిరించే మనిషివి, కమ్యూనిస్టువి.
సత్యమే నీ బాట. నిరవధిక పోరు నీ బాట.
మానవత్వం నీ ఊపిరి. నీకు రహదారి లెనిన్ మాట.

✤✤✤✤✤

**అలెక్సీ సుర్కోవ్ (Alexei Surkov 1899-) -** పేద రైతు కుటుంబంలో జన్మించినాడు. బొల్షివిక్ పార్టీలో, తరువాత రెడ్ ఆర్మీలో, కొమ్ సొమొలొలో, పనిచేసినాడు. మాస్కోకు వచ్చినాక 1928లో ప్రసిద్ధ సాహిత్యవేత్తగా పేరు తెచ్చుకున్నాడు. గోర్కీ పర్యవేక్షణలో Literature Studies పత్రికా బాధ్యతలు నిర్వహించినాడు. The Song begins (1930) మొదటి పుస్తకం. The Red Cavalry, The Terek Marching Song, The Song of the Brave లాంటి కవితలు సైనికులలో ఆత్మవిశ్వాసాన్ని, దేశభక్తిని, ఉద్రేకాన్ని రగిల్చి సైన్యం యావత్తూ పాడుకునే పాటలుగా ప్రతిధ్వనించాయి. యుద్ధం తరువాత అతడు వరల్డ్ పీస్ కౌన్సిల్ మెంబర్‌గా ఉన్నాడు. బొటెవ్ అవార్డు, నాలుగుసార్లు లెనిన్ ఆర్డర్‌లను ఇంకా అనేక అవార్డులను పొందినాడు.

# 92. రష్యన్ స్త్రీలు

**- మిఖాయిల్ ఇసకొవ్‌స్కీ (1945)**

యుద్ధకాలంలో మీరు పడ్డ కష్టాలను వర్ణించే పదాలున్నాయా?
మీరు చేసిన సేవలను కొలిచే త్రాసు, తూనిక రాళ్లున్నాయా?
అన్నదమ్ముల్ని, భర్తను, కొడుకును అందరినీ యుద్ధానికి పంపారు.
ఒంటరిగా ఇంటిలో గుండెకోతతో కుమిలి కుమిలి ఏడ్చినారు.

ఎందరో మనుషులు చేయాల్సిన పనుల్ని ఒంటిచేత్తో చేసినారు.
ఆందోళనను భయాన్ని ఆవల పెట్టి ఉక్కుగుండెతో ఉరిమినారు.
మీరు అల్లిన ఉన్ని కోట్లు ఉత్తరపు చలిపులికి సవాళ్లైనాయి.
మీరు చేసిన గ్రెనేడ్లు శత్రువుల పాలిట మృత్యుదూతలైనాయి.

మీ ఉత్తరాలతో మాకు కొత్త శక్తి నిచ్చినారు.
అప్పజెప్పిన ప్రతి పనిని అద్భుతంగా చేసినారు.
మేమిక్కడ బాగున్నామని మీరు వ్రాసినవి పచ్చి అబద్దాలు,
మేం యుద్ధంలో దూకేప్పుడు మీ పేర్లే మా ప్రతిజ్ఞలు!

✤✤✤✤✤

---

**మిఖాయిల్ ఇసకొవ్‌స్కీ (Mikhail Isakovsky 1900-1973) -** రైతుకుటుంబంలో పుట్టినాడు. ఉపాధ్యాయుడిగా, The Worker's Way దినపత్రికలో సబ్ ఎడిటర్‌గా, **1931**లో మాస్కోలో The Collective Farmer ఎడిటర్‌గా పనిచేసినాడు. Wires in the straw - అతడి మొదటి పుస్తకం. 'His verse is simple, good and very touching in its sincerety' అని మాక్జిమ్ గోర్కీ చే ప్రశంసించబడినాడు. నెక్రసోవ్ మార్గంలో కవిత్వాన్ని వ్రాసిన ఇసకొవ్‌స్కీ పాటల రచయితగా, సోషలిస్ట్ భావుకునిగా, కవిగా పేరొందినాడు.

# 93. కాఫీ హవుస్

- డిమిత్రి కెడ్రిన్ (1936)

('జేబులో కస్తూరి పెట్టుకున్నవాడి గురించి ఎవరూ చెప్పనక్కరలేదు.
కస్తూరి ఆ పని చేసిపెడ్తుంది.' -సాది)

కొందరు కవులకిదో జబ్బు, ఒకరినొకరు పొడుచుకుంటారు.
ఒకడిని డొక్కలో పొడుస్తూ, ఇంకొక కవి తిట్టిపోసినాడు.
-'నీవు దొంగ వెధవ్వి. సిగ్గూ శరం లేకుండా నన్ను కాపీ కొట్టినావు-
మెడకాయపై తలకాయున్న వాడెవడూ నిన్ను ఆమోదించడు'

రెండోవాడు తిరగబడి రెచ్చిపోయి మరగబడినాడు-
'నీ తెలివితేటలు తగలెయ్య! నిన్ను ఆ దేవుడే శిక్షిస్తాడులే!'
మొదటివాడన్నాడు- 'నీలో కవి చచ్చాడు, నీ కవిత్వమూ చచ్చింది'-
వింటున్న ముసలోళ్లు హో, హో అన్నారు. కుర్రాళ్లన్నారు- 'భలే తిట్టావు!'

అక్కడే 'సాదీ' నిశ్శబ్దంగా, కాఫీ తాగుతూ గమనించాడా కవుల్ని.
'ఎందుకీ కుర్రాళ్ల నాలుకలు విషాన్ని జిమ్ముతున్నాయీనాడు?'
కాలం గడిచింది. కవులిద్దరూ గతించి చేరారు మంచు అడుగుకు.
'సాదీ' పాట స్వర్ణ బాకాధ్వనిలా సమస్త ప్రపంచానికి వ్యాపించింది.
తేనెలా మధురమైన ఆ గానానికి ఎవరూ ఉద్రేకం చెందలేదు, అయినా,
ఆ కవులు కలిసినప్పుడల్లా, ఒకరినొకరు పొడుచుకుంటూనే ఉన్నారు.

*****

---

**డిమిత్రి కెడ్రిన్ (Dmitry Kedrin 1907-1945)** - అక్కౌంటెంట్ ఇతడి తండ్రి. విద్యనభ్యసించాక న్యూస్ పేపర్లలో పనిచేసాడు. ఇతడి ఏకైక కవితా సంకలనం 'Witnesses' **1940**లో వెలువడింది. గత చరిత్రలో రాజుల వైభోగాల్ని కాక పేదల కష్టాల్ని వీక్షించి వాటిని వీరోచిత గాథలుగా, కవితలుగా మలచినాడు. The Architects, The horse లాంటివి ప్రసిద్ధ గేయాలు. కవిత్వంలో రంగురంగుల దృశ్యాలు, వర్ణనలు, సూటిగా, స్పష్టంగా ఉండి పాఠకులనలరిస్తాయి.

# 94. రష్యన్ భాష

**- యారొస్లావ్ స్మెలియకొవ్ (1966)**

పసిపాపలను ఉయ్యాలలో నిద్రపుచ్చుతూ ర్యాజాన్ తల్లులు,
ముత్యాల్లాంటి పదాలతో ఏర్చికూర్చిన జోలపాటలు.
మధుశాలలో మసక వెలుగు దీపాల దగ్గర
తాగని మధువును తదేకంగా చూస్తూ వీరులు పాడిన విరహగీతాలు.
గొంతులో, కొండాకోనల్ని స్పృశించే కీచురాళ్ల చప్పుడు-

అస్తమయ సూర్యకాంతిలో నీ మోము నిగనిగలాడ్తుంటే, నీవు
కొల్త్సొవ్ కవిత్వాన్ని, కుర్బిస్కీ వచనాన్ని వలకబోసినావు.
జర్మన్‌ల జల్లులు కొన్ని జాలువారినా, నీ ఉనికిని నీవు నిలబెట్టుకున్నావు.
గొర్రెతోళ్లు, క్వాస్ మధువు వాసనల మధ్య-

కాల్చిన బొగ్గుతో, బాతు ఈకల్తో పదాల్ని పరిమళింపచేసినావు.
నాజీ జైళ్ల గోడలపై గోళ్లతో అక్షరాల్ని గొప్పగా వ్రాసినావు.
మన దేశాన్ని, భాషను మాయం చేయబోతే,
మహామహా రాజుల్నే మట్టిలో కలిపినావు.

✤✤✤✤✤

---

**యారొస్లావ్ స్మెలియకొవ్ (Yaroslov Smelyakov 1913-1972) -** రైల్వే స్కేల్స్ ఆపరేటర్ కుమారుడు. మాస్కోలో విద్యాభ్యాసానంతరం Print Shop Apprentice School లో పని నేర్చుకుని టైప్‌సెట్టర్‌గా పని ప్రారంభించినాడు. తన పద్యాన్ని తానే టైపు సెట్ చేసి 'అక్టోబర్' పత్రికలో ప్రచురించినాడు. Work and Love, The Kremlin Fir trees, A conversation about the main thing, Austere Love, The Day of Russia అతడి రచనలు. నిత్య జీవితంలో ప్రతిరోజూ జరిగే సంఘటనలను కవితాత్మకంగా మలిచినాడు.

# 95. నాకోసం వేచి ఉండు

**- కాన్‌స్టాంటిన్ సైమనొవ్ (1941)**

నాకోసం వేచి ఉండు, నేను తిరిగి వస్తాను,
నీ కొరకు వస్తాను, నిరీక్షించు ప్రియతమా!

శరత్కాలపు వెన్నెలల్ని వేదనతో భరించు
ఉక్కుగుండెలో దుఃఖాన్ని ఖైదు చేసి ధరించు.
శీతాకాలపు మంచును చెదరగొట్టు ధైర్యంగా
వర్షాకాలపు తుఫానును బెదరగొట్టు చిరునవ్వుతో,
ఎండాకాలపు వేడిని గుండెలోన చల్లార్చు,
నా ఉత్తరాలు ఆగినా ఆశను కోల్పోకు.

నాకోసం వేచి ఉండు, నేను తిరిగి వస్తాను.
నీ కొరకు వస్తాను, నిరీక్షించు ప్రియతమా!

సహనంతో జీవితాన్ని శాంతంగా గడుపు,
నేను రానన్న వారిని దూరంగా నిలుపు.
నా కొడుకూ, నా తల్లి నాకోసం ఏడ్చినా,
నా మిత్రులు నన్ను మరచిపొమ్మని చెప్పినా,
ఆ మాటలు నమ్మకు, ఆ గుంపులో చేరకు.

నాకోసం వేచి ఉండు, నేను తిరిగి వస్తాను.
నీ కొరకు వస్తాను, నిరీక్షించు ప్రియతమా!

నేను తిరిగి వచ్చాక వాళ్లంటారది అదృష్టమని,
కాని వాళ్లకేం తెలుసు, నేను మృత్యువాకిలి నుంచి వచ్చానని!
నీ ప్రేమ, నిరీక్షణ నన్ను మరల రప్పించాయని!

నాకోసం వేచి ఉండు, నేను తిరిగి వస్తాను,
నీకొరకు వస్తాను, నిరీక్షించు ప్రియతమా!

✤✤✤✤✤

---

**కాన్‌స్టాంటిన్ సైమనొవ్ (Konstantin Simonov 1915-1979) -** ఈ పాట ప్రతి ఒక్క రష్యన్ సైనికుడినీ కదిలించింది. బారక్‌లలో, బంకులలో సైనికులు ఈ పాటను వ్రాసి తమ ప్రియమైన వాళ్లకు పంపేవారు. మరణించిన సైనికులెందరి జేబుల్లోనో ఈ పాట వ్రాసి ఉన్న కాగితం కన్పించేది. ఇంకా అనేక యుద్ధ పాటలను వ్రాసిన కాన్‌స్టాంటిన్ సైమనొవ్ పెట్రొగార్డ్‌లో జన్మించాడు. గోర్కి ఇన్‌స్టిట్యూట్‌లో లిటరేచర్ చదివాడు. Real People, The bottle of ice; Suvorov (కవిత్వం), The story of a love; Lad from our Town (నాటికలు) వ్రాసినాడు. యుద్ధం తరువాత The Living and the Dead, Soldiers are not born; The Last Summer అనే నవలాత్రయం (Trilogy)- గ్రేట్ పెట్రియాటిక్ వార్ గురించి వ్రాసినాడు.

# 96. రెండు కొలుములు

- అలెగ్జాండర్ ట్వార్డొవ్‌స్కీ

దేశంలో ఓ మారుమూల పల్లెలో, జాగొరై కొలిమి ఉన్నచోట
సగం కాలిన బిర్చ్ చెట్ల నీడలో, చిన్న తోటలోని ఇంట్లో,-
నేను పుట్టిందీ, పెరిగిందీ అక్కడే!

కొలిమి మంటలు పొగగొట్టం మసిలో మెరిసేవి.
సుత్తిదెబ్బలు తిన్న నేల, గాలి, తారు, కట్టెపొగ వాసనా
నేను మా అమ్మ చేతుల్లో ఉన్నప్పటి నుంచీ పరిచితమే!

అడవి నిశ్శబ్దాన్ని మా దాగలిపై సుత్తి దెబ్బలు భంగపరిచేవి.
మా దుఃఖపు బతుకును కొండా కోనా ప్రతిధ్వనించేవి.
పదేళ్లకోసారి రైతులు పనిముట్లు కావాలనేవారు.
వంధ్య భూముల్లో, చిత్తడి నేలల్లో పంటలూ లేవు, ప్రజలూ లేరు.

దాగలి మోత, పొగతిత్తుల మూలుగు, మంటల హోరు,
అవెన్నడూ చెరిగిపోని చిన్ననాటి జ్ఞాపకాలే!
ఆ రోజుల్లో మా కొలిమి అక్కడున్న ప్రజలకు
దినపత్రిక, క్లబ్బు, బాతాఖానీ కొంప, విశ్వవిద్యాలయమూనూ!

మెడల్స్‌తో సహా ముస్తాబై వచ్చే పాతసైనికుడు,
ఎప్పుడూ పిట్టని కొట్టని వేటగాడు తన కంట్రీ తుపాకితో,
పన్ను వసూలు చేసేవాడు, గుర్రాలకు గిట్టలు కొట్టేవాడు,
సర్వేయరు, పేదరాలు ఇజ్జీ అందరూ క్రమం తప్పక వచ్చేవారు.

ప్రతిరోజూ కొట్లాటల్లాంటి గొడవలు, వాగ్యుద్ధాలు...
పాతకాలం యజమానుల ఆడంబరాలు
తాము తినే ఆహారం, తాగే ద్రాక్షసారా
రష్యా గురించి, రష్యాకు వెలుపల ప్రపంచం గురించి
దేవుడు, డెవిల్ - వాళ్ల శక్తులు
స్థానిక పంచాయితీ సభ్యులు, జనరల్స్, జార్ రాజులు,
సూర్యచంద్ర గ్రహణాలు, లియోటాల్‌స్టాయ్ పాఠాలు,
పన్నులు, సుంకాలు..... ఇంకేమన్నా మిగిలితే అవీ...

తమ జీవితాల్లోని దుఃఖాల్ని కప్పిపుచ్చుకుంటూ
ప్రపంచ విషాదాలపై వ్యాఖ్యానాలు చేస్తుంటారు.
అదో కాలక్షేపం, ఇప్పుడే ఇంటికెళ్లాల్సిన పనిలేదు.
ఇక్కడ నిన్ను అజమాయిషీ చేసేవాళ్లూ లేరు.
ఆ కొలిమిలో నేను నేర్చుకున్న దొకటుంది.
అగ్నిజ్వాలలో ఉక్కు లోహకారుడి నేర్పుతో బహురూపి కావడం.

సుత్తి, దాగలి మధ్య దెబ్బలు తిని పదునైన లోహం
పొలాల్ని దున్ని, వృక్షాలను కూల్చి, ఇళ్లను నిర్మించడం.
అందుకే నా తండ్రిపై నాకంత గౌరవం.

ఈ కొలిమి, పొగతిత్తులు, సుత్తీ, దాగలి, పనిముట్లు
పొగ, మంటా, వేడి, బాధ, కన్నీళ్లు, అన్నీ పరిచితమే!
నా జీవితంలో సగభాగం గడిచాక మరో కొలిమిని చూసాను.

ఉరల్ పర్వతాలలో ఆ సుత్తిదెబ్బకు పర్వతాలు, నేల కంపిచేవి.
నాకు పరిచయమున్న పనిముట్లూ, వాసనలూ -ఉరల్స్‌లో మళ్లీ!
కాలపు వారసత్వ కరదీపిక దేశపు ఆర్థిక వెన్నెముక ఉరల్!

ట్యాంకులు, తుపాకుల రూపంలో మారిన ఉక్కు
మాతృదేశ సంరక్షణకు
ఉరల్ పర్వత పితరుడు మనకిచ్చిన హక్కు,
తండ్రీ! నిన్ను చూడగానే ప్రణమిల్లుతాం! నీవే మాకు దిక్కు!

నిన్ను వీడి వెళ్తుంటే నా గుండె కొట్టుకుంటున్నది.
ఏదో తెలియని దిగులు నన్నావహిస్తున్నది.
ఉరల్ కొండలు దాటినాక, మరో సరిహద్దు కనిపిస్తున్నది.

✤✤✤✤✤

---

**అలెగ్జాండర్ ట్వార్డొవ్స్కీ (Alexander Tvardovsky 1910-1971) -** లోహకారుడి కుమారుడు. కొలిమిలో పనిచేసేవాడు. **1928**లో టీచర్స్ ట్రైనింగ్ కాలేజీలో చదువుకున్నాడు. మాస్కోలో ఉన్నతాభ్యాసం చేసి యుద్ధసమయంలో న్యూస్ పేపర్లకు పనిచేసినాడు. The land of Muravia, The Road, A Village Chronicle, Zagory, Vasili Tyorkin, The House by the Road side, Horizons beyond, The Horizon అతడి ప్రసిద్ధ రచనలు. సోవియట్ ప్రజల ధైర్యసాహసాలు, ఆత్మసౌందర్యం, ప్రజల గమ్యం, శ్రమశక్తి, రాజ్యం-ప్రజలు, కళ-కళాకారుడు ఇవన్నీ ఇతడి కవితలలో ప్రధానాంశాలు. రష్యన్ జానపద సంస్కృతి, ప్రాచీన కావ్యాల ఒరవడి ఇతడి రచనలలో ప్రతిబింబించి, ప్రజల మనస్సులను దోచుకున్నాయి.

# 97. దేశ రక్షకులు

**- ఓల్గా బెర్ఘోల్ట్జ్ (1944)**

దాదాపు నేల కానుకుని నీడల్లా పాకుతున్న సైనికులను
తల్లి నేల నుంచి విడదీయడం ఎవరివల్లా కాదు.
అనామకుడెవరో చటుక్కున లేచి పెనుకేకతో
యుద్ధ భీభత్సంలోకి మెరుపులా దూసుకుపోతాడు.

ఇది కథకాదు, ఇందులో ఆవగింజంతైనా అతిశయోక్తి లేదు.
వ్యక్తిలోని అంతరాత్మలా ఆ గులాబి వెనుక అన్ని గులాబీలు కదిలాయి.
అందరిపేర్లూ గుర్తుంచుకోము కాని, ఆ యుద్ధంలో, సరాసరి
పాఠశాల గది నుంచి రణరంగంలోకి దూకాడా నూనూగు మీసాల యువకుడు.

కాకుల కొండంటే మృత్యువుకే భయం, కాని ఈ కుర్రాడిదే గమ్యం!
పాకుతూ, పరిగెత్తుతూ, వంగుతూ, నిలబడుతూ సహచరుల్ని పిలుస్తూ
అందరికన్నా ముందు కొండెక్కి, ఆ నగర సౌందర్యానికి అవాక్కైనాడు.
ఆ ఆనందంలో అతడికి మృత్యువు ముద్దాడినట్లు కూడా తెలీదు.

లెనిన్ గ్రాడ్ వైపు చూస్తూ అతడు దొర్లుతుంటే
నగరమే కదలివచ్చింది అతడివేపు, ఆ ఒక్క రాత్రి
ఎన్నో సంవత్సరాల తర్వాత మూగవోయాయి శత్రువుల తుపాకులు.
తారలు, నింగిలో మిలమిలలాడ్తుంటే, నిద్రపోయింది నా సోదరి-

చిన్నప్పటిలా- 'లెనిన్‌గ్రాడ్ చూడు, ఎంత ప్రశాంతంగా ఉందో!'-
'పిల్చండి 'స్వేచ్ఛాగాలుల్ని' - అన్నది మా అమ్మ దాచుకున్న కన్నీళ్లతో
ఇన్నాళ్లూ బాంబుల శబ్దాల కలవాటు పడ్డ గుండె,
ఇన్నాళ్లూ బాంబుల శబ్దాల కలవాటు పడ్డ గుండె,
~~ఈ~~సారి నేలపైని అపరిచిత నిశ్శబ్దానికి మరింత భయపడింది.

✤✤✤✤✤

---

**వోల్గా బెర్ఘోల్ట్జ్ (Olga Bergholtz 1910-1976) -** సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో పుట్టిన వోల్గా తండ్రి వైద్యుడు. లెనిన్‌గ్రాడ్ విశ్వవిద్యాలయంలో విద్యపూర్తైనాక The Soviet Steppe కు కరస్పాండెంట్‌గా పనిచేసింది. చిన్నపిల్లల కథలు, వ్యాసాలతో మొదలైన ఆమె కవిత్వం వ్రాసి గోర్కీ ఆశీస్సులను పొందింది. Poems (1934), Book of Songs (1936), A February Diary, Leningrad Poem కవితా పుస్తకాలను వెలువరించి లెనిన్ గ్రాడ్ ముట్టడి సమయంలో అక్కడి ప్రజల వేదనను కళ్లకు కట్టేట్టు వర్ణించింది. ఆమె కవిత్వంలోని శిల్పం, పదగుంభన, విషాద ధ్వని అందరినీ కట్టిపడేసేవి. Day time stars అనే పుస్తకాన్ని- 'Biography of the Century' గా ప్రస్తావిస్తారు.

# 98. రొట్టె పరిమళ హస్తాలు

**- నికొలాయి రైలెన్‌కొవ్ (1965)**

విధి నిర్ణయించిన బతుకుదారిపై కురిసే వెన్నెలకాంతులలో
మా నేలలో పండే 'రై' ధాన్యం నుంచి చేస్తాం తీపి, చేదు రొట్టెలు.
కాస్త నేల ఉప్పును రొట్టెపై జల్లి, లోటాడు నీళ్లతో దాన్ని లాగిస్తాను.
గోధుమ రంగు పొలాల్ని నాగలితో దున్నుతాను చెప్పులు లేని కాళ్లతో.

పంటకోసి, నేలకు కొట్టి, గింజల్ని తూర్పారబెడ్తాను
పండించిన 'రై' ధాన్యాన్నే, పరమానందంగా భుజిస్తాను.
రైతుకు అంతకు మించిన సంతృప్తి ఏమున్నది?
'రై' ధాన్యమే అతడికి శక్తియుక్తుల్ని ఇస్తున్నది.

నా మనసులో ఎప్పుడూ అంతర్లీనంగా ఇదే ఆలోచన, తృప్తి.
రొట్టె, మట్టి పరిమళాల చేతులే రష్యాను రైతుగా నిలబెట్టాయని.

✤✤✤✤✤

---

**నికొలాయి రైలెన్‌కొవ్ (Nikolai Rylenkov 1909-1969) -** వెనకబడిన గ్రామంలో ఒక పేదరైతు కుటుంబంలో జన్మించాడు. 1933లో గ్రాడ్యుయేషన్ పూర్తిచేసి పత్రికాఫీసులో పనిచేసినాడు. 1941-45 ప్రాంతంలో జర్నలిస్టుగా సేవలనందించాడు. చిన్నప్పటి నుంచే కవిత్వం వ్రాసిన రైలెన్‌కొవ్ మొదటి పుస్తకం My Heroes (1933) ఇసకొవ్‌స్కి ప్రోత్సాహంతో ఎన్నో కవితలు వ్రాసినాడు. గేయకవిగా రైలెన్‌కోవ్ గ్రామ సౌందర్యాన్ని, పల్లెటూరు ప్రజల స్థితిగతుల్ని, మానవుడి ఆధ్యాత్మికతను, నీతి నియమాలను ప్రతిబింబించే కవిత్వాన్ని వ్రాసినాడు.

# 99. బాలెరినా

- లియొనిడ్ మార్టినొవ్ (1948)

కాలువలో ఎండుటాకుల అలజడి
గుర్రపుగిట్టల చప్పుడు,
తోటలో ఆమెతో పహారా భటుడి ముచ్చట్లు.

ఆమె కూతురు గంతులు వేస్తుంటే
రెండు జడలు రెక్కల్లా ఎగుర్తున్నాయి.
చేతిలో చీపురు, చేట
ఆమెతోపాటు చిరునవ్వుల నాట్యం చేస్తున్నాయి.

అతడన్నాడు- 'అదృష్టం కలిసివస్తే అవుతుందీ పిల్ల నాట్యకత్తె!'
ఆమె మొహం చిట్లించింది- 'ఆ మాటకొస్తే నేను గొప్ప నటిని!'-
మళ్లీ ఆమే అంది- 'నేను కాలేజీకి వెళ్లి ఉంటేనా!'

-'అవును - పిల్ల బాగా చదువుకుంటే ఖచ్చితంగా అవుతుంది బాలెరినా!'-
అంటూ విజిల్ వేస్తూ వెళ్లిపోయాడతగాడు.

యుద్ధకాలపు సైనికుడి కుమార్తె ఆ పిల్ల
ఆకురాలు కాలంలో ఆకులా ఆమె భర్త రాలిపోయాడు.
నాట్యమాడే ఆ పిల్ల పాదాలపై వెన్నెల కిరణాలు.
వీరుడైన తన భర్తను తలుస్తూ ఆమె మరింత తాగింది.
-'ఏం బాధపడకు! నీ కూతురు అవుతుంది గొప్ప బాలెరినా!'-

# 100. ప్రేమతో ఈ జగము నిండునుగాక!

**- లియొనిడ్ మార్టినొవ్ (1948)**

ఈ విశ్వమంతా
ప్రేమతో నిండాలని ఆశిస్తాను.
ప్రేమ మాధుర్యంలో తలమునకలేస్తూ-

ఈ జగమంతా వసుధైక కుటుంబం కావాలంటాను.
ప్రేమతో చుట్టబడిన ప్రపంచం
వెన్నెల వెలుగుల్ని, సూర్యకాంతిని అందరికి అందించాలంటాను.

నీ పిల్లలకు, ప్రియతములకు
ప్రేమ రాహిత్యంలో ఉన్న అభాగ్యులకు ప్రేమనివ్వాలంటాను.
ప్రేమ కౌగిలిలో లోకమంతా
సమాధుల దుఃఖాన్ని, నైరాశ్యాన్ని పారద్రోలాలంటాను.

ప్రేమ ప్రపంచంలో సరిహద్దు ద్వేషాలుండవు.
అన్ని రాజచిహ్నాలు, అధికార లాంఛనాలు ప్రేమలో కరిగి
సరిహద్దులదృశ్యమై, పగలు నశించి,
శాశ్వత ప్రేమ, జలధారగా పొంగి పొరలాలంటాను.

✤✤✤✤✤

---

**లియొనిడ్ మార్టినొవ్ (Leonid Martynov 1905-1980) -** రైల్వే ఇంజినీరు కుటుంబంలో జన్మించి మార్టినొవ్ విద్యాభాసానంతరం జియొలాజికల్ సర్వేలో, అనేక పత్రికలకు కంట్రిబ్యూటర్‌గా పనిచేసినాడు. అతడి మొదటి పుస్తకం Lyrics (1940); The Carved Sea Shore (1945) మరో ప్రసిద్ధ కవితా సంకలనం. సైబీరియాలోని జీవనస్థితిగతుల్ని, సౌందర్యాన్ని ఇతిహాస శైలిలో కవిత్వీకరించి నాడు. 'I have tasted the Past, seen it and smelt it' అన్న మార్టినొవ్ తన కవిత్వంతో నూతన దారులను నిర్మించినాడు.

# రష్యా - కాలరేఖ

క్రీస్తుశకం 862 కు ముందు - సంచారజాతులు (తూర్పు స్లావ్ ప్రజలు)

| | | |
|---|---|---|
| 862 A.D. | - | స్కాండినేవియన్ యోధుడు - రుస్ (రస్-Russ) (Rhos) దేశాన్ని నోవోగ్రాడ్ వద్ద స్థాపించాడు. |
| 882 | - | 'ఒలెగ్' రాజధానిని ఉక్రెయిన్‌లోని 'కీవ్'కు మార్చినాడు. |
| 988-9 | - | వ్లదిమీర్-1 తూర్పు ఆర్థొడాక్స్ ప్రభువైనాడు. |
| 1169 | - | ఆండ్రి బొగలుబస్కీ - రాజధానిని వ్లదిమీర్ (మాస్కోకు దగ్గరకు) మార్చినాడు. |
| 1237-40 | - | బటుఖాన్ నాయకత్వంలో మంగొలు తాతార్‌లు రష్యాపై దండెత్తి విధ్వంసం సృష్టించారు. |
| 1271 | - | సుజ్దాల్ వ్లదిమీర్ - రాజధానిని మాస్కోకు మార్చినాడు. |
| 1380 | - | దిమిత్రి దొన్‌స్కొయి - తాతారులను ఓడించినాడు. |
| 1462-1505 | - | మూడవ ఇవాన్ ద గ్రేట్ - మాస్కోను మూడవ రోమ్ (రోమ్, కాన్‌స్టాంట్‌నోపుల్)గా తీర్చిదిద్దాడు. |
| 1533 | - | నాల్గవ ఇవాన్ (ఇవాన్ ద టెర్రిబుల్) మొదటి జార్ |
| 1605 - 1613 | - | రష్యాను ఆక్రమించుకున్న పోలండ్ |
| 1613 | - | మిఖాయిల్ రోమనోవ్ - జార్ - మూడు వందల ఏళ్లు పాలించిన అతడి వంశం. |
| 1689 - 1725 | - | పీటర్-1 ద గ్రేట్ - తొలి చక్రవర్తి - సెయింట్‌పీటర్స్‌బర్గ్ స్థాపన |
| 1762 - 1796 | - | కాథరైన్-2 దగ్రేట్ - శక్తివంతమైన రష్యా. |
| 1812 | - | రష్యాపై దండెత్తిన నెపోలియన్ |
| 1861 | - | అలెగ్జాండర్-2 బానిసలకు విముక్తి |

| | | |
|---|---|---|
| **1904** | - | జపాన్ చేతిలో రష్యా ఓటమి |
| **1914-1917** | - | మొదటి ప్రపంచయుద్ధం - జర్మనీ, ఆస్ట్రియాల పైచేయి. |
| **1917** | - | బొల్షివిక్ విప్లవం - జార్ నికొలాస్ పదవీత్యాగం. లెనిన్ ఆధ్వర్యంలో రష్యన్ సోవియట్ సోషలిస్ట్ రిపబ్లిక్. రాజధానిగా మాస్కో. |
| **1918** | - | జార్‌ను హతమార్చిన బోల్షివిక్కులు. |
| **1918-21** | - | కమ్యూనిష్టు పార్టీ ప్రక్షాళన |
| | | కరువు కాటకాల్లో 5 మిలియన్ల మంది మృతి. |
| **1921** | - | లెనిన్ కొత్త ఆర్థిక సిద్ధాంతం |
| **1922** | - | USSR ఏర్పాటు. (రష్యా, ఉక్రెయిన్, బైలొరష్యా, ఆర్మీనియా, జార్జియా, అజర్‌బైజాన్‌లు) |
| **1924-29** | - | స్టాలిన్ - తొలి పంచవర్ష ప్రణాళిక - మరల కరువు |
| **1936** | - | స్టాలిన్ మహా ప్రక్షాళనలో మిలియన్ల మృతి (1953 వరకు) |
| **1941** | - | జర్మనీ దండయాత్ర |
| **1945** | - | రెండవ ప్రపంచయుద్ధం ముగింపు, రష్యా ఆధిపత్యం. |
| **1949** | - | అణు విస్ఫోటనం |
| **1953** | - | స్టాలిన్ మరణం. నికితాకృశ్చేవ్ కమ్యూనిస్ట్ పార్టీ సెక్రటరీ. |
| **1956** | - | స్టాలిన్‌ను బహిష్కరించిన కృశ్చేవ్ |
| **1961** | - | తొలి ఉపగ్రహం (మానవ చోదిత) |
| **1962** | - | క్యూబన్ మిస్సైల్ క్రైసిస్ |
| **1964** | - | లియొనిడ్ బ్రెజ్నేవ్ - కృశ్చేవ్ స్థానంలోకి |
| **1969** | - | చైనాతో సరిహద్దు వివాదం |
| **1972** | - | నిక్సన్ రాక. అణ్వాయుధ ఒప్పందం |
| **1978-82** | - | ఆఫ్ఘనిస్తాన్ ఆక్రమణ |

| | | |
|---|---|---|
| 1985-1991 | - | గొర్బచేవ్-గ్లాస్‌నోస్త్ (పారదర్శకత) పెరిస్త్రోయికా (పునర్నిర్మాణం) |
| 1991 | - | USSR వేర్పాటు - విభజన. |
| 1992 | - | బోరిస్ ఎల్ట్‌సిన్ సంస్కరణలు. కమ్యూనిజం వెనకబాటు, మాఫియా, లంచగొండితనం హవా! |
| 1994-96 | - | ఛెఛెన్యాలో అవమానం |
| 1998 | - | స్టాక్‌మార్కెట్ పతనం |
| 2000 | - | ఛెఛెన్యా తిరుగుబాటు అణచివేత - పుతిన్. |
| 2008 | - | దిమిత్రి మెద్వెదెవ్ రష్యా అధ్యక్షుడు. |
| 2014 | - | క్రిమియా రిఫరెండం. అమెరికా ఆంక్షలు. |

✤✤✤✤✤

# రష్యా సాహిత్యం - కాలరేఖ

- అయిదు నోబెల్ బహుమతులు (ఇవాన్ బ్యునిన్, బొరిస్ పాస్టర్‌నాక్, మిఖాయిల్ షోలొకొవ్, అలెగ్జాండర్ సొల్‌ఝెనిట్స్విన్, జోసెఫ్ బ్రాడ్స్కీ)
- ప్రపంచంలో ఎక్కువగా చదివేవారున్న దేశం - రష్యా.
- ప్రపంచంలో ఎక్కువ పుస్తకాలు ప్రచురించే దేశాల్లో నాల్గవ స్థానం-రష్యా.

**1) ప్రాచీన కాలం - పాత రష్యన్ భాష :**

- The tale of Igor's Campaign - ఇగార్ కథ.
- Praying of Daniel the immured - డానియెల్ ప్రార్థన.
- The lives of Saints - సాధువుల జీవితాలు.
- జాడన్స్ చైనా
- ఫిజియాలజిస్ట్, సినాప్సిస్
- మూడు సముద్రాల కావల
- బైలినాస్

**2) ప్రాచీన కాలం - పాత రష్యన్ భాష :**

మౌఖిక వాఙ్మయం - జానపద గేయాలు.
17వ శతాబ్ది మధ్యలో - అవ్వకుమ్ ఆర్చి ప్రీస్టు ఆత్మకథ

**3) 18వ శతాబ్దం - పీటర్ దగ్రేట్ కాలం / కాథరైన్ ద గ్రేట్**

- ఏంటిఖ్ దిమిత్రియెవిచ్ కాంటెమిర్ (1708-1744)
  Enlightenment Movement
- వాసిలి కిరిల్లొవిచ్ ట్రెడియాకొవ్స్కీ (1703-1769)
  పాల్ తల్లెమాంట్ - రచన రష్యాభాషలోకి-
  చర్చ్ స్లావొనిక్ భాష నుంచి అనువాదం ముఖ్యమలుపు.
- అలెగ్జాండర్ పెట్రొవిచ్ సుమరొకొవ్ (1717-1777) ఫ్రెంచి క్లాసిసిజమ్.
- మైఖెల్ వాసిలియెవిచ్ లొమొనొసొవ్ (1711-1965)
  ప్రజల భాష / పండితుల భాషగా రష్యన్ భాష

- అలెగ్జాండర్ నికొలాయె విచ్ రాడిష్‌షెవ్
  బానిసల స్థితిగతులపై వ్రాసినందుకు సైబీరియాలో ప్రవాసానికి పంపబడినాడు.
- నికొలాయి కరామ్‌జిన్ **(1766-1826)**
  స్త్రీవాద దృష్టిలో రచనలు
- గవ్రిలా రొమనొవిచ్ దెర్‌ఝావిన్ **(1743-1816)**
  స్తుతిగీతాలు, పొగడ్తలు (కాథరైన్ రాణిని)
- డెనిస్ ఫొన్‌విజిన్
  హాస్య, వ్యంగ్య అధిక్షేప రచన

**4) స్వర్ణయుగం - 19వ శతాబ్దం -** Romanticism **- భావవాదం.**
**కవిత్వం-**

- వాసిలి ఝుకొవ్‌స్కీ
- అలెగ్జాండర్ పుష్కిన్ - ప్రసిద్ధ నవల Eugene Onegin. (1799-1837)
- మిఖాయిల్ లెర్‌మొన్‌టొవ్ **(1814-1841)**
- ఎవ్‌జెని బరాట్యిన్‌స్కీ
- కాన్‌స్టాంటిన్ బత్యుష్కోవ్
- నికొలాయి నెక్రసొవ్
- అలెక్సి కాన్‌స్టాంటనొవిచ్ టొల్‌స్టాయ్
- ఫ్యొదార్ త్యుచ్చెవ్
- అఫనాశి ఫెట్ **(1812-1892)**

**వచనం - (నవల)**

- నికొలాయి గొగొల్ - నవలలు, కథలు
- నికొలాయి లెస్కోవ్ - నవలలు, కథలు
- ఇవాన్ టర్గనెవ్ - నవలలు, కథలు
- మిఖాయిల్ స్టాలికొవ్ ష్‌చెడ్రిన్ - నవలలు, కథలు
- ఇవాన్ గొంచారెల్ - నవలలు, కథలు
- లియొ టాల్‌స్టాయ్ - ప్రసిద్ధ నవలా రచయిత

- ఫ్యోదొర్ దొస్తొవ్‌స్కీ - ప్రసిద్ధ నవలా రచయిత
- ఏంటన్ ఛెకొవ్ - కథా రచయిత
- ఇవాన్ క్రైలొవ్ - ఫేబుల్స్
- ఐస్సారియాన్ బెలిన్‌స్కీ - నాన్ ఫిక్షన్ రచయిత
- అలెగ్జాండర్ హెర్జెన్ - నాన్‌ఫిక్షన్ రచయిత
- అలెగ్జాండర్ గ్రిబొయెదెవ్ - నాటక రచయిత
- అలెగ్జాండర్ ఆస్ట్రొవ్‌స్కీ - నాటక రచయిత
- కోజ్మాప్రుట్‌కొవ్ - వ్యంగ్య రచయిత.

ఈ కాలంలో సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో ఆత్మహత్యపై అనేకరకాల వివాదాలుండేవి. కథల్లో నవలల్లో హీరోయిన్లు ఆత్మహత్య చేసుకోవడమనేది సర్వసాధారణం. ఉన్నత జన్మ, ఆత్మహత్య రెండిటికీ విడదీయరాని సంబంధాన్ని సృజించారు. అన్నాకెరెనినా, బెద్నాయియా లిజా వీటికి ఉదాహరణలు. ఆత్మహత్యలలో కూడ స్త్రీ పురుష భేదాలుండేవి. మగవాడు చచ్చిపోతే పిరికితనం. స్త్రీ ఆత్మహత్య చేసుకుంటే గొప్పతనంగా భావించేవారానాడు.

**5) రజతయుగం - ఇరవై శతాబ్దం ప్రారంభం-**

**కవిత్వం - మూడు ప్రధాన వాదాలు 1) Symbolism - ప్రతీకాత్మక వాదం, 2) Acmeism - ఔన్నత్యవాదం, 3) Futurism - ఆశావాదం (భవిష్యత్‌వాదం)**

- అలెగ్జాండర్ బ్లోక్
- సెర్గి యెసినిన్
- వాలెరి బ్రైయుసొవ్
- కాన్‌స్టాంటిన్ బాల్‌మాంట్
- మిఖాయిల్ కుజ్‌మిన్
- ఇగొర్ సెవెర్యానిన్
- శాషా చొర్ని
- నికొలాయ్ గ్యుమిలియేవ్
- మాగ్జిమిలన్ వొలిషిన్
- ఇన్నొకెంటి అన్నెన్‌స్కీ
- జినెయిదా గొప్పెయిస్
- అన్నా అఖ్మతోవా

- మెరినా స్వెతాయెవా
- ఒసెప్ మాండెల్‌స్టామ్
- బోరిస్ పాస్టర్‌నాక్ (నోబెల్ బహుమతి)
- వెలిమిర్ ఖ్లెబ్నికొవ్
- డేవిడ్ బర్లియుక్
- అలెక్సి క్రుచెనిక్
- వ్లదిమిర్ మయకొవ్‌స్కీ. (1930లో ఆత్మహత్య చేసుకున్నాడు)

**Acmeist Poets (Acme - The best age of man) 1910లో నికొలాయి న్యుమిలెవ్ - సెర్జిగొరొడెట్‌స్కీలు ప్రారంభించిన Guild of Poets**

**వచనం - కథలు**

- అలెగ్జాండర్ కుప్రిన్
- ఇవాన్ బ్యునిన్ (నోబెల్ బహుమతి)
- లియొనిడ్ ఆండ్రియెవ్
- ఫెదార్ సొలొగబ్
- అలెక్సి రెమిజొవ్
- ఎవ్‌గిని జమ్యాతిన్
- దిమిత్రి మెరిఝ్‌కొవ్‌స్కి
- ఆండ్రి బెలి

6) **ఇరవైయ్యవ శతాబ్దం -**
**మయకొవ్‌స్కీ ప్రభావం, వాస్తవ పరిస్థితుల అధ్యయనం సాహిత్య దృక్పథంలో మార్పును తెచ్చింది.**

1930 - సోషలిస్ట్ రియలిజం (వాస్తవికవాదం)
- మాక్జిమ్ గోర్కీ - The Mother
- నికొలాయి ఆస్ట్రొవ్‌స్కీ - How the steel was tempered (చైనాలో కోటి, రష్యాలో మూడున్నర కోట్ల కాపీలు ప్రచురించబడిన పుస్తకం)
- అలెగ్జాండర్ ఫదెయెవ్

- Oberiu Movement - Absurdism
- OPOJAZ - రష్యన్ ఫార్మలిజం
- Serapion Brothers group

**కృశ్చేవ్ (Khrushchev Thaw) మంచు కరిగించే కాలం**

'Poetry Mass Culture Phenomenon'

- Dissidents

- Parasitism (Anti Soviet Sentiments)

**- చిన్నపిల్లల పుస్తకాలు.**

- Korney Chukovsky

- శామ్యూల్ మార్షాక్

- అగ్నియా బొర్తో

సైంటిఫిక్ ఫిక్షన్, మిస్టరీ, విలేజ్ ప్రోజ్, హిస్టారికల్ ఫిక్షన్, హారర్, ఫాంటసీ, మాజిక్ రియలిజం ఇవన్నీ క్రమేపీ సాహిత్యంలో అడుగుపెట్టాయి.

**7) సోవియట్ యూనియన్ విచ్ఛిన్నానంతరం- (ఆర్థిక మాంద్యం, ముద్రణా ఖర్చులు పెరగడం)**

- విక్టర్ పెలెవిన్
- వ్లదిమిర్ సొరొకిన్
- దిమిత్రి ప్రొగొవ్
- తాత్యానా టొల్స్తాయా
- దినా రుబినా
- మిఖాయిల్ షిషికిన్
- వాసిలి అక్సియొనొవ్

డిటెక్టివ్ కథలు, ఫాంటసీ, సైన్స్ ఫిక్షన్, హారర్ సాహిత్యం విజృంభించిందీ కాలంలో.

కవిత్వం - దిమిత్రి వొడెన్నికొవ్
- ఆంద్రి రొడియొనవ్

విమర్శ - ట్రెంట్ జాన్సన్.

**8) 21వ శతాబ్దం (New Realism) - పుతిన్ కాలం**

- ఇల్జాస్టొగొఫ్
- జఖాక్ ప్రిలెపిన్
- అలెగ్జాండర్ కరస్యొవ్

- అర్కాడిబాబ్‌చెంకో
- వ్లదిమిర్ లార్ ఛెంకొవ్
- అలెగ్జాండర్ స్నెగిర్యొవ్
- సెర్జి షర్గునొవ్

**రష్యన్ కవిత్వం, సాహిత్యంపై ఇతర దేశపు కవుల ప్రభావాలు.**

- రాబర్ట్ బర్న్స్ (Robert Burns) (స్కాటిష్) - రష్యన్ ప్రజాకవిగా పేరొందినాడు.
- లార్డ్ బైరన్ (ఇంగ్లీష్) - యోధుడు, కవిగా పేరుతెచ్చుకున్నాడు.
- విక్టర్ హ్యూగో, హానర్ డి బాల్జాక్ (ఫ్రెంచి),
- జ్యూల్స్ వెర్న్ (ఫ్రెంచి) - రష్యన్ సాహిత్యాన్ని ఎంతగానో ప్రభావితం చేసినారు.

**నోబుల్ బహుమతి పొందిన అయిదుగురు రష్యన్ రచయితలలో ముగ్గురు కవులు-**

1) ఇవాన్ బ్యునిన్ (1870-1953)

2) బోరిస్ పాస్టర్‌నాక్ (1890-1960)

3) జోసెఫ్ బ్రాడ్‌స్కి (1940-1996)

**సమకాలీన కవులు :**

1) ఎవ్‌గినీ అలెగ్జాంద్రొవిచ్ ఎవుతుషెంకో, 2) ఇవాన్ అఖ్మతోవ్, 3) గెన్నడి బగి, 4) వ్లాదిమిర్ అరిస్టొవ్, 5) సెర్గెయ బిర్యుకోవ్, 6) వ్లాదిమిర్ యార్లె 7) ఎలెన కట్సుబ, 8) డిమిట్రి గ్రిగెరియోవ్, 9) కాన్‌స్టాంటిన్ కెద్రొవ్, 10) ఇగార్ ఖాలిన్, 11) విక్టర్ క్రివులిన్, 12) అనటొలి కుద్ర విట్స్కి, 13) అలెగ్జాండర్ క్రొట్కోవ్, 14) ఆర్వొమెట్స్, 15) వెస్వలొదె నెక్రసోవ్, 16) రియాని కొనొవా, 17) గెన్రిక్ సప్గిర్, 18 అస్య ఫ్రైడెర్మన్, 19) సెర్గె స్టటనొవ్‌స్కి, 20) అలిన విటుఖ్నొవస్కయ్, 21) ఎలెన్ ష్వార్స్, 22) ఇసబెల్లా అఖతోవ్నా అఖ్మతులీన.

✣✣✣✣✣

# రష్యన్ కవిత్వ ధోరణులు

సోవియట్ రష్యాలో కవిత్వం లేక రచనలలో ప్రధానాంశాలు నాలుగు.

**1) Diversity (వైవిధ్యం)**

**2) Continuing (కొనసాగింపు)**

**3) Rupture (వైమనస్యం)**

**4) Change (మార్పు)**

బొల్షివిక్‌లు 1917లో అధికారానికి వచ్చాక చాలామంది రచయితలు ఇతర దేశాలకు వలసపోగా కొందరు రష్యాలోనే ఉండిపోయారు. జార్ అలెగ్జాండర్-2 హత్యానంతరం (1881) అలెగ్జాండర్-3; నికొలాస్-2 (1894-1917) పరిపాలనలో అప్పటికే ప్రజలలో నియంతృత్వానికి ఉన్న వ్యతిరేకభావం మరింత పెరిగినా, తిరుగుబాట్లు అణచివేయబడినాయి.

కారల్‌మార్క్స్ సిద్ధాంతాలతో ప్రభావితుడైన 'లెనిన్' నాయకత్వంలో సోషలిస్టు డెమొక్రాటిక్ లేబర్‌పార్టీ - విప్లవమే జార్ ప్రభుత్వాన్ని కూలగొడ్తుందని భావించినది. లెనిన్‌తో సహా ఎందరో నాయకులు దేశ బహిష్కారానికి గురైనారు.

1904లో జపాన్‌తో యుద్ధానికి దిగింది రష్యా. 22, జనవరి 1905 నాడు (Bloody Sunday) శ్రామికులు గుంపుగా సెయింట్ పీటర్స్‌బర్గ్ వింటర్ పాలెస్‌లో ఉన్న జార్ నికొలాస్-2కు వినతి పత్రాన్నివ్వబోగా సమాధానం కాల్పుల రూపంలో వచ్చి అనేక వందలమంది ప్రాణాలు తీసింది. ఆ తరువాత అనేకచోట్ల ప్రదర్శనలు జరగగా, 'నికొలాస్-2' అక్టోబర్ 1905లో కొన్ని సంస్కరణలు, అసెంబ్లి 'డుమా' సమావేశం, ప్రవాసంలో ఉన్న నాయకులకు క్షమాభిక్ష ప్రకటించాడు.

1912లో లెనిన్ SDLP నుంచి చీలి బొల్షివిక్ పార్టీ స్థాపించాడు. మొదటి ప్రపంచయుద్ధంలో (1917) దాదాపు మిలియన్‌కు పైగా ప్రజల్ని పోగొట్టుకున్న రష్యాలో తిరుగుబాటు ధోరణి ప్రబలమైంది. 15 మార్చి 1917లో జార్ నికొలాస్-2 పదవీత్యాగం చేసినాడు. ఏప్రిల్ 1917లో రష్యాకు తిరిగి వచ్చిన లెనిన్ అక్టోబర్‌లో అధికారాన్ని చేజిక్కించుకుని పెట్రొగ్రాడ్ (సెయింట్

పీటర్స్‌బర్గ్) నుంచి రాజధానిని మాస్కోకు మార్చినాడు. 1922లో VSSR ఏర్పడింది. 1924లో లెనిన్ మరణించాక స్టాలిన్ కమ్యూనిస్టుపార్టీ అధ్యక్షుడైనాడు. 1928లో స్టాలిన్ అధికారాన్ని చేబట్టగా వామపక్షవాది ట్రాట్స్కీ దేశాన్ని వదిలిపోయినాడు.

అప్పటివరకు 'సింబాలిజం' (ప్రతీకవాదం) ప్రధానంగా ఉన్న కవిత్వంలో రియలిజం (వాస్తవికవాదం) కానరాసాగింది. టాల్‌స్టాయ్, దొస్తొవ్‌స్కీ, టర్జనెవ్‌లు సాంఘిక, మానసిక ధోరణులను ప్రతిబింబించే నవలలు వ్రాసినారు. ఏంటన్ ఛెకోవ్ కథలు ప్రాచుర్యాన్ని పొందాయి.

రష్యన్ సింబాలిస్టులకు ప్రేరణ ఫ్రెంచి కవులు బొదలేర్, మల్లార్మె, పాల్ వెలారిన్‌లు. బాహ్యజగత్తును అడుగున, లోన ఉన్న అంతరార్థాన్ని ప్రతిబింబించే ప్రతీకలతో, సంజ్ఞలతో కవిత్వాన్ని- జినయిదా గిప్పియస్, ఆమె భర్త దిమిత్రి మెరెఝ్‌కొవస్కీ, బ్రుసోవ్, బాల్మొంట్ అలెగ్జాండర్ బ్లాక్, ఆంద్రి బెలీలు కవిత్వం; ఫెడర్ సొలొగబ్ (The little demon) 1916; బెలీ (పీటర్స్‌బర్గ్-1916) వచన రచనలు ప్రసిద్ధికెక్కినవి.

1917 తరువాత బోల్షివిక్ పరిపాలనలో గొర్కి, మిఖాయిల్ కుమిన్ (అపొలాన్ జర్నల్‌లో ప్రచురించిన On Beautiful Clarity), రియలిస్టిక్-వాస్తవికతా వాదాన్ని ప్రాచుర్యంలోకి తెచ్చారు.

సింబాలిస్టులకు వ్యతిరేకంగా ఆవిర్భవించిన Acmeists (The best age of man) - ఎక్మియిజం - ఫ్రెంచి కవుల ప్రభావంతో ముక్కుసూటిగా, దాపరికం లేని కవిత్వాన్ని చెప్పాలని భావించారు. నికొలాయి గ్యుమిలెవ్, జార్జి ఆదమొవిచ్, జార్జి ఇవనొవ్, ఎలిజనెతా, కుజ్మినా కరవీలా, సెర్జిగొరొడెట్స్కీ (సిద్ధాంతకర్త), అన్నా అఖిమతొవా, ఒసిప్ మాండెల్‌స్టామ్ ముఖ్యులు. 1920లో గ్యుమిలెవ్, ఆదమొవిచ్, ఇవనొవ్, మాండెల్‌స్టామ్, ఇవనోవ్ తదితరులు విడిపోయి అదే పేరుతో వేరే గ్రూపును పెట్టుకున్నారు.

ప్రథమ ప్రపంచ సంగ్రామం మొదలైంది (1914). బొల్షివిక్కులకు, రెడ్‌లకు (ఎర్రసైన్యానికి) మధ్య అంతర్యుద్ధం మొదలై, వాటికి తోడు యుద్ధం, కరువు కాటకాలు, రాగా బోల్షివిక్కులదే పైచేయి అయ్యింది. 1921-28 వరకు

New Economic Policy, స్టాలిన్ అధికారంలో తొలి పంచవర్ష ప్రణాళిక, పారిశ్రామికాభివృద్ధి మొదలైనాయి.

1910లో మొదలైన Futurism (భవిష్యత్‌వాదం) Acmeists ను తోసిరాజని - శిల్పము-భావము (Form and content) కు సమతుల్యతను, వర్ణనల కన్నా వస్తువుకు ప్రాతినిధ్యాన్ని పాటించింది. వీళ్లలో Ego futurists; The Mezzanine of Poetry, Centrifuge, Cuba-futurists అనే గ్రూపులు తయారయ్యాయి.

- **Ego-Poetry (తనని తాను అన్వేషించుకోవడం) :** వీళ్లపై ఇటాలియన్ కవుల ప్రభావమున్నది. కొత్త పదాలు, పోకడలతో వీళ్లు Zaum Poetry (Transrational) ని సృష్టించారు. (ఫిలిప్పో మారినెట్టి, ఇగార్ సివిరియానిన్, ఒలింపోవ్)
- **Ego-Futurist Poetry (Mezannine of Poetry) -** వాదిమ్ షెర్‌షెనివిచ్, లెవ్‌జాక్, సివిరియనిన్.
- **Centrifuge (1914) :** బోరిస్ పాస్టర్‌నాక్, నికొలాయి అసీవ్.
- **Cuba Futurists (those who will be - Budetliane) :** వెలిమిర్ ఖెల్‌బినికొవ్, ఎలినా గురొ, మయకొవ్‌స్కీ, అలెక్సి క్రుభ్నెకొవ్. వీళ్లు బొల్షివిక్కులకు అనుకూలురు.

లెనిన్‌కు Cuba futurists ల పద్ధతి నచ్చక 1919లో వాళ్లకు తోడ్పాటు నివ్వకపోవడంతోపాటు ఆంక్షలు విధించాడు.

1923లో క్యూబా ఫ్యూచరిస్టులు Lef (Left front of arts) స్థాపించినారు. 1930లో మయకొవ్‌స్కీ ఆత్మహత్య- ఫ్యూచరిజంకు ఆఖరి ఘట్టమైంది. 1932లో స్టాలిన్ ప్రభుత్వం అన్ని గ్రూపులను తొలగించి Writer's Union ను స్థాపించినది.

వాదిమ్ షెర్‌షెనివిచ్ - ఫ్యూచరిస్టు గ్రూపు నుంచి విడివడి రష్యాకు ప్రత్యేకమైన 'ఇమేజినిజం'ను ఉద్యమంగా తీసుకువచ్చాడు. (Imazinism) దీనిలో షెర్‌షినివిచ్, సెర్జి ఎసినిన్, అనటొలి మారింగాఫ్‌లు ప్రముఖులు. వీళ్లు- The purpose of the art is the revelation of life through the image and the rhythm of images' - అని ప్రతిపాదించినారు. వీళ్ల సమావేశస్థలం- The Stable of Pegassus - అనే కేఫ్. 1927లో ఈ వాదం అదృశ్యమైంది.

**ఫార్మలిజం (Formalism)** : ఫ్యూచరిజం నుంచి వృద్ధి చెందిన వాదమిది. వ్లదిఇమిర్ మయకొవ్‌స్కీ - Society for the study of poetic language - అనే సంస్థను స్థాపించినాడు. అనేకమంది కవులు, విద్యావంతులు కలిసిన ఈ ఫార్మలిజం గ్రూపు - స్వేచ్ఛా సృజనను కోరడాన్ని కమ్యూనిష్టు పార్టీ వ్యతిరేకించగా 1930లో ఈ వాదం నిష్క్రమించింది.

**Constructivism (నిర్మాణవాదము)** పాబ్లో పికాసో 'కన్‌స్ట్రక్షన్స్' వయొలిన్లతో ప్రభావితమై ఈ వాదముద్భవించింది. రాతికి బదులు ఇతర పదార్థాలను వాడి (మేకులు, వైర్లు, నట్లు, బోల్టులు) శిల్పసృష్టి చేసినట్లు- మాలెవిచ్, తాట్లిన్, ఫిలొనొవ్‌లు ఈ వాదాన్ని ప్రచారం చేసారు. 1924లో బాగ్రిట్‌స్కీ, వెరా ఇన్‌బెర్, సెల్‌విన్‌స్కీ, బోరిస్ పాస్టర్‌నాక్, జెలిన్‌స్కీలు ఈ వాదాన్ని బలపరచినారు.

**Serapion Brothers** అనేది మరో కవిత్వవాదం - జమియాటిన్, సెడిన్, ఇవనొవ్, పొలనొస్కియా, టిఖొనొవ్, కావెరిన్‌లు ఈ గ్రూపులో సభ్యులు. వీరిపై Acmeists ప్రభావమున్నది.

మార్క్స్ అన్నదాని ప్రకారం- సాహిత్యం, కళలు అధికారంలో ఉన్నవారిని నిర్వచిస్తాయి. అందుకే గోర్కీ, బొగ్దనొవ్‌లు తమ రచనలలో సాధారణ ప్రజానీకాన్ని పాత్రధారులుగా చేసినారు. వీరు లునాఛార్‌స్కీతో కలిసి Proletkult అనే సంస్థను స్థాపించి ప్రజానీకాన్ని రచయితలుగా చేయ తలచినారు. మరో గ్రూపు VAPP Oktiabr దానిలో భాగం. 1928 నాటికి ఇది Russian Association of Proletariet Writers గా రూపుదిద్దుకున్నది. డెమియాన్ బెద్నీ (పేదకవి), అలెగ్జాండర్ ఫదీవ్, మిఖాయిల్ షొలొకొవ్‌ల రచనలు ప్రచురితమైనాయి.

స్వేచ్ఛను కోరే Avant-garde గ్రూపుకు, కమ్యూనిస్టు పార్టీ అడుగు జాడల్లో నడిచే RAPP కు సంధి కుదిర్చేందుకు Pereval (The mountain pass) గ్రూపు మొదలైంది. గొలొద్నీ, స్వెత్లొవ్, బాగ్రెట్‌స్కీ, ప్లాటొనొవ్ లాంటి యాభై ఆరుగురు కవులు, రచయితలు దీనిలో సభ్యులు. వీరి వాదం ఆర్గానిక్ రియలిజం (Organic Realism). మార్క్సిస్టులుగా తమని భావించుకున్నారు వీళ్లు.

ఒబెరియు (Oberiu - The Association for Real art) 1927-30లో ప్రసిద్ధికెక్కినది. Kharms, Vvendensky, Zabolotsky తదితరులు సభ్యులు. వాస్తవికతను ప్రతిబింబించడం వీరి ఉద్దేశం.

Acmeist Poet నికొలాయి గ్యుమిలెవ్‌ను ప్రజాద్రోహిగా ముద్రవేసి (నావికుల తిరుగుబాటును సపోర్టు చేసినందుకు) మరణ శిక్ష విధించినారు (1921). తనపై ఉన్న నిర్బంధాల్ని సహిస్తూ అన్నా అఖమతొవా (1966) చనిపోయేంత వరకు రష్యాలోనే ఉండినది. అలెగ్జాండర్ బ్లాక్, వాలెరి బ్రియుసొవ్ వ్యాధుల బారిన పడి మరణించినారు.

ఇవనొవ్ ఇటలీకి (1924), సివిరియానిన్- ఎస్తొనియా, గిప్పియస్, బాల్మొంట్ - ఫ్రాన్సులోకి వలసపోయినారు. మారినా స్వెతయేవా బెర్లిన్‌లోని భర్త దగ్గరకు వెళ్లింది. తరువాత వారు ఫ్రాన్సులో నివాసమేర్పరచుకున్నారు. 1939లో సోవియట్ యూనియన్‌కు తిరిగి వచ్చింది. అప్పటికే ఆమె భర్త సెర్జి ఎఫ్రాన్ అక్కడే ఉన్నాడు. 1941లో స్వెతయేవా ఆత్మహత్య చేసుకోగా, ఎఫ్రాన్‌ను సోవియట్ జైలులో ఉరితీసారు.

గిప్పియస్, మెరెజ్‌కొవ్‌స్కీలు పారిస్‌లో The Green Lamp అనే సాహిత్య సంస్థను స్థాపించారు.

స్టాలిన్ కాలంలో మహా ప్రక్షాళన జరిగినప్పుడు (The Great Purge) ఒబెరియు కవి Kharms 1942లో జైలులో మరణించాడు. జబొలొట్‌స్కీ ఎనిమిదేళ్లు జైలుశిక్ష ననుభవించాడు. Vvdensky రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో జైలులో మరణించాడు. ఆంద్రీవ్ జైలు నుంచి విడుదలైన రెండేళ్లకు, మాండెల్‌స్టామ్ ఖైదీగా ఉన్నపుడు కన్నుమూసారు.

రెండవ ప్రపంచ యుద్ధంలో 140 మంది కవులు మరణించగా, 300 మందికి పతకాలు దక్కినాయి. జర్మనీ ముట్టడి సమయంలో లెనిన్ గ్రాడ్ కవులు, ప్రజలు చూపించిన తెగువ, సహనం మరువరానిది. మూడు మిలియన్ల ప్రజలలో దాదాపు మూడవ వంతు మరణించారప్పుడు. 8 సెప్టెంబరు 1941 నుంచి 27 జనవరి 1944 వరకు సాగిందా ముట్టడి.

**Second Wave of Emigrants - 1958**లో ఒక కవితా సంకలనాన్ని Literature abroad పేరుతో ప్రచురించారు. స్టాలిన్ మరణానంతరం (1953) వచ్చిన స్వేచ్ఛా కాలంలో అనేక రచనలు వెలువడినాయి. నికితాకృశ్చేవ్ కృశ్చేవ్‌ల కాలంలో సోషలిస్టు రియలిజంలో మార్పు రాలేదు.

Thaw (మంచు కరిగే కాలం)లో అనేక మంది కవులు, రచయితలు తమతమ భావాల్ని పుస్తకాల రూపంలో తెచ్చినారు. ప్రభుత్వ అంక్షలు,

నిర్బంధాలింకా ఉన్నాయి యథావిధిగానే. **1956**లో హంగెరియన్ తిరుగుబాటు, పోలండ్‌లో ఘర్షణతో ప్రభుత్వం కవులపై విరుచుకుపడింది. డాక్టర్ ఝివాగో నవల వ్రాసి వాసికెక్కిన బోరిస్ పాస్టర్‌నాక్‌ను నోబెల్ బహుమతిని తిరస్కరించేలా ఒత్తిడి తేవడమే కాక, Writers Union నుంచి బహిష్కరించారు.

అదేకాలంలో Avante-gardes కవులు ప్రచ్ఛన్నంగా గ్రూపులుగా ఏర్పడినారు. లియొనొజొవా గ్రూపు, Magic choir, అఖనుతొవ్ అనాధలు ఇవి కొన్ని. **1963**లో బ్రాడ్‌స్కీ అరెస్టు, జైలు Thaw period లోని నిర్బంధానికి ఆనవాళ్లు.

లియొనిద్ బ్రెజ్నేవ్ కాలం **(1964-1982)** - a period of stagnation. కవులు, రచయితలపై విచారణలు కొనసాగడంతో రహస్య కరపత్రాల పంపిణీని రచయితలు అవలంబించారు. ఇతర దేశాల్లో ముద్రించడం వాటిని రష్యాలో పంపిణీ చేయడం వంటివి ఇతర మార్గాలు.

విలేజి ప్రోజ్ (Village Prose) - వాలెంటిన్ రాస్‌పుటిన్, విక్టర్ అస్టాఫివ్, వాసిరి షుక్సిన్, వాసిలిబెలోవ్- వీళ్లు రైతుల, కూలీల జీవన విధానాల్ని తమ కవిత్వంలో ప్రస్తావించారు.

**1964**లో బ్రెజ్నేవ్ కాలంలో స్టాలిన్ కాలం నాటి మిఖాయిల్ బుల్గకొవ్ రచన The master and Margarita (1967) వెలుగులోకి వచ్చింది. సినియావ్‌స్కీ వ్రాసిన Strolls with Pushkin - 1975 లో విడుదలైంది. వెనెడిక్ట్ ఎరొఫిన్ నవల Moscow in the End of the line **1977**లో ప్రచురితమైంది.

బులాత్ ఒకుద్‌ఝూవా - కవిగాయకుడు. అతడు, అలెగ్జాండర్ గాలిక్, వ్లదిమీర్ వ్యసొట్‌స్కీలు కవిగాయకులుగా సమావేశాల్లో పాడుతూ కొత్త ఒరవడిని సృష్టించారు.

**1960** ప్రాంతంలో అమెరికన్ Pop-Art ప్రేరణతో రష్యాలో Sots-Art గ్రూపు కళలలో వాస్తవానికి, ప్రతిబింబాలకు ఉన్న తేడాను వ్యక్తపరచ ప్రయత్నించింది.

The Youngest Society of Geniuses (SMOG), Club-81, Verpa, లెనిన్ గ్రాడ్ అండర్‌గ్రౌండ్ పబ్లికేషన్స్ సాహిత్యసేవ చేసినా బాబీషెవ్, బ్రాడ్‌స్కీ,

లొసెఫ్, వొలొకొన్స్కీ లాంటి రచయితలు విదేశాలకు వలసపోయిన మూడవతరం కవులు. ఆండ్రొపొవ్ **(1982-84)**, ఛెర్నెకొవ్ **(1984-85)**ల తరువాత మిఖాయిల్ గొర్బచేవ్ **1985**లో సోవియట్ అధ్యక్షుడైనాడు. గ్లాస్‌నోస్త్, పెరిస్త్రోయికాల ప్రభావంతో అనేక బహిష్కరించబడిన రచనలు వెలుగులోకి వచ్చాయి (Returned Literature).

**Post Modernism -** అనేక వాదాలు, సంక్లిష్ట శబ్దాలు, విభిన్న శైలులు, కొత్తకొత్త కవులను వెలుగులోకి తెచ్చాయి. **19** ఆగస్టు **1991** నాడు గొర్బచేవ్‌ను గృహనిర్బంధంలో ఉంచే కుట్ర జరగగా, బొరిస్ ఎల్ట్సిన్ సాయంతో బయట పడినాడు. **25** డిశంబరు **1991** నాడు కొన్ని రిపబ్లిక్‌లు వేరుపడగా USSR అదృశ్యమై రష్యా మిగిలింది.

*****

కవులు, రచయితల మనఃస్థితి ఎప్పుడూ రాజ్యంలోని పాలక, పాలితుల మధ్య నలుగుతూ ఉంటుంది. పాలకుల్ని కీర్తించే వందిమాగధులకు, పీడిత తాడితులకై పాటలు పాడే కవిగాయకులకూ ఎప్పుడూ కవిత్వం అవకాశం కలిపిస్తూనే ఉంటుంది. శాంతి సంపదలు పుష్కలంగా ఉన్నప్పుడు వచ్చే కవిత్వానికి, ఆకలి కరువు కాటకాలు, యుద్ధ సమయాల్లో వెలువడే కవిత్వానికి తేడా అందరికీ తెలిసినదే. హృదయ జనిత కవిత్వానికి, మేధోజనిత కవిత్వానికి తేడా మనం అర్థం చేసుకోగలం.

కొందరు కవులెప్పుడూ పాలకులపై తిరుగుబాటు చేస్తూనే ఉంటారు. వారిపై ఏ ప్రభుత్వమైనా కొరడా ఝుళిపిస్తూనే ఉంటుంది. ఆ విషయంలో జార్ ప్రభువులైనా, ప్రజా ప్రతినిధుల ప్రభుత్వమైనా ఒకే విధంగా ప్రవర్తిస్తాయి. కవిత్వంలో స్వేచ్ఛను కోరుకునేవారు, విశృంఖలత్వాన్ని సమర్ధిస్తే నేటి మాధ్యమాల్లో కనిపించే శృంగార, భయానక, భీభత్సపు విశృంఖల ధోరణులు పెచ్చుమీరి హాని కలిగిస్తాయి. అందుకే కవులు, రచయితుల తాము మెలకువగా ఉండి, సమాజాన్ని మెలకువలో ఉంచాలి.

*****


Afanasy Fet


Aleksey Koltsov


Aleksey Konstantinovich Tolstoy


Aleksey Zhemchuzhnikov


Alexander Blok


Alexander Prokofiev


Alexander Pushkin


Alexander Sumarakov


Alexander Tvardovsky


Alexei Surkov


Andrey Bely


Anna Akhmatova


Apollon Grigoryev


Apollon Maykov


Boris Pasternak


Demyan Bedny


Denis Davydov


Denis Fonvizin


Dmitry Kedrin


Eduard Bagritsky


Fyodor Sologub


Fyodor Tyutchev


Gavril Derzhavin


Ilya Selvinsky



Innokenty Annensky



Iosif Utkin



Ivan Bunin



Ivan Krylov



Ivan Nikitin



Kondraty Ryleyev




Konstantin Balmont



Olga Bergholtz



Konstantin Batyushkov



Konstantin Simonov



Konstantin Sluchevsky



Leonid Martynov



Marina Tsvetayeva



Maximilian Voloshin



Mikhail Isakovsky



Mikhail Kuzmin



Mikhail Lermontov



Mikhail Lomonosov



Mikhail Svetlov



Mikhail Zenkevich



Nikolai Aseyev



Nikolai karamzin



Nikolai Klyuev



Nikolai Nekrasov


Nikolai Ogarev


Nikolai Tikhnov


Nikolai Yozkov


Nikolai Zabolotsky


Osip Mandelshtam


Semyon Kirsanov


Sergei Esenin


Sergey Gorodetsky


Stepan Shchepachev


Valeri Bryusov


Vasili Zhukovsky


Velimir Khlebnikov


Vera Inber


Vladimir Lugovskoy



Vladimir Mayakovsky


Nikolai Rylenkov


Vsevolod Rozhdestvensky


Vyacheslav Ivanov


Pavel Vasiliev


Yakov Polonsky


Yaroslov Smelyakov


Yevgeni Baratynsky


Pavel Antokolsky


Pavel Vailiev

## Dr. LANKA SIVA RAMA PRASAD



M.B.B.S; M.S (General Surgery);
M.Ch (Cardio Thoracic & Vascular Surgery)
FIVS (Fellow in Vascular Surgery)
Post Graduate Diplomate in Human Rights
Post Graduate Diplomate in Television Production
Web Engineer- Web Designer
Member of Indo- Asian Poetry Society
Founder of Writer's Corner / Srijana Lokam
Columnist - Andhra Jyothi (Nivedana)
Cell Animation Artist (Heart Animation Acadamy - Hyderabad)
Computer Animation Specialist (Pentafour- Chennai)
Founder of Waves (Warangal Aids Voluntary Educational Society)

# డాక్టర్ లంకా శివరామప్రసాద్ రచనలు

1. **సత్యాన్వేషణలో (లజ్జ–2012) (నవల) :** ప్రేమ నుంచి పేదరికం వరకూ, చరిత్ర వక్రీకరణల నుంచి ఇప్పటి యుద్ధాలవరకూ అనేక అంశాలను రచయిత కథారూపాలతో పాఠకుల ముందు పెట్టిన తీరు విలక్షణంగా ఉంది. (ఇండియాటుడే).

2. **ఆల్కెమీ (కవిత్వం) :** 'కవిత్వం ఒక ఆల్కెమీ'.

3. **How to be Happy :** a highly popular book of Prasad's narration and Jayadev's Cartoons.

4. **వానమబ్బుల కాంతిఖడ్గం (కవిత్వం) :** స్త్రీ పుట్టిన నాటినుంచి గిట్టేవరకూ పడే కడగళ్లను కవిత్వీకరించిన కవితామాలిక.

5. **సంఖ్యాశాస్త్రం :** సంఖ్యలలోని అద్భుతాలను వివరించే మార్మికశాస్త్రం.

6. **డా. జయదేవ్ కార్టూన్లు :** ప్రసాదు ట్యూన్లు+డా. జయదేవ్ కార్టూన్లు – ఓ కొత్త ప్రయోగం (ఆంధ్రజ్యోతి)

7. **జీనోమ్ (సప్తమ అంతర్థానం) :** తెలుగులో తొలి బయోటెక్నాలజీ నవల. అనేక దేశాల తత్త్వ, మత, సమాజ, విజ్ఞాన శాస్త్ర రంగాలలో మానవజాతి సాగించిన అద్భుత జిజ్ఞాసాయాత్రకు ఆధునికాక్షరభాష్యం (నడుస్తున్న చరిత్ర – ఇండియాటుడే).

8. **టీకప్పులో తుఫాను (కవిత్వం) :** పంచభూతాల ఉత్పత్తిపై ప్రాచీనుల ఊహలు, నవీన మానవుని కాలుష్యదురాక్రమణలను వివరించే దీర్ఘకావ్యం.

9. **Shades (Poetry - English) :** A rare piece of work; Shades is not a collection but a revelation. ( Dr. Jayadev)

10. **The Twilight Zone (Poetry - English)** is about the final scene of a life's drama.

11. **స్వప్నశాస్త్రం (తెలుగు) :** స్వప్నాలపై, స్వప్న విశ్లేషణలో తెలుగులో వచ్చిన ఏకైక సాధికారక గ్రంథం. (వార్త)

12. **In Search of Truth (English Novel) :** What is the ultimate Truth? a book about Death with subliminal Message.

13. **తంగేటి జున్ను (కవిత్వం) :** తీయగా, స్వచ్ఛంగా ప్రవహించిన కవితాజలధార.

14. **Soundarya Lahari (Poetry-English) :** Highly acclaimed book that has reached many places. (Sankaracharya's mystic poems explained and translated in modern perspective)

15. **Bhagavatam (Poetry-English) :** An abridged Version of Potana's Bhagavatam in simple, lucid English. The second revised edition with commentary is released.

16. **మూడు స్వప్నాలు ఒక మెలకువ (కవిత్వం) :** ముగ్గురు కవులు (పొట్లపల్లి శ్రీనివాసరావు, రామా చంద్రమౌళి, లంకా శివరామప్రసాద్‌ల కవిత్వఝురి).

17. **సుప్రసన్నాచార్య 'సాంపరాయం'** – ఇంగ్లీషు అనువాదం.

18. **రామా చంద్రమౌళి 'Fire & Ice' –** ఇంగ్లీషు అనువాదం

<u>**బహుళ ప్రజాదరణ పొందిన సప్త అనువాద కావ్యాలు:**</u>

19. **ఇలియాడ్ (తెలుగు) :** హోమర్ ప్రఖ్యాత రచన తొలిసారిగా (తెలుగులో) అందరి మన్ననలను పొందిన మహాకావ్యం. (ఆంధ్రజ్యోతి)

20. **ఒడెస్సీ (తెలుగు):** హోమర్ రచించిన ఒడెస్సీ – మహాభారత కావ్యంలా సంభ్రమాశ్చర్యాలతో ముంచెత్తే కథల్తో సాగే మహాకావ్యం. (ఇండియాటుడే)

21. **ఎపిక్ సైకిల్ (ఇతిహాసచక్రం–తెలుగు) :** గ్రీకువాఙ్మయంలో మూడవ భాగంగా వెలువడి ఎన్నో విశేషాలను తెలియజెప్పే కావ్యం. (ది హిందూ)

22. **ఈనీడ్ (Aeneid) :** వర్జిల్ మహాద్భుత రచన – తెలుగు అనువాదం

23. **తీర్థయాత్రికుని ప్రగతి (The Pilgrim's Progress) :** జాన్ బున్యన్ ప్రసిద్ధ రచనకు తెలుగు అనువాదం.

24. **డాంటే రచన డివైన్ కామెడీ - Dante's Divine Comedy** – తెలుగు అనువాదం.

25. **జాన్ మిల్టన్ ప్రసిద్ధ రచన – Paradise Lost - Paradise Regained (పారడైజ్ లాస్ట్ – పారడైజ్ రిగైన్డ్)** – తెలుగు అనువాదం.

26. **కత్తి అంచుపై...** – తెలుగు సాహిత్య చరిత్రలో వెలువడిన తొలి Noir (Black-చీకటి) నిశీధి కథల సంపుటి.

27. **దీప నిర్వాణగంధం** – మృత్యువు గురించి వివరించే అనేక అసాధారణ సంఘటనలు, కవిత్వాలు, నవీన శాస్త్ర విశ్లేషణలతో కూడిన పరిశోధనా గ్రంథం.

28. **అక్షరార్చన** – ఆంధ్రజ్యోతి నివేదనలో ధారావాహికంగా ప్రచురించబడిన వేదాంత విషయాల కదంబం.

29. **క్రీస్తు అద్భుతగీతాలు** – కరుణ, అద్భుత రసాలతో నిండిన కమనీయ కవిత్వ సంపుటి. ప్రపంచ ప్రసిద్ధ కవుల రచనలు క్రీస్తు జీవిత చరిత్ర.

30. **తమిళ సరస్వతి అందెల రవళి** – సంగం కాలం నాటి అద్భుత కవితా సంపద – వీర, శృంగార రసవాహిని.

31. **నామదేవొ ధసాల్ కవిత్వం** – ఈనాటి నుంచి ఎవరూ కవిత్వాన్ని అస్పష్టంగా రాయవద్దు' అని శాసించిన మరాఠీ కవి ధసాల్ కవిత్వం.

32. **శాంతి యుద్ధం** – మొదటి ప్రపంచ యుద్ధపు ఘట్టాల్ని, ప్రజలపై దాని ప్రభావాన్ని కవుల మాటల్లో వివరించే కవితల సంకలనం.

33. **డబ్బు-మని-షి** – హాస్యరస ప్రధానంగా ప్రపంచ కవుల కవితలకు తెలుగు అనువాద సంపుటి.

34. **విలియం బ్లేక్ కవిత్వం** – తన మార్మిక కవిత్వం, చిత్ర రచనలతో ప్రపంచాన్ని అబ్బురపరచిన బ్లేక్ కవిత్వ నిధి.

35. **ఫాస్ట్-గేథే రచన** – జర్మన్ సాహిత్యంలో తలమానికమై అత్యధిక ప్రాచుర్యాన్ని పొందిన విషాదాంత నాటకం. 'ఆత్మను సైతానుకు అమ్మిన మానవుడిగా' తెలుగులో వెలువడినది..

36. **ప్రపంచ ప్రసిద్ధ కథలు** – విశ్వవిఖ్యాత కథకుల ప్రసిద్ధ కథలు.

37. **కుయ్యోమొర్రో శతకం** (ఛందోబంధ రహితం)

38. **మూడు ప్రాచీన గ్రీకు నాటకాలు** – ఇడిపస్ రెక్స్, ఏంటిగొని, ట్రోజన్ వుమెన్ – ప్రపంచ ప్రసిద్ధికెక్కిన విషాదాంత నాటకాలు – తెలుగులో.

39. **భైరవ శతకం** (విభజనానంతర కవిత్వం)

40. **Bouquet of Telugu Songs and Lyrics (Telugu Learning Kit)**

41. **శిలప్పదికారం** – కాలి అందియ కథ. తమిళ మహాకావ్యానికి దీటైన తెలుగు అనువాద కావ్యం.

42. **మణిమేఖల** – 'శిలప్పదికారం' తరువాత ఘట్టం. శాత్తనార్ రచనకు తెలుగు అనువాదం.

## **త్వరలో...**

**43.** **కలలు–విశ్లేషణ – స్వప్నశాస్త్రం రెండవభాగం (త్వరలో)**

**44.** **క్రీస్తు నడచిన దారి –** కరుణామయుడి పదముద్రలపై కవుల కవితాభినివేశం. **(త్వరలో)**

**45.** **The Poems of Kuppam –** సీతారాం రచనకు ఇంగ్లీషు అనువాదం– **'Montages'.**

**46.** **దళిత వ్యాకరణం (The broken grammar) –** తుల్లిమల్లి విల్సన్ సుధాకర్ రచనకు ఇంగ్లీషు అనువాదం.

**47.** **మాకూ ఓ భాష కావాలి (We need a language)–** తుల్లిమల్లి విల్సన్ సుధాకర్ రచనకు ఇంగ్లీషు అనువాదం.

**48.** **అగ్నివృక్షం (The tree of Fire)–** ప్రొఫెసర్ అనుమాండ్ల భూమయ్య రచనకు ఇంగ్లీషు అనువాదం.

**49.** **రక్తకాసారం (The Blood Pond)–** అంపశయ్య నవీన్ ప్రఖ్యాత నవలకు ఇంగ్లీషు అనువాదం.

**50.** **Eighteen English Poets** – తెలుగులో **(త్వరలో)**

**51.** **మస్నవి –** మౌలానా జలాలుద్దీన్ రూమి అలౌకిక ద్విపదలు– తెలుగులో (త్వరలో)

**52.** **This is no streaking -** K.K. Menon Stories into English.

**53.** **రసధుని –** మూడు శతాబ్దాల, రెండువందల సంవత్సరాల (1770–1970) రష్యన్ కవిత్వ ప్రవాహం.

**54.** **కాయగూర శతకం –** 'తినబోతూ రుచి అడగనేల'

**55.** **అయ్యబాబోయ్ శతకం –** వర్తమాన రాజకీయాలపై వ్యంగ్యాస్త్రాలు.

ప్రపంచ సాహిత్యం - 19

మూడు శతాబ్దాల,
రెండు వందల సంవత్సరాల
కవిత్వ ప్రవాహం

# రసధుని

(రష్యన్ కవిత్వం)

డాక్టర్ లంకా శివరామప్రసాద్